ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 21, ఫిబ్రవరి 2025

● కనిగిరి ప్రాంతానికి చెందిన ఓ ఉపాధ్యాయుడికి గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశారు. 'సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం. మీపై బెంగళూరులో కేసు నమోదు అయ్యింది. మిమ్మల్ని అరెస్టు చేయకుండా బెయిల్ ఇవ్వాలంటే కొంత మొత్తం డబ్బులు పంపాలి' అని డిమాండ్ చేశారు. దీంతో భయపడిన బాధితుడు తన అకౌంట్ నుంచి ఆర్టీజీఎస్, ఫోన్‌పే ద్వారా సుమారు రూ.36లక్షలు నగదు బదిలీ చేశారు. అనంతరం వారి నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో తాను మోసపోయానని తెలుసుకొని ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు.

● ఒంగోలుకు చెందిన యువకుడు ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్నాడు. అతని తల్లిదండ్రులు నగరంలోనే ఉంటున్నారు. ఇటీవల యువకుడి తండ్రికి గుర్తుతెలియని నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. 'నేను డీఎస్పీ కేడర్ అధికారిని. మీ అబ్బాయి ఆస్ట్రేలియాలో డ్రగ్స్ కేసులో అరెస్టు అయ్యాడు. డబ్బులిస్తే నేను కాంప్రమైజ్ చేస్తా. ఫోన్‌పే, గూగుల్ పే చేయాలి' అని బెదిరించాడు. హిందీ, ఇంగ్లీష్ మాట్లాడటంతో అనుమానం వచ్చిన తండ్రి వీడియో కాల్‌లో చూపమని కోరగా సరేనన్నాడు. ఈలోపే ఫోన్ కట్ చేసి కుమారుడికి వీడియో కాల్ చేయడంతో అతను మామూలుగానే ఉన్నానని చెప్పడంతో అది ఫేక్ కాల్ అని తేలింది.





సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇప్పటివరకు బ్యాంకు అకౌంట్లు, క్రెడిట్ కార్డులకు సంబంధించి ఫోన్ చేస్తున్నామంటూ ఆన్‌లైన్ మోసాలతో నగదును కాజేసిన కేటుగాళ్లు రూటుమార్చారు. పోలీసు, ఏసీబీ, సీబీఐ అధికారులమంటూ కొత్త అవతారం ఎత్తుతున్నారు. రకరకాల మార్గాలలో ఉద్యోగులు, ఉన్నత, మధ్యతరగతి వారి వివరాలు తెలుసుకుని ట్రాప్ చేస్తున్నారు. వాట్సాప్ ద్వారా కాల్ చేసి మొత్తం వ్యవహారం తమ దగ్గర ఉందని, సెటిల్ చేసుకోవాలని డబ్బు డిమాండ్ చేస్తున్నారు. వీడియో కాల్ చేసి పోలీసు డ్రెస్‌లలో బెదిరిస్తున్నారు. ఇలా మోసపోయినవారు కొందరే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. చాలావరకు పరువు పోతుందనే భయంతో మిన్నకుండిపోతున్నారు. అదే సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారింది.

కాల్‌కేయులు!

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- ఏసీబీ, సీబీఐ అధికారులం అంటూ వల
- పోలీసు డ్రెస్‌లతో వాట్సాప్ వీడియో కాల్స్
- జిల్లాలో ఇద్దరు అధికారులకూ బెదిరింపులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- త్వరలో జిల్లాకో సైబర్ క్రైం పోలీసు స్టేషన్

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడంలో కొత్తపుంతలు తొక్కుతున్నారు. కొందరి అత్యాశ, భయాందోళనలను ఆసరాగా చేసుకొని బ్యాంక్ ఖాతాలలో ఉన్న నగదును కాజేస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఇద్దరు ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఏసీబీ అధికారులమంటూ ఫోన్ చేసి బెదిరించడంతో అప్రమత్తమైన అధికారులు ఉన్నతాధికారుల ద్వారా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. సర్పంచ్ భర్తకు ఇదేతరహాలో మోసగాళ్లు ఫోన్ చేయగా పోలీసులు సకాలంలో స్పందించి వెంటనే



నేరగాళ్ల ఆట కట్టించి కటకటాల పాల్జేశారు. ఎన్‌ఆర్‌ఐ పిల్లల తల్లిదండ్రులకు కూడా ఫోన్ చేసి బెదిరిస్తున్న పరిస్థితి. ఇలాంటి ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అనేక రకాలుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు ఓ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు.

ఏసీబీ అధికారులమంటూ ఫోన్ కాల్స్

ఒంగోలు నగర కార్పొరేషన్‌లో పనిచేసే శానిటరీ ఉద్యోగికి ఈనెల 24న ఏసీబీ అధికారులమంటూ గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ చేశారు. మీ అవినీతి భాగోతం అంతా తెలుసని బెదిరించారు. తాము చెప్పిన ఖాతాలో కొంత నగదు జమచేయాలని హుకుం జారీ చేశారు. దీంతో భయపడిపోయిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి ఏసీబీ కాల్ విషయం చెప్పారు. వెంటనే కమిషనర్ ఎస్పీతో మాట్లాడారు.

మిగతా 6లో...

డిజిటల్ అరెస్టులు పోలీసులు చేయరు



పోలీసు శాఖలో డిజిటల్ అరెస్టు చేయడం అనేది లేదు. ఏదైనా కేసు నమోదు అయితే ఆయా ప్రాంతాలలో ఉన్న లోకల్ పోలీసులకు తెలియకుండా ఎలాంటి అరెస్టు చేయరు. తెలియనివారు వీడియో కాల్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయకుండా ఉండటమే ఉత్తమం. అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. హెల్ప్‌లైన్ నంబరు 1930కు కాల్ చేయాలి. ఏసీబీ అధికారులు ఎవరూ నేరుగా ఉద్యోగులకు ఫోన్ చేయరు. అదేవిధంగా డిజిటల్ అరెస్టు అంటూ వచ్చే వీడియోకాల్స్‌కు భయపడవద్దు. సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, ఈ-మెయిల్స్, ఎస్ఎంఎస్‌లకు స్పందించొద్దు. - ఎస్పీ ఏఆర్.దామోదర్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శిస్తున్న మంత్రి స్వామి

వేడి పాలు పడి బాలుడికి గాయాలు

● మంత్రి స్వామి పరామర్శ

టంగుటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : శరీరంపై వేడిపాలుపడి బాలుడికి గాయాలైన ఘటన స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. ఐదో తరగతి చదువుతున్న ఎం.మధుమోహన్ శరీరంపైనా, చేతులపైనా కాలిన గాయాలయ్యాయి. బాలుడిని ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఉదయం పాలుతాగే సమయంలో వార్డెన్ చూసుకోవాల్సిన పనులు విద్యార్థులు చేస్తున్నారని, పెద్దమగ్గుతో విద్యార్థులు వేడి పాలు తెస్తుండగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని బాలుడి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు.

● మంత్రి పరామర్శ

ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పరామర్శించారు. విద్యార్థి గాయపడడానికి గల కారణాలపై ఆరా తీశారు.



ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయశాఖ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఇతర అధికారులు

ప్రకృతి సాగును ప్రోత్సహించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. అందుకు అవసరమైన విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌కు కార్యాచరణ ప్రణాళికపై గురువారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మారిన జీవనశైలితో ఆరోగ్యం దెబ్బతింటుందని, ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ఆహారమే ఔషధంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌లో కూడా సౌభాగ్యం, ఆరోగ్యం, సంతోషకరమైన రాష్ట్రం ఆవిష్కరణ లక్ష్యంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఆర్గానిక్ సేద్యాన్ని ప్రోత్సహించడంతోపాటు ఈ ఉత్పత్తులకు అవసరమైన మార్కెటింగ్ కూడా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలలో ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ఒక చర్చనీయాంశంగా చేర్చాలన్నారు. తక్కువ స్థలంలో పెరటి సాగు చేసుకోవడంపైనా అవగాహన కల్పించాలన్నారు. రైతులకు శాస్త్రవేత్తల ద్వారా సలహాలు ఇప్పించడంతోపాటు సాగులో పాటించాల్సిన మెలకువలను మొబైల్ యాప్‌ల ద్వారా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) ద్వారా అందిస్తున్న సేవలను ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణీ వివరించారు. ఆర్గానిక్ సాగును, ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ, అనుభవాలను, సాగు చేస్తున్న దేశవాళీ రకాలను పలువురు రైతులు కూడా ఈ సందర్భంగా వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ పాల్గొన్నారు.

అధికారం ఉందని గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు అక్రమాలకు తెగబడ్డారు. అడ్డుకునేవారు లేరని అదిరించి బెదిరించి అందినకాడికి భూములను లాగేసుకున్నారు. రూ.కోట్ల విలువైన స్థలాలను కొల్లగొట్టారు. ప్రభుత్వం మారడంతో కంగుతిన్నారు. అక్రమాలు బయటకురాకుండా కొందరు అధికారులతో కలిసి డేటాను తొలగించడం, రికార్డులను తగలబెట్టడం, గల్లంతు చేయడం లాంటి దురాగతాలకు దిగడం వైసీపీ నేతలకు అలవాటైన పనిలా మారింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి దుర్మార్గాలకు దిగిన ఆ పార్టీ నేతలు ఒంగోలులోనూ అటువంటి దిగజారుడు పనికి పాల్పడ్డారు. రూ.కోట్ల విలువైన భూ అక్రమాలకు సంబంధించిన రికార్డులను గల్లంతు చేశారు. కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. ఆ కథేంటో చూద్దాం...

గల్లంతుల్లో రికార్డు



- కదులుతున్న... వైసీపీ నేతల భూ అక్రమాల డొంక
- ఒంగోలులో రూ.కోట్ల విలువైన భూముల ఆక్రమణ
- వాటి రికార్డులు మాయం చేసిన వైనం
- విచారణకు ఆదేశించిన కలెక్టర్ అన్సారియా
- నివేదికను అందజేసిన ఒంగోలు ఆర్డీవో

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యనేతకు అనుచరుడిగా ఉన్న అద్దంకి నియోజకవర్గానికి చెందిన ఒక నేత రూ.కోట్ల విలువైన స్థలానికి గాలం వేసి సొంతం చేసుకున్నారు. నగరంలోని మంగమూరు రోడ్డులోని 267 సర్వే నెంబరులోని 6.28 ఎకరాలు సొంతం చేసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ స్థలాన్ని కాజేసేందుకు కుట్ర పన్నారు. అప్పట్లో పనిచేసిన తహసీల్దార్‌పై ఒత్తిడి చేయడంతో ఆ పని తన వల్లకాదని బదిలీ చేయించుకున్నారు. అయితే ఒక తహసీల్దార్ తాను ఏమి చెప్పినా చేసేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ఒంగోలుకు వచ్చారు. ఆయన వచ్చిన తర్వాత రూ.కోట్ల విలువైన స్థలాన్ని అప్పటి వైసీపీ నేతకు మ్యుటేషన్ చేశారు. ఆ స్థలం ఎప్పటి నుంచో వివాదంలో ఉంది. అయినా అప్పటి అధికార పార్టీ నేతల అండదండలతో ఆ సర్వే నెంబరులోని భూములను మ్యుటేషన్ చేశారు. అయితే ఆ భూమి హక్కుదారులు ఎవరనే విషయం నిర్ధారించుకోకుండా అప్పటి ఒంగోలు తహసీల్దార్ నయీమ్ అహ్మద్ ఏకపక్షంగా మ్యుటేషన్ చేశారని ఒంగోలుకు చెందిన శేష వెంకటకృష్ణకుమారి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన హైకోర్టు అందుకు సంబంధించిన రికార్డులను న్యాయస్థానం ముందు ఉంచాలని ఆదేశించింది. ఆ రికార్డులను హైకోర్టుకు అప్పగించేందుకు పరిశీలించగా 267 సర్వే నెంబరుకు సంబంధించిన ఫైళ్లు కనిపించలేదు. ఒంగోలు తహసీల్దార్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆ రికార్డులపై విచారణ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ అన్సారియాను ఆదేశించింది. స్పందించిన కలెక్టర్ ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నను విచారణకు ఆదేశించారు. ఆమె ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. హైకోర్టు ఆదేశించిన సర్వే నెంబర్‌కు సంబంధించిన రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో లేనట్లు గుర్తించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి తహసీల్దార్ నయీమ్ అహ్మద్‌కు షోకాజ్ నోటీసులు జారీచేశారు. మరోవైపు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న విచారణ చేసిన నివేదికను బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఇచ్చినట్లు సమాచారం.

ఎన్టీఆర్ పార్కు అభివృద్ధికి రూ.28.05 లక్షలతో... టెండర్లు

- మరో రూ.10లక్షలతో ఆటవస్తువుల కొనుగోలు, స్థలం అభివృద్ధి పనులు
- 37వ డివిజన్‌లో 'అక్షరం అండగా- పరిష్కారం అజెండాగా..' పనులపై దృష్టి
- రూ.93.85లక్షలతో ప్రాధాన్యతాక్రమంలో పనులు
- త్వరలో ఎమ్మెల్యే దామచర్ల చేతులమీదుగా ప్రారంభం
- పార్కును పరిశీలించిన కమిషనర్ వెంకటేశ్వరరావు



ఎన్టీఆర్ పార్కులో ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వర్లు

ఒంగోలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని 37వ డివిజన్ పరిధిలో కీలక సమస్యల పరిష్కారంపై కార్పొరేషన్ అధికారులు కార్యచరణ చేపట్టారు. తొలిగా ఆ డివిజన్‌తోపాటు పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది వాకింగ్, జిమ్‌తోపాటు పిల్లలు ఆడుకునే ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులపై దృష్టిపెట్టారు. అందుకు సంబంధించి రూ.28.05 లక్షలతో పార్కులో లెవలింగ్, అలాగే వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటుకు టెండర్లను ఖరారు చేయడంతోపాటు మరో రూ.10లక్షలతో పిల్లలు ఆడుకునే వస్తువుల మరమ్మతులు, కొత్తవి కొనుగోలు, ఆటస్థలంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. టెండర్ల ఖరారు నేపథ్యంలో కార్పొరేషన్ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు గురువారం పార్కును సందర్శించారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాలరావు, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మేడికొండ మోహన్‌రావు, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా 'అక్షరమే అండగా- పరిష్కారమే అజెండాగా..' నినాదంతో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' గత నెలాఖరులో చర్చావేదికలు నిర్వహించిన విషయం విదితమే. అందులోభాగంగా ఒంగోలు నగరంలోని 37వ డివిజన్ ఎన్టీఆర్ పార్కులో గతనెల 28న చర్చావేదిక జరిగింది. స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావులు అతిథులుగా పాల్గొనగా దాదాపు ఆరేడు వందల మంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు. 70మంది వరకు పలు సమస్యలను ప్రస్తావించారు.

పార్కు అభివృద్ధిపై ప్రస్తావన

ప్రధానంగా పార్కు అభివృద్ధి అంశంపై కీలక ప్రస్తావన జరగ్గా డివిజన్‌లో రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలు, శానిటేషన్ అభివృద్ధి ఇతర పలు భూసమస్యలు, ఆక్రమణల తొలగింపు, ట్రాఫిక్ సమస్యలపై మాట్లాడారు. వాటిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సుమారు రూ.7.50 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని, ఈసారి రూ.10కోట్లతో మిగిలిన అన్ని పనులు చేయనున్నట్లు ప్రకటించారు. రానున్న నాలుగు నెలల్లో వాటిని ఒక కొలిక్కి తెస్తామన్నారు. ప్రజలందరికి ఉపకరించే పార్కు అభివృద్ధి పనులను నెలలోనే చేపడుతామని వాగ్దానం చేశారు. తదనుగుణ చర్యలకు అధికారులకు సూచించారు. దీంతో కమిషనర్

మిగతా 6లో...



శరవేగంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం

వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

- గత ప్రభుత్వంలో నత్తనడకన సాగిన వైనం
- సీఎం చంద్రబాబు ఆదేశంతో పనుల పరుగు

7

వెలిగొండకు రూ.2వేల కోట్లు కేటాయించాలి





కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ ప్రతినిధి బృందం, లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు రూ.2వేల కోట్ల నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ ప్రతినిధి బృంద సభ్యులు కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో పాటు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పరిష్కారానికి 2025-26 బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లాలని కోరారు. అత్యంత స్వల్ప వర్షపాతం నమోదవుతూ నిత్యం కరువుతో అల్లాడుతున్న పశ్చిమ ప్రాంత ప్రజలకు ఈ ప్రాజెక్టు వరప్రసాదిని అన్నారు. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా నికర జలాలను కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లాని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, వడ్డే హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, శ్రీరామ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

జిల్లాలో గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఒంగోలులో లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్‌కు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డే హనుమారెడ్డి, కె.వీరారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారన్నారు. ఆహార పంటలు, వాణిజ్య పంటలు, కూరగాయాలు తదితర పంటలను పండిస్తున్నది కౌలు రైతులేనని తెలిపారు. గుర్తింపు కార్డులు ఉన్నా కౌలు రైతులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉన్నా అమలు జరగడం లేదన్నారు. అందువల్లఎలాంటి ఆంక్షలు లేకుండా రుణాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, పావులూరి అంజయ్య, లెనిన్ పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించేలా పనిచేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించే ప్రధాన భూమిక ఉపాధ్యాయులదేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాపరిషత్‌లో గురువారం జిల్లా స్థాయి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల కళాశాలల్లో బాలల హక్కుల పరిరక్షణ అమలుపై జరుగుతున్న తీరుపై నిర్వహించిన సమావేశం డీఈవో కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పిల్లలపై మొబైల్ ప్రభావాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. వారిని ఒత్తిడికి గురిచేయకుడా చదువుతో పాటు క్రీడలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత పెంపొందించే విధంగా తయారు చేయాలని చెప్పారు. చదవంటే కేవలం డాక్టర్లు, ఇంజనీర్ మాత్రమే కాదని, ఇతర అనేక రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని, చిన్న వయస్సులోనే పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలోనూ కంప్లైంట్ బాక్సులను అలంకార ప్రాయంగా కాకుండా పిల్లలందరికీ తెలిసేలా బహిరంగంగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వివరాలను కూడా నోటీసు బోర్డులో ఉంచాలని చెప్పారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టిక్కెట్లను నిర్ణీత సమయంలో ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ మండలి సభ్యురాలు నిలిమవంశీలత, ఐసీడీఎస్ పీడీ హేమసుజన్, బాలల సంరక్షణ విభాగ అధికారి దినేష్‌కుమార్, ఎంఈవోలు, కేజీబీవీ, గురుకుల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూపు-2, ఇంటర్మీడియెట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆయా పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ పరీక్షల నిర్వహణపై సమావేశమై మాట్లాడారు.

23న గ్రూపు-2 పరీక్షలు

జిల్లాలో ఈనెల 23న జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందిగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. ఈ పరీక్షలకు 4,544 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో 8801188046 సెల్ నెంబర్‌తో కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై...

జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 42,439 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా అందుకోసం 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు మూడు సిట్టింగ్ స్క్వాడ్స్, మరో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 24 గంటలు పనిచేసేలా జిల్లా స్థాయిలో 08592-281275 నెంబర్‌తో కంట్రోలు రూమును ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

‘కాల్’కేయులు!

(5వపేజీ తరువాయి)

అత్యంత వేగంగా స్పందించిన ఎస్పీ ఏఆర్.దామోదర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వచ్చిన కాల్ గురించి ఆరా తీయగా అది బెంగళూరు నుంచి వచ్చిందని గుర్తించారు. ఇలాంటి ఫేక్ కాల్స్‌ను నమ్మవద్దని తెలిపారు.

- గత నెల 21న ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్నా అంటూ హౌసింగ్ పీడీకి కాల్ చేసి మీ డీఈ నంబరు కావాలని అడిగి తీసుకున్నారు. అనంతరం డీఈకి ఫోన్ చేసి మీ అవినీతి ఆగడాలు పెచ్చరిల్లుతున్నాయని బెదిరించారు. మీ జోలికి రాకుండా ఉండాలంటే భారీగా డబ్బు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన వారు ఎస్పీని సంప్రదించి జరిగిన విషయం చెప్పారు.

- గతేడాది చివర్లో మద్దిపాడు మండలంలోని ఓ సర్పంచ్ భర్తకు సైబర్ నేరగాళ్లు కాల్ చేశారు. తాము డీజీపీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీ గ్రామంలో సర్పంచ్‌గా మీ భార్య ఉన్నారని, మీ అవినీతి మూలంగా చెక్‌పవర్ రద్దయ్యిందని బెదిరించారు. ఇంకా అనేక రకాలుగా అవినీతి సొమ్ము పోగేసుకున్నారని వివరించారు. రూ.2లక్షలు నగదు ఇస్తే మీరు ఆ కేసు నుంచి బయటపడతారని నమ్మించారు. దీంతో భయపడి పదివేలు నగదును సైబర్ నేరగాళ్ల ఖాతాకు జమచేశారు. ఆ తర్వాత అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. ఒంగోలు రూరల్ సీఐ కేసు నమోదు చేసి నేరానికి పాల్పడిన తండ్రి, కుమారుడిని అరెస్టు చేశారు.

రూ.28.05 లక్షలతో టెండర్లు

(5వపేజీ తరువాయి)

వెంకటేశ్వరరావు నేతృత్వంలో అధికారులు కదిలారు. తొలుత సుజాతనగర్ ప్రధాన రోడ్డులో శానిటేషన్, పూడికతీత చర్యలు చేపట్టగా అనంతరం చెన్నకేశవ లేఅవుట్‌లో నిలిచిపోయిన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. మిగిలిన వాటిలో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై దృష్టిసారించారు.

13 పనులపై కార్యచరణ

సుమారు రూ.93.85లక్షలతో 13 పనులపై కార్యాచరణ రూపొందించారు. ప్రధానంగా పార్కులో లెవలింగ్, ట్రాక్‌ల నిర్మాణం, పలుచోట్ల సిమెంట్ రోడ్లు, డ్రైన్లు పనులు వాటిలో ఉన్నాయి. రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఒక్కొక్క పనిని చేపట్టనున్నారు. అందులో రూ.28.05 లక్షలతో ఎన్టీఆర్ పార్కులో 14 అడుగుల వెడల్పున 385 మీటర్ల నిడివి ఉండే వాకింగ్ ట్రాక్ నిర్మాణంతోపాటు లెవలింగ్ పనులకు టెండర్లను కూడా పిలిచి ఖరారు చేశారు. మరో రూ.10 లక్షలతో పిల్లల వస్తువులు కొత్తవి కొనుగోలు చేయడంతోపాటు ఆట స్థలంలో అభివృద్ధి పనులు చేయనున్నారు. మిగిలిన పనులను దశల వారీగా చేపట్టేలా కార్యచరణ రూపొందించారు.

స్థానికులు ఆర్థిక సహకారం అందించాలి

పార్కులో పనులకు టెండర్లు ఖరారు నేపథ్యంలో గురువారం కమిషనర్ వెంకటేశ్వరరావు పార్కును సందర్శించి స్థానికులు, వాకర్స్‌తో మాట్లాడారు. పార్కులో అభివృద్ధి పనులకు ఇంజనీరింగ్ అధికారులు రూపొందించిన పనులను పరిశీలించారు. ట్రాక్ ఏర్పాటుపై కొలతలు వేయించి సిబ్బందికి సూచనలు చేశారు. పార్కులో ప్రస్తుతం ఉన్న మొక్కలు, చెట్లకు ఎలాంటి నష్టం జరగకుండా పనులు చేపట్టాలని కోరారు. అలాగే స్థానికులు స్పందించి పార్కు అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా అక్కడ చేపట్టాల్సిన పలు పనులను కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాలరావు, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మేడికొండ మోహన్‌రావులు కమిషనర్, ఇతర అధికారుల దృష్టికి తెచ్చారు. స్థానిక నాయకులు నిడమానూరి పావని, ఆలా నరసింహారావుతోపాటు వాకర్స్ ప్రతినిధులు ఆయా అంశాలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. కాగా త్వరలో పార్కు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేత శంకుస్థాపన చేపించి ప్రారంభిస్తామని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

సామాజిక తనిఖీలో రూ.8లక్షల రికవరీ

- సోషల్ ఆడిట్‌పై ప్రజల్లో సన్నగిల్లుతున్న నమ్మకం
- వైసీపీ పాలనలో రూ.13 కోట్లతో పనులు
- పెద్ద ఎత్తున అవినీతి..తూతూమంత్రంగా ఆడిట్

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకానికి సంబంధించి రెండేళ్ల కాలానికి గాను సామాజిక తనిఖీ పూర్తి కాగా అధికారులు కేవలం రూ.8 లక్షలతో చేపట్టిన పనులలో మాత్రమే అవకతవకలు జరిగాయని గుర్తించారు. మొత్తం రూ.13కోట్ల పనులు గత వైసీపీ హయాంలో జరగ్గా పెద్ద ఎత్తున గ్రామాలలో ఉపాధి పనులలో అవకతవకలు చోటుచేసుకున్నాయి.

అక్రమాలు ఇలా...

కొన్ని గ్రామాలలో రోడ్లు వేయకుండానే, అలానే మొక్కలు లేకుండానే, కొందరు పనులకు వెళ్లకుండా బోగస్ మస్టర్లు వేసి నిధులు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. అంతేగాక కొన్నిచోట్ల ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కూలి సొమ్ము చెల్లించడం, మరి కొన్ని చోట్ల ఉపాధి సిబ్బంది క్షేత్ర సహాయకుల నుంచి బోగస్ మస్టర్లు వేసినందుకు నగదు వసూళ్ల చేయడం, ఎంబుక్‌లు లేకుండానే పనులకు నిధులు మంజూరు చేయడం వంటి అభియోగాలను సామాజిక తనిఖీలో బృందాలు గుర్తించాయి.

ప్రజా వేదిక కార్యక్రమాన్ని గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు తెలియకుండా రెండు రోజుల కిందట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు. అధికారులు రాకముందే ఉపాధి సిబ్బంది తాము అంతా సెటిల్ చేసుకున్నాం తమకు ఏమీ కాదని బహిరంగంగా ప్రచారం చేశారు. ఆ ప్రచారం వలే సామాజిక తనిఖీలో అధికారులు గత వైసీపీ పాలనలో పనిచేసి ఉద్యోగాలు మాని వేసిన వారికి పెనాల్టీలు విధించి చేతులు దులుపుకున్నారు. మొత్తం రూ.8లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు గుర్తించగా.. అందులో గతంలో పనిచేసిన 18 మంది క్షేత్ర సహాయకులకు రూ.7లక్షల వరకు రికవరీలు వసూళ్ల చేయాలని పెనాల్టీలు వేశా రు. ఆడిట్‌కు మాత్రం



సామాజిక తనిఖీ కార్యక్రమంలో అధికారులు (ఫైల్)

గతంలో పనిచేసిన క్షేత్ర సహాయకులు గైర్హాజరు కావడం గమనార్హం. వారిని అటు వైపు రాకుండా అధికారులే ప్లాన్‌గీసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి సిబ్బందికి రూ.లక్ష వరకు రికవరీలు రాశారు. అధికారులకు తెలియకుండా క్షేత్ర సహాయకులు అవకతవకలకు ఎలా పాల్పడతారని తరచూ తనిఖీలు చేసే అధికారులు పనుల వద్ద ఏం పరిశీలన చేశారని, గతంలో జరిగిన తప్పులకు అధికారుల పాత్ర కూడా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. సామిజిక తనిఖీలపై నమ్మకం పోతుందని వారు అంటున్నారు. ఉపాధి పనులలో లోపాలు గుర్తించేందుకు లక్షలు ఖర్చు చేస్తూ చేస్తున్న ఆడిట్‌లు ఇకముందైనా సక్రమంగా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొణికి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర

టీడీపీ గెలవడంతో మొక్కుతీర్చు కుంటున్న టీడీపీ నాయకులు

ఇంకొల్లు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణికి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గుది సీతారామయ్య ఆధ్వర్యంలో కొణికి నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రను గురువారం మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. 20024లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో కడిగిన ముత్యంలా బాబు విడుదల కావాలని, పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని, ఏలూరి సాంబశివరావు మూడోసారి గెలవాలని మండలంలోని కొణికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గుది సీతారామయ్య శ్రీశైలానికి పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు శివస్వామి దీక్షధారణ చేసి గురువారం కొణికి నుంచి శ్రీశైలంకు పాదయాత్రతో బయలుదేరారు.

బస్సులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

- తిరునాళ్లకు వెళ్లి వస్తుండగా ఘటన
- 10 తులాల బంగారం అపహరణ

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరునాళ్లకు వెళ్లి బస్సులో తిరిగి వస్తుండగా, పక్కన కూర్చున్న మహిళలే బ్యాగ్‌ను చోరీ చేసిన ఘటన గిద్దలూరులో చోటుచేసుకొంది. దీంతో బ్యాగులోని 10 తులాల బంగారం అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గిద్దలూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన చాబోలు లక్ష్మీదేవి తన కుమారుడు, కోడలితో కలిసి ఈ నెల 18న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని అహోబిలం పుణ్యక్షేత్రంలో జరుగుతున్న తిరునాళ్లకు వెళ్లారు. తిరునాళ్ల ముగిసిన తర్వాత అహోబిలం నుంచి గాజులపల్లె వరకు బస్సులో వచ్చారు. గాజులపల్లె వద్ద గురువారం ఉదయం టిఫిన్ చేసి తరువాత నంద్యాల-విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఎక్కారు. బస్సులో బంగారు కలిగి ఉన్న బ్యాగ్ తన వద్దనే ఉంచుకొని లక్ష్మీదేవి కూర్చొన్నారు. అక్కడే మరో ముగ్గురు మహిళలు కూడా బస్సులో ఎక్కారు. లక్ష్మీదేవి పక్కన ఉన్న ఇరువురు మహిళలు, మరో మహిళ కూడా గిద్దలూరు సమీపంలో దిగువమెట్ట వద్ద బస్సు దిగి వెళ్లారు. బస్సు గిద్దలూరు వచ్చిన తరువాత లక్ష్మీదేవి బ్యాగ్‌ను చూడగా బ్యాగ్ కనిపించలేదు. వెంటనే కొడుకు, కోడలికి విషయం తెలియజేశారు. వారు హుటాహుటిన గిద్దలూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బ్యాగ్ చోరీకి గురైందని, అందులో 10 తులాల నక్లెస్, ల్యాంగ్ చైన్, కడియం ఉన్నాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 17నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్వో చిన ఓబులేషు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం సాయంత్రం పరీక్షలపై సమీక్షించారు. జిల్లాలో 29,602 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా అందుకోసం 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో కిరణ్ కుమార్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓపెన్ స్కూలు సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 17నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు 1,564, మార్చి 3నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఈ సందర్భంగా డీఆర్వో దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై డీఆర్వో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో నదుపాయాలతో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కందులు కొనుగోలు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కందులను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుకోలు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ తెలిపారు. గురువారం నాగులపాడు సొసైటీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కరుణశ్రీ మాట్లాడుతూ కందులు క్వింటాల్ ఒక్కటికి రూ.7550 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

నిద్రమత్తులో డ్రైవింగ్.. ట్రాక్టర్ బోల్తా

అవీఇవీ

- యువ రైతు మృతి



వెంకటరావు(ఫైల్)

జరుగుమల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి పంచాయతీలోని అగ్రహారం గ్రామానికి చెందిన యువరైతు తానికొండ వెంకటరావు(35) బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ట్రాక్టర్ బోల్తాపడి దుర్మరణం పాలయ్యాడు. కామేపల్లిలో వేరే వారికి రోటావేటర్‌తో పనిచేసేందుకు వచ్చి, పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళుతున్నాడు. నిద్రమత్తులో రావులకొల్లు అడ్డరోడ్డు వద్ద ట్రాక్టరు అదుపుతప్పి తిరగబడింది. వెంకటరావు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మరణించాడు. పొగాకు సాగు చేసిన వెంకటరావు, తన సొంత పనులతోపాటు, ఇతరుల పొలాల్లోనూ ట్రాక్టరుతో పని చేస్తుంటాడు. పని ఒత్తిడి, నిద్రలేమి కారణంగానే ట్రాక్టర్ నడుపుతూ నిద్రలోకి జారుకుని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



సనాతన ధర్మం పుస్తక ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటిస్తూ తమ జీవితాన్ని ఆధ్యాత్మికత, సేవా దృక్పథం, ప్రేమతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు పంటల మల్లారెడ్డి రచించిన సనాతన ధర్మం అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మంలో నిజాయితీ, జీవులకు హానికలిగించకుండా ఉండడం, స్వచ్ఛత, సద్భావన, దయ, ఓర్పు, సహనం, స్వీయనిగ్రహం, దాతృత్వం, సన్యాసం వంటి సద్గుణాలు ఉంటాయన్నారు. నేటి సమాజానికి హిందూధర్మం ప్రాముఖ్యతను పుస్తకం ద్వారా తెలియచేసిన మల్లారెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, హెచ్ఎం నాగభూషణ్‌రెడ్డి, కౌన్సిలర్ గడ్డం భాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సృజనశీలతకు సాహిత్య అధ్యయనమే మార్గం



పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సృజనశీలతకు సాహిత్య అధ్యయనం ఒకటే మార్గం అని విద్యావేత్త సాహిత్య విమర్శకులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి అన్నారు. స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో సాహిత్య వేదిక, నెలనెల వెన్నెల ఆధ్వర్యంలో 61వ సాహిత్య సదస్సు నిర్వహించారు. కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రచించిన నాగేటి గోడు దీర్ఘ కవిత పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక సమీక్ష చేసిన ప్రిన్సిపాల్ డా.కప్పగంతుల మధుసూధన్ మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నంపెట్టే అన్ని వ్యవస్థలు మోసం చేస్తున్నాయన్నారు. కాలంతో పోరాటం చేస్తూ కష్టాలను ఢీకొడుతూ జగతికి అన్నంపెట్టే రైతుకు సమాజం రుణపడి ఉంటుందన్నారు. ఈ పుస్తకం ద్వారా కొండ్రెడ్డి రైతన్నల జీవితాన్ని సగర్వంగా ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో శేషు కుమార్, వినోద్, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వినియోగదారుల అధ్యక్షుడు ఓపి మల్లిక్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్ కుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ పవన్ కుమార్, అకడమిక్ ఇన్‌చార్జ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం కీలకం

- ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఈడీసీ) చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా యూనిట్లు నెలకొల్పే యువ పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి సహకరించాలని ఆయన బ్యాంకర్లను కోరారు. గురువారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎంఎస్ఎంఈడీసీ కార్యాలయంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో శివశంకర్ మాట్లాడారు. చదువుకున్న యువతీ యువకులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలని పిలుపునిచ్చారు.

ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మినహాయించాలి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలకు విధించిన పన్నులపై వడ్డీని మినహాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. ఇప్పటికే పన్నులు కట్టలేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వడ్డీ మరింత భారంగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 31వ తేదీ లోపు కట్టాల్సిన పన్నులపై వడ్డీ మినహాయింపునిస్తూ జీవో విడుదల చేయాలని రామకృష్ణ కోరారు.

ఎస్జీటీలను ‘టెన్త్’ డ్యూటీ నుంచి తప్పించాలి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ డ్యూటీల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లను మినహాయించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కాకి ప్రకాష్‌రావు పాఠశాల విద్యాశాఖ అధికారులను కోరారు. రాష్ట్రంలోని ఎక్కువ ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు మాత్రమే టీచర్లు పనిచేస్తున్నారని, వారికి పరీక్షల డ్యూటీలు వేస్తే బోధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.

సంచార వాహనాలతో మెరుగైన పశువైద్య సేవలు

- వెటర్నరీ డైరెక్టర్ దామోదర్‌నాయుడు

అమరావతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచార వాహనాల ద్వారా మెరుగైన పశువైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీ కాల పరిమితి ముగియడంతో అర్హత గల ఏజెన్సీల నుంచి ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించామని చెప్పారు. నిబంధనల ప్రకారం కొద్ది రోజుల్లో ఏజెన్సీని ఎంపిక చేస్తామన్నారు. అప్పటి దాకా పశువైద్య సేవలకు అంతరాయం లేకుండా 165 వాహనాల ద్వారా ప్రస్తుత ఏజెన్సీ సేవలు అందిస్తుందని చెప్పారు. అలాగే 1962 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉందని వివరించారు.





పెదదోర్నాలలో సుందరంగా తీర్చిదిద్దిన నటరాజ్ ముఖద్వారం (ఇన్‌సెట్లో) భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

శ్రీశైలం వెళ్లే
భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు

24 నుంచి నిరంతరాయంగా రాకపోకలకు నిర్ణయం

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం దోర్నాలలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మాఘ మాసంలో వచ్చే అతిపెద్ద పండుగ మహాశివరాత్రి. ఈ నేపథ్యంలోనే శ్రీశైలంలో పదిరోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మార్చి ఒకటితో ముగుస్తాయి. ఉత్సవాలలో పాల్గొనేందుకు రెండు తెలుగురాష్ట్రాలతో పాటు దేశంలోని నలుమూలల నుంచి వేల సంఖ్యల్లో భక్తులు హాజరవుతారు. ఈక్రమంలో వారి సౌకర్యార్థం ఆయా శాఖాధికారులు దోర్నాలలోని ప్రధాన కూడళ్లలో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయం అందించనున్నారు. దోర్నాల నుంచే ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు నటరాజు ముఖద్వారం శోభాయమానంగా విద్యుదీపాలంకరణతో తీర్చిదిద్దారు. యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు.

నల్లమల ఘాట్‌లో రాత్రిళ్లు వాహనాలకు అనుమతి

మహాశివరాత్రి సందర్భంగా నల్లమల అటవీ ప్రాంతంలోని ఘాట్‌రోడ్డులో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో 24గంటల పాటు వాహనాల రాకపోకలు సాగించేందుకు ఉన్నతాధికారులు అనమతించినట్లు అటవీ రేంజ్ అధికారి జీవన్‌కుమార్ తెలిపారు. సాధారణంగా వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా రాత్రి 9గంటల నుంచి ఉదయం 6గంటల వరకు వాహనాల రాకపోకలు నిషిద్ధం.

శరవేగంగా 'గ్రీన్‌ఫీల్డ్' హైవే నిర్మాణం

- వచ్చే ఏడాది చివరినాటికి పూర్తిచేయాలని లక్ష్యం
- గత ప్రభుత్వంలో నత్తనడకన సాగిన వైనం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశంతో పరుగులు పెడుతున్న పనులు

తాళ్లూరు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేరోడ్డు నిర్మాణపనులు శరవేగంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం రాక మునుపు నత్తనడకన సాగాయి. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఆదేశంతో వేగం పుంజుకున్నాయి. ఈరహదారి నిర్మాణంతో అమరావతి నుంచి బెంగళూరు చేరుకునేందుకు దగ్గరమార్గం కానుంది.

ప్రస్తుతం గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దర్శి, పొదిలి, మార్కాపురం, గిద్దలూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, కడప మీదుగా ప్రయాణం సాగుతున్నది. ఈ మార్గం గుండా దాదాపు 700 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంది. రెండేళ్ల క్రితం గత ఎన్డీఏ కూటమిలోని కేంద్రప్రభుత్వం రూపొందించిన జాతీయ రహదారుల నిర్మాణంలోభాగంగా బెంగళూరు-కడప- విజయవాడ(బీకేవీ)రోడ్డు నిర్మాణానికి రూ.1930 కోట్ల అంచనాలతో ప్రణాళిక రూపొందించారు. బాపట్ల జిల్లా ముప్పవరం నుంచి అనంతపురం జిల్లా కోటికొండ వరకు దాదాపు 343 కిలోమీటర్లపొడవున నూతనంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల గుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతున్నది.

గత ఏడాది గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి భూమి సేకరించి పరిహారం చెల్లించారు. 40 మీటర్ల వెడల్పుతో 6 లైన్ల గ్రీన్‌హైవే రోడ్డు నిర్మాణం చేపట్టారు. బీకేవీ రహదారిని మొత్తం 13 ప్యాకేజీలుగా విభజించారు. తాళ్లూరు మండలంలో మల్కాపురం నుంచి వెలుగువారిపాలెం వరకు 36 కిలో మీటర్ల మేర నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు కాంట్రాక్ట్ సంస్థలు పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. రహదారి పొడవునా ఎక్కడా కట్టడాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెనలు ఏర్పాటు చేస్తున్నారు. తాళ్లూరు మండలంలో రోడ్డు నిర్మాణపనులు ప్రారంభంలో ఆలస్యమైనా పనులు ఊపందుకుని గ్రావెల్ తోలకం వేగంగా జరుతున్నది. రోడ్డు నిర్మాణం జరుగుతున్న మార్గంలో రోడ్డు, వాగుల క్రాసింగ్‌ల వద్ద వంతెనలు నిర్మిస్తున్నారు.

వెలుగువారిపాలెం నుంచి ఉప్పలపాడు మార్గంలో ఆరులేన్ల తారు రోడ్డు నిర్మాణ పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. పనులు వేగవంతంగా జరుగుతుండటంతో 2026 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే బెంగళూరు ప్రయాణ దూరం తగ్గి, తక్కువ సమయంలో చేరుకునే వీలు కలుగుతుంది. దీంతో రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలతోపాటు పలు జిల్లాల నుంచి అమరావతికి తక్కువ సమయంలో చేరుకునేందుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు ఉపయోగపడుతుంది.



వెలుగువారిపాలెం సమీపాన జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

నందనవనాలు
ఆ పాఠశాలలు

మొక్కలతో ఆహ్లాదాన్ని పంచుతున్న ఆవరణలు

వెల్లివిరుస్తున్న పచ్చదనం

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఆలోచనలు, విద్యార్థుల ఆసక్తితో పచ్చదనం పరుచుకుంటోంది. నీడనిచ్చే చెట్లు, అందాలను ఆరబోసే పూలమొక్కల పెంపకంతో ఆకట్టుకుంటున్నాయి. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఆరంభం నుంచి విద్యాలయాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి రోజులో కొంత సమయం కేటాయించి మొక్కల పెంపకం చేపట్టారు. దీంతో ఆయా పాఠశాలల ఆవరణలో అందాలు, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇదే స్ఫూర్తితో పలువురు ఉపాధ్యాయులు కూడా మేము సైతం అంటూ మరికొన్ని పాఠశాలల్లో పచ్చదనాన్ని పెంపొందిస్తున్నారు.

దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ప్రస్తుతం ఎంఈవోగా ఉన్న మస్తాన్‌నాయక్, సైన్స్ ఉపాధ్యాయులు నాగమూర్తి తొలుత మొక్కల పెంపకం చేపట్టారు. దోర్నాల కేంద్రంగా ఉన్న ఉన్నత పాఠశాల మంచి ఫలితాలు ఇవ్వడంతో ఆదర్శంగా తీసుకుని మరికొన్ని పాఠశాలల ఆవరణలో మొక్కలు పెంచారు. దీంతో సుందర వనాలుగా రూపుదిద్దుకున్నాయి.





మొక్కలతో ఆహ్లాదాన్ని పంచుతున్న బీఎంసీ ఆశ్రమ పాఠశాల (ఇన్‌సెట్లో) వనంలా మారిన చెట్ల కింద ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పూలవనాలుగా బీఎంసీ ఆశ్రమ పాఠశాల, విద్యావనరుల కేంద్రం

మండలంలోని బీఎంసీ ఆశ్రమపాఠశాల ఆవరణ, విద్యావనరుల కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్ స్కూల్)ఆవరణలో అడుగుపెట్టగానే వివిధ రకాల పూలమొక్కలు, పలు రకాల చెట్లు దర్శనమిస్తాయి. మెట్టబజారులోని మరో ప్రాథమిక పాఠశాల, అయినముక్కల ప్రాథమిక పాఠశాల ఆవరణలో కూడా పచ్చదనంతో నిండి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

23న రేణుకమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవం

- రూ. 60 లక్షలతో ఆలయ నిర్మాణం
- ఘనంగా ప్రారంభమైన క్రతువు, ప్రత్యేక పూజలు

పంగులూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో రాయిణి వంశస్తుల కుల దేవర శ్రీ రేణుకమ్మతల్లి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం జరిగింది. సుమారు రూ.60లక్షల వ్యయంతో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. ఈ ఆలయంలో రేణుకమ్మ తల్లి, పోతురాజు, శిఖర ప్రతిష్ఠ ఈ నెల 23న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు జరుగనుంది. వేదపండితులు వేముల శ్రీహరిచౌదరి వారి బృందం ఈ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన క్రతువుకు రాయిణి వంశస్తులు గురువారం శ్రీకారం చుట్టారు. గురువారం రామాపురం చేరుకున్న రాయిణి వంశస్తులు సముద్రస్నానాలు ముగించుకుని అమ్మవారి ప్రతిమ, ఇతర ఆభరణాలను సముద్ర జలాలలో శుద్ధి చేసి అనంతరం ఆచారంతో పూజాకార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి వేళ పొలిమేర నుంచి మేళతాళాలతో అమ్మవారిని ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయిణి వంశస్తులు వారి బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సముద్రంలో పావన పూజలు ముగించుకుని అమ్మవారిని ఊరేగింపుగా తోడ్కొని వస్తున్న రాయిణి వంశస్తులు



పంగులూరులో నూతనంగా నిర్మితమైన దేవర రేణుకమ్మ ఆలయం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

- మంత్రి స్వామి
- తొలియత్నంలోనే వందశాతం ఉత్తీర్ణత కావాలని విద్యార్థులకు సూచన

కొండపి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని, విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 47వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా గురువారం పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ తొలిప్రయత్నంలోనే విద్యార్థులు పాస్ కావాలని సూచించారు. మార్చి, సెప్టెంబరు వాయిదా పద్ధతి వద్దన్నారు. కొండపి ప్రభుత్వ కళాశాలలో చదివిన వారు డాక్టర్లుగానూ, ఇతర ఉన్నత ఉద్యోగులుగానూ ఉన్నారని అన్నారు. బాలికలకు రాష్ట్రంలోనే ప్రప్రథమంగా సింగరాయకొండలో వచ్చే విద్యాసంసంవత్సరం నుంచి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, కొండపిలో కూడా సాంఘిక సంక్షేమశాఖ బాలుర పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. కొండపి కళాశాల దివంగత దామచర్ల ఆంజనేయులు హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బత్తుల నారాయణస్వామి పాల్గొన్నారు. గత విద్యాసంవత్సరంలో ఇంటర్ రెండవ సంవత్సరంలో బైపీసీలో అత్యధిక మార్కులతో స్టేట్ 5వ ర్యాంకు సాధించిన తన్నీరు దివ్య తల్లిదండ్రులకు నగదు బహుమతిని మంత్రి అందజేశారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

సమస్యలున్నాయి.. సభ్యులేరీ?

కొండపి మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యుల డుమ్మా

మూడోసారి కోరం కోసం నలుగురు హాజరు

కొండపి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజోపయోగంగా నిర్వహించాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడం షరా మామూలైంది. గురువారం కొండపి మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి కోరం కోసం నలుగురు సభ్యులు మాత్రమే హాజరవడం చర్చనీయాంశమైంది. ఉన్నవారితోనే అధికారులు శాఖల వారీగా అంశాలపై మాట్లాడి ముగించేశారు. మండలంలో 12 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. వీరితోపాటు కోఆప్షన్ సభ్యుడు ఉన్నారు. ఇందులో ఒక్కరు మినహా 12 మంది వైసీపీకి చెందినవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మండల పరిషత్ సమావేశాల నిర్వహణకు ఎంపీడీవో సర్క్యులర్ జారీ చేసినా రెండు దఫాలు సభ్యులు హాజరు కాలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో మూడోసారి గురువారం సమావేశానికి ఇద్దరు వైస్ ఎంపీపీలు రావులపల్లి కోటరాజు (కొండపి-1), వేముల వెంకట ప్రసాద్ (అనకర్లపూడి), కె.ఉప్పలపాడు ఎంపీటీసీ సభ్యురాలు ఢాకా విజయలక్ష్మి, పెదకండ్లగుంట ఎంపీటీసీ సభ్యుడు బొల్లా సుబ్బారావు హాజరయ్యారు. వీరిలో వేముల వెంకట ప్రసాద్, ఢాకా విజయలక్ష్మి సమావేశం నిర్ణీత సమయానికి హాజరై సంతకాలు చేసి వెళ్లారు. పెదకండ్లగుంట ఎంపీటీసీ సభ్యుడు గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సమావేశం మధ్యలో వెళ్లిపోయారు. కోఆప్షన్ మెంబర్ బాబూరావు కూడా సమావేశం మధ్యలో వెళ్లిపోయారు. వైస్ ఎంపీపీ కోటరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. సర్పంచ్‌లు కూడా ఇద్దరు హాజరయ్యారు. వీరిలో ఒకరు సమావేశానికి ముందుగానే సంతకం చేసి వెళ్లిపోగా, పెట్లూరు సర్పంచ్ ఆరితోటి ఝాన్సీరాణి సమావేశం చివరి వరకు ఉన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు వివరించారు.

తాగునీటి ప్రాజెక్టుకు డీపీఆర్‌లు

సర్వసభ్య సమావేశంలో అధికారులు శాఖలవారీగా జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గంలోని తాగునీటి వసతి లేని గ్రామాలకు రూ.450 కోట్లతో రామతీర్థం రెండో ప్రాజెక్టు ద్వారా తాగునీరందించేందుకు డీపీఆర్‌లు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామని ఆర్‌డబ్ల్యుఎస్ మండల ఏఈ కిషోర్‌బాబు సమావేశంలో తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం ఉన్న రామతీర్థం ప్రాజెక్టు నుంచి నీరు అందని 13 గ్రామాలకు రాబోయే ప్రాజెక్టులో తాగునీరు అందేలా డీపీఆర్ పంపినట్లు తెలిపారు. తహసీల్దార్ పి.మురళి మాట్లాడుతూ తగినంత సమయం, మానవ వనరులు, సాంకేతికత అందుబాటులో ఉండటంతో రీసర్వే పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. 2019కి ముందు తమ అనుభవంలో ఉన్న భూములకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలించి హక్కులు కల్పించే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఏవో డి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులందరూ 11 అంకెల గుర్తింపు సంఖ్యను రిజిస్టర్ చేసుకుని పొందాలని సూచించారు. సమావేశంలో పీఆర్ ఏఈ బి.ప్రసాదరావు, విద్యుత్‌శాఖ ఏఈ హరీష్, ఎస్ఆర్‌ఈజీఎస్ ఏపీవో మహాలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీదీప్తి, హార్టీకల్చర్ అధికారిణి ప్రత్యూష, ఈవోఆర్డీ అంజలీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి తమ శాఖల కార్యక్రమాలను వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్‌బాబు

ఏఎస్‌డబ్ల్యూవోకు షోకాజ్ నోటీసు

కాగా మండల సమావేశానికి సోషల్ వెల్ఫేర్ ఏఎస్‌డబ్ల్యూవో వచ్చి సంతకం చేసి వెంటనే వెళ్లిపోవడంతో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎంపీడీవో రామాంజనేయులు ఆదేశించారు. ఈమేరకు కార్యాలయ ఏవో రామకృష్ణకు ఆయన సూచించారు.

రేపు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీర్ఘకాలింగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22న ఒంగోలులోని డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శేషారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా ఇంత వరకు పరిష్కారం కాలేదన్నారు. అందువల్ల ధర్నాలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

23న ట్రంప్ ఫాసిస్టు విధానాలపై సభ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆసరా ఆధ్వర్యంలో ఈనెల 23వతేదీ ఉదయం పదిగంటలకు స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ట్రంప్ ఫాసిస్టు విధానాలు- భారత్‌పై వాటి ప్రభావాలు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎంసీ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సభలో రాజకీయ విశ్లేషకులు బుడ్డిగ జమిందార్, ప్రజానాట్య మండలిగౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లులు హాజరవుతారని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేస్ విద్యార్థుల క్షేత్ర పర్యటన



సమ్మర్ స్టోరేజీ ట్యాంకు గురించి వివరిస్తున్న దాస్

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గురువారం స్థానిక సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలించారు. మునిసిపల్ సీనియర్ బెడ్ ఆపరేటర్ దాస్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు విధి విధానాలు, పనితీరును విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల అవగాహన కోసం ఇటువంటి క్షేత్ర కార్యక్రమాలను చేపడుతున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, విభాగాధిపతి గణేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శర్మ కాలేజీ విద్యార్థికి ప్రథమ బహుమతి

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక సీఎస్ఆర్‌శర్మ కళాశాల బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.ఉదయతేజ ప్రథమబహుమతిని సాధించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత చేతుల మీదుగా ఉదయతేజ రూ.10,116 నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉదయతేజను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కళాశాల పాలకవర్గ ప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు.

కూరగాయల మార్కెట్ పరిశీలన



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తకూరగాయల మార్కెట్‌ను కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ముందుగా అక్కడ ఉన్న అన్నక్యాంటీన్‌ను పరిశీలించి టిఫిన్ నాణ్యతను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌లో నగర పాలక సంస్థ రెవెన్యూ, పట్టణ ప్రామాణిక విభాగం అధికారులతో షాపులను పరిశీలించారు. మార్కెట్‌లో షాపులు ఉండి వ్యాపారం జరిగేందుకు ఇబ్బందికరంగా ఉందో అక్కడ ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ ఆదేశించారు. వ్యాపారులు కూడా నగర పాలక సంస్థకు బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. మార్కెట్ వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. రోడ్డు డివైడర్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట రెవెన్యూ ఆఫీసర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలి

● లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న రమేష్‌బాబు

మద్దిపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.రమేష్‌బాబు పేర్కొన్నారు. డిజిటల్ బ్యాంకింగ్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ఖాతాలను సురక్షితంగా ఉంచుకోవాలని చెప్పారు. గురువారం మద్దిపాడులోని కెనరా బ్యాంకు వద్ద జరిగిన సమావేశంలో సుకన్య సమృద్ధి యోజన, సురక్ష యోజన, జీవన్ జ్యోతి యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ మేనేజర్ వి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఖాతాదారులకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నామని, మహిళలకు డ్వాక్రా గ్రూపు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. స్టేట్స్ కో ఆర్డినేటర్ కె.అశోక్ మాట్లాడుతూ వ్యాపారులకు పరిశ్రమలు నెలకొల్పేందుకు కెనరా బ్యాంక్ రుణాలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిస్టిక్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, ఎస్.అమృతరాజ్, వీవో శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టలు పంపిణీ



విద్యార్థికి అట్టను అందజేస్తున్న శ్రీను

సంతనూతలపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సునీల్ ప్రైమరీస్కూల్‌లో గురువారం చత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు టీడీపీ బాపట్ల పార్లమెంట్ ప్రధానకార్యదర్శి తన్నీరు శ్రీను అట్టలను పంపిణీ చేశారు. చత్రపతి శివాజీ గొప్పయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో దాత కరేటి నరసింహారావు, ప్రిన్సిపాల్ సుభాషిని, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

శానంపూడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

● ఎంపీడీవో జయమణి

సింగరాయకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద శానంపూడిలోని దళితవాడలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామని ఎంపీడీవో డి.జయమణి చెప్పారు. శానంపూడి గ్రామం పీఎంఏజీవై పథకానికి ఎంపికైంది. దీంతో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ జనాభాలో 40 శాతానికిపైగా దళిత జనాభా ఉంటే పీఎంఏజీవై పథకం కింద ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. అదనంగా మరికొన్ని నిధులను రాష్ట్రం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులతో దళితవాడల్లో మౌలికవసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యురాలు సుమతి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రామదాసుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కరణం బలరాం, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎం.వేములపాడు మాజీ సర్పంచ్ వలేటి రామదాసు స్వగ్రామంలో గురువారం జరిగిన ఆయన పెదకర్మకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా రామదాసు చిత్రపటానికి వారు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మినేని రామాంజనేయులు, ఆర్.అంకారావు, చిన్నారావు, రామారావు, శ్రీనివాసరావు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, రావిపాటి రాంబాబు, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బృందావన్ గార్డెన్స్‌లో గస్తీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న కాలనీవాసులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని బృందావన్‌గార్డెన్స్ కాలనీలో దొంగల సంచారంతో భయంగా ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి స్థానిక బృందావన్ గార్డెన్స్ కాలనీలో కాలనీవాసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు దివి బ్రహ్మానందం(బుజ్జి) మాట్లాడుతూ గత బుధవారం అర్ధరాత్రి ముగ్గురు దొంగలు కాలనీలో చోరీకి విఫలయత్నాలు చేశారని, కాలనీవాసులు అందరూ బయటకు రావడంతో పరారీ అయినట్లు చెప్పారు. గత నెలలో బైకుల్లోని పెట్రోలును చోరీ చేశారన్నారు. గతేడాది దొంగలు ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఇంటి తలుపులు పగులగొట్టారని తెలిపారు. అందువల్ల పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు.


దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న మోహన్‌కుమార్‌ధర్మ

చీమకుర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : బక్కిరెడ్డిపాలెంకు చెందిన ఎస్టీ మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయటంతోపాటు బాధిత మహిళపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం.మోహన్‌కుమార్‌ధర్మ డిమాండ్ చేశారు. బక్కిరెడ్డిపాలెం గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో యానాది కులానికి చెందిన మహిళలపై వేరే వర్గానికి చెందిన మహిళలు కర్కశంగా దాడి నిర్వహించటాన్ని ఖండించారు. తక్షణమే బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పేరం శ్రీనివాసరావు, పాటిబండ్ల గంగయ్య, పిన్నిక శ్రీనివాస్, యలమందబాబు, ఇస్తర్ల శంకర్, దాసరి రవి, పోతురాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి



సూచనలు ఇస్తున్న డాక్టర్ మనురూప్

చీమకుర్తి, ఫిబ్రవరి20(ఆంధ్ర జ్యోతి) : బర్డ్‌ఫ్లూ సోకకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పల్లామల్లి పశు వైద్యాధికారి మనురూప్ కోరారు. గురువారం బండ్లమూడిలోని కోళ్లఫారంను ఆయన సందర్శించారు. ఫారంలో ఉన్న కోళ్లను పరిశీలించారు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఏమిలేవని, వ్యాధి సోకకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఫారం యజమానికి సూచించారు.

చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు

● ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజన్

సింగరాయకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాల్యంలోనే బాటలు వేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ సూచించారు. సింగరాయకొండ రైల్వేస్టేషన్‌రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ 3 నుంచి 5 ఏళ్ల వయసు లోపు పిల్లలకు ప్రాథమిక విద్య కీలకమైందని చెప్పారు. అనంతరం అంగనవాడీలు తయారుచేసిన అభ్యాసన సామగ్రి మేళాను సందర్శించారు.

మద్దిపాడు: మండలంలోని 60 మంది అంగన్‌వాడీ వర్కర్లను రెండు బ్యాచ్‌లుగా గుండ్లాపల్లి, మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



నాగులుప్పలపాడులో లబ్ధిదారునికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భరోసా పేద కుటుంబాలకు వరమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మద్దిరాలపాడు, చదలవాడ, నాగులుప్పలపాడు, బి.నిడమానూరు, పోతవరం గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన రూ.7,51,426 సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బీఎన్ నేరుగా వారి ఇళ్లకు వెళ్లి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోని ప్రమాదాలలో ఇబ్బందులకు గురైన వారికి మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు కనీసం వారి పార్టీ కార్యకర్తలకు కూడా సీఎం సహాయనిధి అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పార్టీలకతీతంగా అండగా ఉంటున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మారెళ్ల వెంకటశేషయ్య, షేక్ ఖాజావలి, తెలగతోటి జాన్సన్, పెనుబోతు సునీల్, సర్పంచ్‌లు కొమ్మినేని రమేష్, స్వర్ణ అనురాధ, దివి పున్నారావు, మెట్టు సుబ్బయ్యనాయుడు, కొనిజేటి ధనుష్, సాయిచరణ్, శరత్, పీకా బైరాగి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి

సంతనూతలపాడు: గుమ్మళంపాడుకు చెందిన టీడీపీ నాయకుడు నెప్పలి సుబ్బారావు గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆయన మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బొమ్మినేని రామాంజనేయులు, నెప్పలి కనకయ్య, ఎం.శ్రీనివాసరావు, చైతన్య, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో కూడిన విద్యతోనే నైపుణ్య అభివృద్ధి

● ప్రొఫెసర్ రాజశేఖర్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి ప్రణాళికతో కూడిన విద్యతోనే నైపుణ్య అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ కెరియర్ కౌన్సిలర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. భీమ్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన ఓరియంటేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ అంశంపై సదస్సు ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశలోనే తన భవిష్యత్‌కు సంబంధించిన ప్రణాళిక చేసుకోకపోవడం వల్లే డిగ్రీ విద్యార్థులు సరైన నైపుణ్యాలు లేక జీవితంలో ఉద్యోగ అవకాశాలు పొందలేక పోతున్నారని చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్య కోసం జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం వల్ల లాంగ్వేజ్ కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ రంగ ఉద్యోగాల కన్నా ప్రైవేటు రంగంలోనే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, ప్రతి విద్యార్థి వినూత్నంగా ఆలోచన చేయాలన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే విద్యా ఒక్కటే ప్రధాన మార్గమన్నారు. విద్యార్థులు చదువు మీదకంటే డ్రగ్స్‌వంటి చెడు అలవాట్లకు లోనవుతున్నారని, దానివల్ల జీవితంలో సరైన లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ యర్రమాల కోటేశ్వరరావు, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మల్లికార్జున్, భీమ్ సేవా సమితి వ్యవస్థానక అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, అంగలకుర్తి వెంకటేశ్వర్లు, కటకం మనోజ్‌కుమార్, బీరకాయల మహేంద్ర, కె.కృష్ణ, గుత్తి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు పెరిగిన కూలిని అమలు చేయాలి

● యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బారావు



ఎంఎల్ఎస్ పాయిట్‌వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న హమాలీలు, సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరా సంస్థలో పనిచేస్తున్న హమాలీలకు పెరిగిన కూలీలతో పాటు బకాయిలను చెల్లించాలని హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద గురువారం యూనియన్ జిల్లా కార్యదర్శి బత్తులగోపాలరావు అధ్యక్షతన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతతూ గత ఏడాది జనవరి 1నుంచి వేతనాలు పెరగాల్సి ఉందన్నారు. వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఒప్పందం చేసి అమలు చేసేందుకు నెలల తరబడి తాత్సారం చేస్తుందని ఆరోపించారు. వెంటనే బాకాయిలుతో పాటు పెరిగిన కూలి రేట్లు ఇవ్వాలని, లేనిపక్షంలో మార్చి 20వ తేదీ తర్వాత సమ్మె చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిన వెంటనే హమాలీలకు కూలి ధరలను పెంచిన విధంగా చెల్లించాలన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ కొత్త వారికి పీఎఫ్ నెంబర్లు ఇవ్వాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దానివల్ల కార్మికులకు రావాల్సిన ఇతర సౌకర్యాలను కోల్పోతున్నారని ఆరోపించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంజీవయ్య, వెంకట్రావు, చంద్ర, సుబ్బారావు, శ్రీనివాస్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ఆరోపించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులు, యువకులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. చదువుకుంటున్న ప్రతివిద్యార్థికి తల్లికివందనం పథకం కింద రూ.15వేలు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3500 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో 50వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవల 11వేల పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం దారుణంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించని పక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యామ్, నాయకులు వెంకటేష్, ఎలీషా, మానస తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన గుండ్లకమ్మ కాలువ పూడికతీత పనులు

● గట్లు తెగి శనగ పంట పొలాల్లోకి చేరిన నీరు

● నష్టం వాటిల్లిందంటూ రైతుల ఆవేదన

మద్దిపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ కాలువ మరమ్మతులు, పూడికతీత పనులను కాంట్రాక్టర్లు ఇష్టారీతిన చేస్తుండడంతో తమ పంటలకు నష్టం జరుగుతోందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నీటిపారుదల శాఖ అధికారుల ఆదేశాలతో మద్దిపాడు సమీపంలోని గుండ్లకమ్మ కుడి కాలువతో పాటు ఇతర సాగునీటి కాలువలను మరమ్మతు పనులు చేపట్టారు. ఈక్రమంలో ఘడియపూడి కాలనీశివారులో ఉన్న గుండ్లకమ్మ కాలువ నుంచి దక్షిణం వైపు పొలాలకు వెళ్లే కాలువలో గత నాలుగు రోజుల నుంచి నాచు, జమ్ము తొలగింపు, పూడికతీత పనులు చేస్తున్నారు. అయితే ఘడియపూడి, దొడ్డవరప్పాడుకు చెందిన ఇరువురు నాయకులు ఈ పనులను కాంట్రాక్ట్ తీసుకుని ఎక్స్‌కవేటర్లతో ఇష్టారీతిన చేస్తున్నారని, దీంతో కాలువ కట్టలు తెగి నీరు పక్కనే ఉన్న తమ పంట పొలాల్లో అధికంగా చేరి శనగ పంట నష్టపోతున్నామని గురువారం మద్దిపాడుకు చెందిన నూనె వెంకటేశ్వర్లు, పలువురు రైతులు ఆరోపించారు. అందువల్ల అధికారులు, కాంట్రాక్టర్లు తమకు నష్టపరిహారం చెల్లించాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

కాలువ కట్టను అడ్డదిడ్డంగా తవ్వేస్తున్న ఎక్స్‌కవేటర్



కాలువ కట్ట తెగి పంట పొలాల్లోకి వచ్చిన నీటిని చూపుతున్న రైతు వెంకటేశ్వర్లు

అవీ..ఇవీ

మామిడి పూత దశలో రైతులు అప్రమత్తంగా ఉండాలి


మామిడి చెట్ల పూతను పరిశీలిస్తున్న శ్వేత

బేస్తవారపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మామిడి చెట్లు పూత దశలో ఉన్నాయని అందుకు రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి డి.శ్వేత అన్నారు. గురువారం మండలంలోని పూసలపాడు, ఓందుట్ల గ్రామాల్లో పర్యటించారు. బంతి పూలతోటలు, మామిడి చెట్లు పరిశీలించారు. మామిడిలో తేమ అధికంగా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూత దశలో సరైన పోషకాలు అందించాలన్నారు. పూత నిలబెట్టడంలో, పిందె ధృడంగా మారడానికి పోషకాలు సహకరిస్తాయన్నారు.చెట్టుకు రెండు కిలోల యూరియా, సింగిల్ సూపర్ పాస్పేట్, పోటాష్ అందించాలన్నారు. బోరాన్ ద్రావణాన్ని పిచికారి చేసి పోషకాలు అందించాలని సూచించారు.

అనారోగ్యంతో హెల్త్ సూపర్‌వైజర్ మృతి


శ్రీనివాసులు (ఫైల్)

బేస్తవారపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండలంలోని గలిజేరుగుళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ సూపర్ వైజర్ పల్లా శ్రీనివాసులు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కడప రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతదేహాన్ని స్వగ్రామమైన బేస్తవారపేటకు తరలించారు. పలువురు వైద్యాధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

ఎస్‌డబ్ల్యూఎం కేంద్రాల సందర్శించిన డీఎల్‌పీవో


కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కొనకనమిట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెగుమానిపల్లి, తువ్వపాడు ఎస్‌డబ్ల్యూఎం కేంద్రాలను గురువారం డీఎల్‌పీవో ఎస్‌వీఎల్ హనుమంతరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. త్వరిత గతిన వర్మికంపోస్టు ఎరువులను తయారు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆయాగ్రామాల పంచాయతీలలో, కొనకనమిట్ల గ్రామంలో వీధులను పరిశీలించి పారిశుధ్య కార్యక్రమాలను పరివేక్షించారు. కార్యదర్శుల రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్‌గా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీదేవి, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, మహిళలకు చదువు ముఖ్యమని మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక రెడ్డి మహిళా కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తి చేసుకొని బయటకు వెళ్తున్న విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతమ్మ, ఇంటర్ ప్రిన్సిపాల్ గాయత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి


బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కందుల రామిరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పురస్కరించుకుని పట్టణంలోని మార్కండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, మాజీ కౌన్సిలర్ కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, చక్కిలం నారాయణ, అర్చకులు వరుణ్‌తేజ శర్మ, ఆంజనేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి బ్రహ్మోత్సవాలు

స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా 24 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. 24న అంకురార్పణ, 25న ధ్వజారోహణ, 26న ఎదురుకోల, గ్రామోత్సవం, మహాశివరాత్రి పూజలు జరుగుతాయన్నారు. 27న నంది వాహనం, 28న గజ వాహనం, మార్చి 1న రావణాసుర వాహనం, 2న భృంగీశ్వర వాహన సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న రథోత్సవం, 4న హంసవాహన సేవ ఉంటాయన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం, అంగన్వాడీ, సిబ్బంది

త్రిపురాంతకం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నివారణపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీం లీడర్ శ్రీనివాస్, ఏఎన్ఎం, అంగన్‌వాడీలు ఇంటింటికీ తిరుగుతూ బాల్యవివాహాలు, వాటి వలన నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అబీదా, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి, మహిళా సంక్షేమ కార్యదర్శి పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమస్యలు

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- రాచర్లలో ప్రజాదర్బార్ నిర్వహణ


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలను విస్మరించడం వలన నేడు ప్రతి గ్రామంలో సమస్యలు తాండవిస్తున్నాయని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం రాచర్లలోని బీసీభవన్‌లో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కారం చేసే దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించి అర్జీదారులకు తెలుపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, మండలపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, పార్లమెంటు నాయకులు గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచు లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అధికారులు రాని సమావేశాలు ఎందుకు

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి

తర్లుపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మూడునెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రానప్పుడు సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య, విద్యా, ఆర్‌డబ్ల్యూఎస్, వంటి ప్రధాన శాఖల అధికారులు, తహసీల్దార్ విజయ్ భాస్కర్ సమావేశానికి హాజరుకాకపోవడంతో ఎంపీపీ మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కేతగుడిపి సర్పంచ్ దూదేకుల పెద్దమస్తాన్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కేతగుడిపిలో సీసీ రోడ్లను నిర్మిస్తూ, కనీసం తమకు సమాచారం ఇవ్వకుండా, పంచాయతీరాజ్ ఏఈ మాంకాలయ్య నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్నాథపురంలో స్మశానానికి వెళ్లడానికి రహదారి ఏర్పాటు చేయాలని సర్పంచ్ గంటా వెంకటరెడ్డి సమా వేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీలో పనులు జరిగేటప్పుడు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కేవలం తీర్మానాలకే సంప్రదిస్తున్నారన్నారు. పనులు మొదులు పెట్టేటప్పుడు సమాచారం ఇవ్వడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పోతలపాడు, గానుగపెంటలో మంచినీటి సమస్య ఉందని, పోతలపాడు సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడపా లని, సమావేశం దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు వెంటనే మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ హనుమాన్‌నాయక్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూపై అపోహను వీడండి : జేడీఏ



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ బేబీరాణి

పొదిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ జిల్లాలో లేదని గుడ్లు, చికెన్ తినడం వలన ఎలాంటి సమస్య ఉండదని పశు సంవర్ధకశాఖ జేడీఏ బేబిరాణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొదిలి పశువైద్యశాల పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల వైద్యులకు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు బర్డ్‌ఫ్లూపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యజమానులు ముందుగా కోళ్లకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. పక్క జిల్లాల నుంచి కోళ్ల దాణ, గుడ్లు, కోళ్లను దిగుమతి చేసుకోవద్దన్నారు. ప్రజలకు చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినవచ్చన్నారు.

సిబ్బందిపై జేడీఏ ఆగ్రహం

గ్రామాల్లో అసలు సిబ్బంది పనిచేస్తున్నారా..? అని జేడీఏ ప్రశ్నించారు. గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు, పశువులకు వాక్సినేషన్ పూర్తి చేయకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సిబ్బందిని పిలిచి వ్యాధుల పై ఆరాతీశారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చికెన్ మేళా నిర్వహించిప్రత్యక్షంగా తిని చూపించారు. కార్యక్రమంలో ఏడీ వేణు, మూడు మండలాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఆటో డ్రైవర్‌లకు ఎస్సై కౌన్సెలింగ్


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రాజమోహనరావు

మార్కాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు అన్నారు. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్‌లో గురువారం ప్రమాదాల నివారణపై ఆటోడ్రైవర్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికిమించి ప్రయాణికులను అనుమతించడంతోనే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ముఖ్యంగా డ్రైవర్ పక్కన ఉండే సీట్లు తొలగించాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో పక్కన నలుగురు ప్రయాణికులను కూడా అనుమతించడంతోనే ప్రమాదాలకు ప్రధాన హేతువవుతోందన్నారు. పట్టణ పరిధిలో వేగ నియంత్రణ చాలా అవసరమన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పట్టణంలోని పలు సెంటర్‌లకు చెందిన ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి


స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ పద్మావతి

మార్కాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు తప్పవని మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.పద్మావతి హెచ్చరించారు. పట్టణంలోని ఐదు స్కానింగ్ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్యాధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి స్కానింగ్ కేంద్రాలు నిర్వహించరాదన్నారు. లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రమాణాలకు అనుగుణంగా మాత్రమే స్కానింగ్ కేంద్రాలు నిర్వహించాలన్నారు. స్థానిక బాలాజీ, 4డి, 3డి స్కానింగ్ కేంద్రాలు, సిమ్స్ జనని వైద్యశాలల్లోని స్కానింగ్ యంత్రాలను, అనుమతులకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీ లించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా

కంభం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సామూహిక, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న శనివారం ఒంగోలు డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లికార్జునరావు, రాష్ట్రకౌన్సిలర్ ఎస్.నారాయణరెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు అందచేసినా ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్, ప్రొహిబిషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు, 2008 తెలుగు పండిట్‌ల అప్రూవ్ సీనియారిటీ జాబితా విడుదల తదితర సమస్యపై ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల ఏపీటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గంగావతారంలో స్వామివారు


గంగవతరణంలో స్వామివారు

పొదిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు పులిగోట్టు ఉత్సవంతో గంగావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలు పరుచూరి వెంకటసత్యనారాయణ, కొండా సుబ్రహ్మణ్యం, వెంకట లక్ష్మీనారాయణ, తాతా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం స్వామివారు చంద్రవాహనముపై నటరాజ అలం కరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నక్యాంటీన్ నిర్వహణకు రూ.10వేల విరాళాన్ని వన్నూరుశెట్టి కుటుంబసభ్యులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందజేశారు. గురువారం టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి రూ.10వేల ను అరవింద్ అందజేశారు.

మద్యం సీసాల స్వాధీనం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఆయనపై కేసు నమోదు చేశారు. ఆయన వద్ద ఉన్న 9 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని క్రిష్ణంశెట్టిపల్లె గ్రామంలో ఓ వ్యక్తి 9 క్వార్టర్ మద్యం సీసాలు కలిగి ఉండి బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ సీఐ జయరావ్ సిబ్బందితో కలిసి వెళ్లి నిందితుడిని అరెస్టు చేశారు.

నేడు విద్యుత్‌సరఫరా నిలిపివేత

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి సబ్‌స్టేషన్ మినహా గిద్దలూరు మండలంలోని అన్ని గ్రామాలు, కొమరోలు మండలంలోని అన్ని గ్రామాలు, రాచర్ల మండలంలోని యడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు స్థానిక డీఈఈ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు హద్దుల గుర్తింపు


హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

కంభం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడానికి పోలీసులు, పంచాయతీ అధికారులు గురువారం హద్దులు ఏర్పాటు చేశారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్, మెయిన్ బజారు, చౌక్‌సెంటర్, కళాశాల రోడ్లలో ఇరువైపులా డ్రైనేజీలను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని కొందరు అక్రమ కట్టడాలు నిర్మించారు. దీనికి తోడు తోపుడుబండ్లు, చిరువ్యాపారులు సైతం రోడ్లపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్ జామ్‌తో గంటల కొద్ది వాహనాలు నిలిచి పోతున్నాయి. రెండు నెలల క్రితం మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్ ఆక్రమణలను తొలగించాలని పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సూచించారు అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గురువారం కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డిలు ప్రధానవీధిలో ఆక్రమణలను గుర్తించి హద్దులు చూపారు. హద్దులను దాటి ఎవరు ముందుకు వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు నిబంధన ప్రకారం ఆక్రమణలు తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కూలిరేట్లు పెంచి ఇవ్వాలని ధర్నా

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యలయ ఆవరణలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ ప్రభుత్వ పౌరసరఫరాల గౌడౌన్‌లో లోడింగ్ అన్‌లోడింగ్ పనిచేస్తున్న హమాలీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25వేల నుండి రూ.27వేలకు కూలి పెంచిందన్నారు. అయితే అందుకు సంబంధించిన జీవో ఇవ్వక పోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 14 నెలలుగా జీవో విడుదల కాకపోవడంతో కూలీలకు వేతనం పెరగలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆ జీవోను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, బాలకాశయ్య, శ్రీను, బాలయ్య, రామాంజనేయులు, అనిల్, వీరాంజనేయులు, మల్లయ్య, నారాయణ, బషీర్ పాల్గొన్నారు.

వెలిగొండకు రూ.2వేల కోట్లు కేటాయించాలి


మార్కాపురంలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి). రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ 2025 సంవత్సరం రబీ నాటికి వెలిగొండ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత గ్రామాలలో యువతీ యువకులకు ఆర్‌ఆర్ ప్యాకేజి అర్హత కటాఫ్ తేదీని పెంచాలన్నారు. అర్హులందకీ ప్యాకేజి వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం నాయకులు గుమ్మా బాలనాగయ్య, తురగా ఏడుకొండలు, రూబెన్, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రాజెక్టు ముంపు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పొదిలి : రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్ట్‌కు 2వేలకోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశంలో వెలిగొండను పూర్తి చేసి జాతికి అంకితం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం చెప్పినట్లుగా రెండేళ్లలో ప్రాజెక్ట్ పూర్తి కావాలంటే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తప్పనిసరన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ రైతుసంఘం మండల నాయకులు నర్రా వెంకటేశ్వరరెడ్డి, కే.పేరిరెడ్డి, బి.శ్రీనివాసులు, కే.శేషగిరి, టి నరసయ్య సీఐటీయూ నాయకులు బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారపేట: వెలిగొండకు నిధుల కేటాయింపు కోసం ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం తహసీల్దార్ జితేంద్రకు వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులకు వెంటనే ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.కె.అన్వర్, భూతపాటి అమృతరాజు, గన్నెపూడి అబ్రహాం పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు 2వేల కోట్లు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యలయ ఆవరణలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, నాయకులు సత్యనారాయణ, ప్రతాప్‌రెడ్డి, ఆమీర్‌బాషా, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు 2వేల కోట్లు నిధులు కేటాయించి వచ్చే సీజన్ నాటికి నీటిని విడుదల చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.అరుణ్, టి.అంజన్‌కుమార్, ముఠావర్కర్స్ యూనియన్ నాయకులు తిరుమలరావు, శ్రీనివాసులు, నాయకులు నరసింహులు, శ్రీను, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

కంభం : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి 2025 బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని పలు ప్రజాసంఘాల నాయకులు గురువారం కంభం తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజాసంఘాల నాయకులు షేక్ అన్వర్, రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు మొదటి సొరంగంలో రోడ్డుగా ఏర్పాటు చేసిన మట్టిని తొలగించడం, ఫీడర్‌కాలువ మరమ్మతులు నిర్వహించడం, నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకెజ్ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు చేసేందుకు 2వేల కోట్లు అవసరమన్నారు. కార్యక్రమంలో కంభం మండల రైతు సంఘం నాయకులు పాపారాయుడు, నీటిసంఘం మాజీ అధ్యక్షులు చిక్కుడు రోశయ్య, ఎద్దుల రమణ, జాకీర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు : రానున్న బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు ఏరువ పాపిరెడ్డి, ఉపాధ్యాక్షుడు గుమ్మా బాలనాగయ్యలు మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు తాగు, సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జె.నాగరాజు, ఆవుల రాజు, జాన్ రత్నం పలువురు రైతులు పాల్గొన్నారు.

మిట్టపాలెంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఈసందర్భంగా స్వామివారికి గణపతి పూజ, కలశ స్థాపన అగ్నిహోమాలు నిర్వహించి భక్తులకు నైవేద్యం అందజేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవతో పాటు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రంలో చిల్లచెట్ల తొలగింపు

కురిచేడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీలో చెత్త సంపద కేంద్రంలో సర్పంచ్ నక్కా రామక్రిష్ణ గురువారం ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చెత్త నుంచి సంపద సృష్టించే నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ కేంద్రాలను మూలన పడేసింది. దీంతో ఆ నిర్మాణాల వద్ద పిచ్చి మొక్కలు మొలచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సర్పంచ్ రామక్రిష్ణ ఎక్స్‌కవేటర్‌తో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. అలాగే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో డీఈవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ పిలుపునిచ్చారు. గురువారం సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయుల వ్యక్తిగత, సామూహిక సమస్యల పరిష్కారం కోసం డీఈవోకు గత మూడు నెలలుగా అనేక పర్యాయాలు వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్, నాయకులు పి.మాలకొండయ్య, సీహెచ్ చంద్రశేఖర్, వై.శ్రీహరి, సుబ్బారెడ్డి, బి.శ్రీను, జి.రామకృష్ణ, కె.చెన్నయ్య, రవీంద్ర, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

దొనకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా దొనకొండలోని వీరవెంకటాపురంలో గురువారం తెలుగు యువత నేత షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో బోరుబావుల మరమ్మతులు చేపట్టారు. కాలనీలో కొన్ని బోర్లలో నీళ్లు రావడంలేదు. దీంతో మండల పరిషత్ కార్యాలయానికి చెందిన మెకానిక్‌తో మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో మాలపోలు చెన్నయ్య, రాయన కోటేశ్వరరావు, చెన్నారావు, వెంకటేశ్వర్లు, శివ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం వైఫల్యం

పామూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 9 నెలలు గడుస్తున్నా ప్రజలపై భారాలు మోపడమే తప్ప కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ ఆరోపించారు. సివిల్ సప్లయిస్ కార్మికులకు పెరిగిన కూలి రేట్లు, అరియర్స్ అమలు చేయాలని కోరుతూ గురువారం గోడౌన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.మాల్యాద్రి, పి.శ్రీనివాసులు, ఎం.శ్రీను, వెంకట్రావు, సురేష్, పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

- ఏడేళ్లుగా పనులుచేసిన నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు
- గత వైసీపీ పాలనలో కక్ష సాధింపు చర్యలు
- టీడీపీ సానుభూతిపరులని మోకాలడ్డు
- ప్రస్తుత ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా!



దర్శి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల కింద పనులు చేసిన కాంట్రాక్టర్లు, నిర్వాహకులకు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు కూడా అనేక మందికి ఇంకా రాలేదు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం అధికాకంలోకి రాగానే చేపట్టిన పనులకు కూడా ఇంకా బిల్లులు రాలేదు. దీంతో ఇవి ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ పనులు చేయాలంటే భయపడుతున్నారు.

దర్శి నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నూరుశాతం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రూ.30 కోట్లకు పైగా పనులు చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఇతర అభివృద్ధి పనులు నిర్వహించారు. ఈ పనులకు సంబంధించిన బిల్లుల్లో ఇంకా రూ.7 కోట్లు బకాయిలు ఉన్నాయి. పనులు నిర్వహించి ఏడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం అప్పుడు పనులు చేసినవారు టీడీపీ సానుభూతిపరులనే ఉద్దేశంతో కక్షసాధింపుతో బిల్లులు చెల్లించకుండా నిలిపివేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో బిల్లులు చెల్లిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా స్పష్టమైన హమీ ఇచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ ఆ బిల్లులకు మోక్షం కల్గలేదు. ఇటీవల పాత బిల్లులను మళ్లీ అప్‌లోడ్ చేసి పంపించాలని సూచించటంతో పనులు చేసిన నిర్వాహకులు మళ్లీ అధికారుల వద్దకు వెళ్లి నానా అవస్థలు పడి అప్‌లోడ్ చేయించారు. అయినప్పటికీ ఇంకా బిల్లులు రాలేదు.

అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులకు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెపండుగ పేరుతో దర్శి నియోజకవర్గానికి రూ.15 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ పనులు పూర్తిచేసి బిల్లులు కూడా పంపారు. అందుకు సంబంధించి 20శాతం బిల్లులు మాత్రమే అందాయి. అధికారుల లెక్కల ప్రకారం చేసిన పనులకు ఇంకా రూ.12 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. వీటితో పాటు మినీ గోకులాలు నిర్మించుకున్న రైతులకు కూడా బిల్లులు రాలేదు. దీంతో పనులు నిర్వహించిన వ్యక్తులు ఎంచేయాలో దిక్కుతోచక లబోదిబోమంటున్నారు. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనిగిరి పట్టణంలోని 20 వార్డుల్లో ఏప్రదేశంలో అయినా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసుకోవాలంటే తప్పనిసరిగా రుసుం చెల్లించి అనుమతి పొందాలన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారి ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. గత ఆరునెలల కాలంలో మున్సిపాల్టీకి ఫ్లెక్సీల ఏర్పాటుకు చెల్లించిన రుసుం రూపేణ రూ.25 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఈ విధానాన్ని కొనసాగించాలన్నారు. మున్సిపాల్టీ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకునేందుకు ఏ మాత్రం ఉపేక్షించవద్దన్నారు. వెంచర్లు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా కన్వర్షన్ అనుమతి పొంది ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కన్వర్షన్ కాకుండా, ప్లాన్ అనుమతి పొందకుండా వేసే వెంచర్లను తొలగించాలని ఆదేశించారు. అక్రమంగా వేసిన లే అవుట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని కళాశాలల వద్ద మహిళా పోలీసులతో విద్యార్థినులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవికిషోర్, మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేల్, మేనేజర్ ప్రసాద్, ఆర్ఐ ప్రదీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాల్వలను తలపిస్తున్న సిమెంట్ రోడ్డు

మురుగు కాలువ కాదిది.. సిమెంట్ రోడ్డు

కనిగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కనిగిరి శివారు ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తుంది. డ్రైనేజీల్లోని నీరు రోడ్లపైకి చేరుతుంది. కందుకూరు రోడ్డులోని అగ్నిమాపకశాఖ కార్యాలయం వెనుక ప్రాంతంలో పారిశుధ్య సిబ్బంది కన్నెత్తికూడా చూడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్ళే రోడ్డుపై మురుగునీరు చేరి దుర్వాసన వస్తుంది. రోడ్డంతా మురుగు కాలువలను తలపిస్తుంది. మున్సిపాల్టీ అధికారులు స్పందించి తగె చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి సహకారం అభినందనీయం

కనిగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కోరమాండల్ కంపెనీ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ఇంటిగ్రేటెడ్ మహిళా హాస్టల్‌లో కోరమాండల్ కంపెనీ సహకారంతో ఏర్పాటుచేసిన రక్షిత మంచినీటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దశాబ్దకాలంగా హాస్టల్‌లో మెరుగైన వసతుల కల్పనలో పాలకులు నిర్లక్షం వహించారన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో హాస్టల్ సందర్శనకు వచ్చిన సందర్భంలో వసతుల లేమితో విద్యార్థినులు ఇబ్బందుల పడుతున్న విషయం తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో దాతల సహకారంతో వివిధ పనులు చేయించినట్టు చెప్పారు.

విద్యార్థినులు మంచినీరు కావాలని కోరగా, కోరమాండల్ కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. వారు సానుకూలంగా స్పందించి రక్షిత మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటుచేశారన్నారు. కోరమాం డల్ సీఈవో గంటా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తమ కంపెనీ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. జిల్లాలో 12 చోట్ల విద్యార్థులకు ఉచితంగా రక్షిత మంచి నీటి కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం




పీసీపల్లి: వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి

పీసీపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో రూ.5 లక్షలతో కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల దాహార్తి తీర్చడానికి కోరమండల్ సంస్థ ప్లాంట్‌లు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితేనే కనిగిరి నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుం దన్నారు. కోరమాండల్ వైస్‌ప్రెసిడెంట్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటారన్నారు. సేంద్రియ ఎరువులు, రసాయనిక ఎరువులు ఒకదానికొకటి పరిపూరకరమైనవని అన్నారు. రైతులు సమీకృత పోషకాల నిర్వహణకు పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎస్.హరి, డివిజినల్ వ్యవసాయ శాస్త్రవేత్త మోహన్‌కుమార్, సురేష్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సుజాత, నాయకులు, రామయ్య, నాగరాజు, పెద్దన్న, సత్యంరెడ్డి, జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సమాయత్తం

- ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థుల సాధన
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు



పీసీపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థులు

పీసీపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు కీలకం. మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రశ్నావళితో కూడిన పుస్తకాలను ఉచితంగా అందజేసింది. ఈక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 8 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు ప్రత్యేకంగా స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నారు. రోజు మార్చి రోజు స్లిప్‌టెస్టులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు పాఠశాల సమయం ముగిసిన తరువాత అదనంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేస్తున్నారు. మండలంలో కేజీబీవీ విద్యాలయంతో పాటు ఆరు జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరంలో కేజీబీవీలో 37మంది, పీసీపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 56 మంది, గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 72మంది, పెదఅలవలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 41మంది, పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 73మంది, నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 30మంది, మురుగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో 20మంది మొత్తం 329మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

ప్రత్యేక శ్రద్ధతో చదువుతున్నాం

- తాటికొండ గణేష్, పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి



పరీక్షల తేదీలను ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి ప్రత్యేకశ్రద్ధతో చదువుతున్నాం. ఉపాధ్యాయుల శిక్షణలో పరీక్షలకు సిద్ధమవుతున్నాం. అదనపు తరగతులు, స్టడీఅవర్స్‌తో పక్కా ప్రణాళికతో సాధనచేసే అవకాశం ఏర్పడింది.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం

- బి.మమత, పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని



ఉపాధ్యాయుల చొరవతో గణితం, సైన్స్ హిందీ, సోషల్, సబ్జెక్టు వారీగా చదువుతూ ఎక్కువ మార్కులు సాధించే విషయంలో పట్టు సాధిస్తూనే ఇష్టమైన అంశాలపై శ్రద్ధ చూపుతున్నాం.పబ్లిక్ పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేస్తున్నాం.

ఉపాధ్యాయుల సూచనలతో సన్నద్ధమవుతున్నాం

- ముప్పూరి చందు, నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి



మంచి మార్కులు రావాలంటే కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధం కావాలని ఉపాధ్యాయులు సూచించారు. వారి సూచనలతో ఎక్కువ సమయం కేటాయిస్తూ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాం. కష్టతరమైన లెక్కలు, ఇంగ్లీష్ సబ్జెక్టులకు ఎక్కువసమయం కేటాయిస్తున్నాం.

ప్రథమశ్రేణి ఉత్తీర్ణతే లక్ష్యం

- ఎన్వీ మణిచందన, కేజీబీవీ విద్యార్థిని



పదో తరగతి పరీక్షల్లో ప్రథమశ్రేణి ఉత్తీర్ణతే లక్ష్యంగా చదువుతున్నాం. ఉపాధ్యాయులు అన్ని అంశాలను అర్థమయ్యేలా బోధిస్తున్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున కష్టపడి చదువుతున్నాం.

వందశాతం ఫలితాల సాధనే లక్ష్యం

- ఎస్‌కే అబ్దుల్ సుభాన్, హెచ్‌ఎం, పెదయిర్లపాడు



ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నాం. నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నాం. స్లిప్ టెస్టుల్లో వచ్చిన ఫలితాలను పరిశీలిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేకదృష్టి పెట్టారు.

విద్యార్థులకు సలహాలు ఇస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు.

వెలిగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

కురిచేడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కురిచేడు మండలంలోని ఆరు గ్రామాల్లో నాలుగు వేల ఎకరాలు వెలిగొండ ఆయకట్టు కింద ఉందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే సాగు, తాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో రైతు సంఘం నాయకులు తాండవ రంగరావు, పంటా ఏడుకొండలు రెడ్డి, చిరుపల్లి అంజయ్య, సుబ్బయ్య, శ్రీనివాసరావు, నాసరయ్య, రహంతుల్లా ఉన్నారు.

దొనకొండ: అన్నిరంగాల్లో ఎంతో వెనుకబడిన దొనకొండ ప్రాంత అభివృద్ధికి వెలిగొండ ప్రాజెక్టే శరణ్యమని రైతు సంఘం నాయకుడు తాండవ రంగారావు అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిరుపల్లి అంజయ్య, బోరెడ్డి వెంకటరామిరెడ్డి, మల్లవరపు బ్రహ్మయ్య, జి.వీరరాజు, ఎగ్గోని కోటేశ్వరరావు, బొరిగొర్ల తిరుపతయ్య, కాశయ్య, ప్రభాకరరావు, మేకల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్డీ మౌలాలి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్ బాషా, వై.వీరనారామణ, వెంకటేశ్వర్లు, కె.శంకర్, శ్రీను, ప్రసాద్, రఘునాథ రెడ్డి, ప్రభాకర్ తదిరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురంలోనూ ధర్నా నిర్వహించి తహసీల్దార్ బాలవర్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, ఊసా వెంకటేశ్వర్లు, ఏ.వెంకటేశ్వరరెడ్డి, ఓ.వెంకటసుబ్బయ్య, ఎస్.తిరుపతిరెడ్డి, అంకమరావు, బి.జేసురత్నం పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో దారా హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులు జరుగని గ్రామపంచాయతీల్లో శ్రమశక్తి గ్రూపులను తక్షణమే ఏర్పాటుచేసి ఉపాధి పనులు చేపట్టాలన్నారు.

ఏపీవో బి.మురళి మాట్లాడుతూ మండలంలోని 16 పంచాయతీలకుగాను 12చోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం 900 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారని తెలిపారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలన్నారు.కార్యక్రమంలో ఈసీ గురుబాబు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న ఎరుకుల కులస్తులను కులం పేరుతో దూషించి దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయకుండా నీరు కార్చేందుకు యత్నిస్తున్న తాళ్లూరు ఎస్సైపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రఎరుకల హక్కులపోరాట సమితి అధ్యక్షుడు ఎస్.మోహన్‌కుమార్ ధర్మా ఎరుకల డిమాండ్ చేశారు. బొద్దికూరపాడులో గాయపడిన ఎస్టీ కులస్తులకు అండగా నిలిచేందుకు తాళ్లూరు వచ్చిన సందర్భంగా గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. బాపట్ల మండలం పావులూరు గ్రామానికి చెందిన ఎరుకల కుటుంబం పొట్ట చేతపట్టుకుని గొర్రెలను మేపుకుంటూ రెడు నెలల క్రితం బొద్దికూరపాడు గ్రామం వచ్చి జీవనం సాగిస్తున్నారన్నారు.

రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి మరికొందరు ఆ కుటుంబంపై దాడి చేసి గాయపరిచారన్నారు. దాడిపై ఫిర్యాదు తీసుకోకుండా వెనక్కిపంపిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకల హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు, అనుపర్తి ఆదామ్‌మాదిగ్, బాలిగ బ్రహ్మయ్య, అనీల్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో బోల్తాపడిన కారును పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుచ్చుపొద వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఈప్రమాదం చోటుచేసుకుంది. పామూరునుంచి కందుకూరుకు వెళుతున్న కారు పెట్రోల్ బంకు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై పామూరుకు వస్తున్న లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన వేముల నివాస్ (44) అక్కడికక్కడే మృతిచెందారు. కారు సమీప పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. సీఐ ఎం.భీమానాయక్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతిని భార్య సుజాత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ దాసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కైపు వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలుస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులు, పారిశుధ్య కార్మికుల గురించి పట్టించుకొనే వారేలేరని అన్నారు. 20లక్షల ఉద్యోగాల కల్పన గురించి కూటమి ప్రభుత్వం మరిచిపోయినట్లు ఉందన్నారు.

రెవెన్యూ అర్జీల పరిష్కారం

కురిచేడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించినట్టు తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. గ్రామ సభలలో 252 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. గురువారం నాటికి మొత్తం అర్జీలను పరిష్కరించనట్టు ఆమె పేర్కొన్నారు. బుధవారం నాటికి 248 అర్జీలు పరిష్కారం కాగా, గురువారం మిగిలిన నాలుగింటిని పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. సదస్సులలో వచ్చిన అర్జీలన్నింటిని పరిష్కరించడానికి సహకరించిన రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ అభినందించారు.

మారెళ్ళలో ట్రాఫిక్ కష్టాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళలో ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా షాపులు నిర్వాహకులు వారి వాహనాలను రహదారి మీద పెడుతున్నారు. ఆ షాపులకు వచ్చేవారు కూడా వాహనాలను రహదారి మీద పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మార్గంలో వెళ్లే వాహనదారులు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. సాయంత్రం పూట ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. చిరు వ్యాపారులు సైతం రోడ్లపైకి వస్తున్నారు. దీంతో మారెళ్ళ ప్రధాన సెంటర్ నుంచి జమ్మలమడక, మక్కెనవారిపాలెం గ్రామాలకు వెళ్ళే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు అరగంటకు పైగానే ట్రాఫిక్ నిలిచి పోతుంది. దీంతో నిత్యం చిన్న చిన్న గొడవలు దుకాణదారుల మధ్య నెలకొంటున్నాయి.

బస్టాండ్ సెంటర్‌కు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. అసలే చిన్న రహదారి, దానికితోడు షాపుల వారు రహదారిని ఆక్రమించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం- 2 పథకం ప్రయోజనం జిల్లాలో అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. కిందటేడాది అక్టోబరు 31, దీపావళి రోజున రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం ప్రవేశపెట్టి నాలుగు నెలలవుతున్నా ఇప్పటి వరకూ మూడింట రెండోవంతు మందికి మాత్రమే ఉచిత సిలిండర్లు అందాయి. మరో నెలరోజుల్లో గడువు పూర్తి కానున్న నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

దీపం-2కు సాంకేతిక చిక్కులు

- మూడు జిల్లాల్లో 17లక్షల రేషన్ కార్డులు
- ఇప్పటి వరకూ 12 లక్షల మందికే రాయితీ
- మరో నెలరోజుల్లో ముగుస్తున్న తొలి విడత గడువు





రేషన్ కార్డులు లేక.. రెండు లక్షలమందికి అనర్హత

గుంటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరుజిల్లాలో 5,85,942 రేషన్‌కార్డులు కలిగి ఉన్న లబ్ధిదారులు దీపం- 2 పథకానికి అర్హత సాధించగా, ఇప్పటి వరకూ 3,97,000 మంది మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్ తీసుకున్నారు. వారిలో 3,95,000 మందికి మాత్రమే గ్యాసు సిలిండర్ డబ్బు అందింది. కాగా ఇంకా లక్షా 90వేల మందికి ఉచిత సిలిండరు పథకం ప్రయోజనం అందలేదు. బాపట్ల జిల్లాలో 4,86,029 రేషన్ కార్డులు ఉండగా వారిలో 4,58,000 మందికి గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. వారిలో ఇప్పటి వరకూ 3,53,461 మందికి మాత్రమే ఉచిత గ్యాస్ సిలిండర్లు అందాయి. కాగా లక్షా 4వేల 539 మందికి ఇంకా ఈ పథకం దక్కలేదు. పల్నాడు జిల్లాలో 6,45,110 రేషన్ కార్డులు ఉండగా అందులో 4లక్షల మంది మాత్రమే ఇప్పటి వరకూ ఉచిత గ్యాసు సిలిండర్ పొందారు. మిగిలిన రెండున్నర లక్షల మందికి ఇంకా ఉచిత సిలిండర్ దక్కలేదు. నాలుగు నెలల్లో కేవలం 12 లక్షలమందికి మాత్రమే ఉచిత సిలిండర్ అందగా, మరో 38 రోజుల్లో ఐదు లక్షల మందికి ఉచిత సిలిండర్లు అందాల్సి ఉంది. ఇంత తక్కువ సమయంలో అంత ఎక్కువ మందికి అవకాశం లభిస్తుందా లేదా అన్నదే సగటు వినియోగదారుణ్ణి వెంటాడుతున్న ప్రశ్న. దీంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

● రేషన్ కార్డులు లేక 2 లక్షల మందికి అనర్హత

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 19.5 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, రేషన్ కార్డులు మాత్రం 17.31లక్షలు మాత్రమే వున్నాయి. పై గణాంకాల ప్రకారం జిల్లాలో 2.19 లక్షల గ్యాస్ కనెక్షన్లకు రేషన్ కార్డులు లేవు. దీంతో వారంతా ఈ పథకానికి అనర్హులు అయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. పాత రేషన్ కార్డులను విభజించడంగానీ, మార్పు చేర్పులు చేయడంగానీ లేకపోవడంతో ఐదేళ్లుగా వారికి రేషన్ కార్డులు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఇప్పటికి 8 నెలలు పూర్తవుతున్నా ఈరోజు వరకూ వారికి రేషన్ కార్డుల ఊసే లేకుండా పోయింది. అన్ని పథకాలకు ప్రామాణికమైన రేషన్ కార్డు లేకపోవడంతో జిల్లాలో రెండు లక్షల మందికి లేవు దీంతో దాదాపు రెండున్నర లక్షల మంది అనర్హత బారిన పడ్డారు. వీరంతా రేషన్ కార్డు నిబంధనను తొలగించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దాంతో వారంతా ఆశలు వదిలేసుకున్నారు. అయితే ఇప్పుడు అర్హులైనవారిని కూడా సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి.

● సాంకేతిక చిక్కులు..

బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాకపోవడం, లబ్ధిదారునికి రెండు మూడు బ్యాంకుల్లో ఖాతాలుండడం, గ్యాస్ కనక్షన్‌కు ఇచ్చే ఖాతా నంబర్‌తో ఈకేవైసీ పూర్తి కాకపోవడంతో చాలా మంది రాయితీకి దూరమ వుతున్నారు. ఒక కుటుంబంలో గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరున ఉంటుంది. సిలిండర్ వినియో గించే వారు మరొకరు ఉంటారు. కనెక్షన్ ఉన్నవారికే గ్యాస్ సొమ్ము వాపస్ వస్తుంది. ఈ తరహా సమ స్యలతో అనేకమంది ఉచిత సిలిం డర్ ప్రయోజనం కోల్పోతున్నారు.

● కాల్ సెంటర్ల ఏర్పాటు..

ఉచిత సిలిండర్ డబ్బులు పడకపోతే వివరాలు తెలుసుకోవడానికి అన్ని పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఆధార్, గ్యాస్ కనెక్షన్ నంబర్ చెబితే సరిపోతుంది. అలా రాలేనివారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి తమ సమస్యను చెబితే వారు సంబంధిత అధికారు లకు సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపే అవకాశం ఉంటుంది. ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు లబ్ధిదారులకు సూచిస్తున్నారు.



- పీఎం స్వానిధి పేరుతో క్రెడిట్ కార్డులు
- ఇటీవల బడ్జెట్లో అదనపు కేటాయింపులు
- రుణ పరిమితి 50,000ల వరకు పెంపు
- తీరనున్న అధిక వడ్డీ కష్టాలు
- మూడు జిల్లాల పరిధిలో 60,000 మంది వరకు లబ్ధి

చిరు వ్యాపారులకు ఊరట!

పట్టణాల్లో వీధి వ్యాపారులు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వాటిని తీర్చే మార్గం తెలియక ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొనేవారు. వీటి నుంచి వారిని బయటపడేయడానికి కేంద్రం పీఎం స్వానిధి పేరుతో క్రెడిట్ కార్డులు మంజూరు చేసే విధంగా ప్రణాళికలు రచిస్తోంది. గతంలో చిరు వ్యాపారులకు పీఎం స్వానిధి పేరిట తొలి విడతలో పదివేల రుణాన్ని కేంద్రం మంజూరు చేసింది. మెప్మా వద్ద నమోదు అయిన వీధి వ్యాపారులకు దీనిని వర్తింప చేసింది. తాజాగా కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో రుణపరిమితిని రూ.30,000, 50,000కు పెంచి దశల వారీగా వీధి వ్యాపారులకు అందిస్తామని కేంద్రం ప్రకటించడం చిరు వ్యాపారులకు ఊరట నిచ్చింది. ఎండనక వాననక వ్యాపారం చేసి సంపాదించిన డబ్బు వడ్డీల రూపంలో వెళ్లిపోయేదని, ఇప్పుడు వడ్డీ లేకుండా కేంద్రం రుణాలు ఇవ్వడం పట్ల చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పీఎం స్వానిధి పథకం కింద బాపట్ల జిల్లాలో 12,000 మంది పట్టణ వీధి వ్యాపారులకు ఈ పథకం కింద లబ్ధి చేకూరనుండగా, పల్నాడు జిల్లాలో 15,000, గుంటూరు జిల్లాలో 33,000 మంది వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి క్రెడిట్ కార్డులు అందనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ మొదల యింది. గతంలో పదివేల రుణం తీసుకుని సకాలంలో కట్టిన వారంతా తర్వాత దశలో భాగంగా 30,000 రుణం పొందే క్రెడిట్‌కార్డు అర్హత సాధించారు. ఈ కేటగిరిలో కూడా ఇప్పటికే దాదాపు 25,000 మంది వడ్డీలేని రుణాలు తీసుకోనున్నారు. తర్వాత దశలో చిరు వ్యాపారులకు రూ.50,000 వరకు వడ్డీలేని రుణాలు అందించనున్నారు

కుదేలయిన చిరు వ్యాపారాలను గాడిలో పెట్టడానికి...

గత ప్రభుత్వంలోనే కేంద్రం పదివేల రుణ సహాయాన్ని వడ్డీలేకుండా వీధి వ్యాపారులకు అందించింది. కానీ ఈ నిధులను సైతం పక్కదారి పట్టించి అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందకుండా చేసిన ఘనతను వైసీపీ మూటగట్టుకుంది. పైగా ఆ రుణాలను కూడా ఇష్టారీతిన అనర్హులకు దోచిపెట్టినట్లు అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో చిరు వ్యాపారులు అధిక వడ్డీల కోసం దళారులను ఆశ్రయించాల్సి రావడంతో ఆర్థికంగా వారంతా చితికిపోయారు. దీనికి తోడు స్థానికంగా ఉండే నేతలకు జే ట్యాక్స్ కట్టలేక అసలు వ్యాపారాలనే మానేసిన వారు ఉన్నారు. అన్ని విధాలుగా వీధి వ్యాపారులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం పీఎం స్వానిధి పేరిట రుణ సహాయం చేయడానికి పూనుకుంది

కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా...

వీధి వ్యాపారులు నేరుగా పీఎం స్వానిధి పోర్టల్‌లో కాని వారికి దగ్గరలో ఉన్న సీఎస్‌సీలద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించే చిరు వ్యాపారులకు కేంద్రం ప్రోత్సాహకాలు కూడా అందిస్తుంది. దీనిలో భాగంగా 7 శాతం వరకు సబ్సిడీతో పాటు ఏడాదికి రూ.1,200 వరకు క్యాష్ బ్యాక్‌ను కూడా అందిస్తుంది. తీసుకున్న రుణాలపై ఎలాంటి అదనపు చార్జీల వడ్డన లేకపోవడంతో పాటు రుణాన్ని ముగించేటప్పుడు ఎలాంటి చార్జీలను వసూలు చేయకుండా వారి ప్రయోజనాలను కేంద్రం కాపాడుతోంది

పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక

వడ్డీలేని రుణాలను అందుకునే అర్హులైన వీధి వ్యాపారులను ఎంపిక చేసే ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకున్నాయి. పీఎం స్వానిధికి అర్హత సాధించాలంటే సదరు వీధి వ్యాపారి పేరు మెప్మా విభాగం వద్ద రిజిస్టర్ అయి ఉండాలి. ఇందుకోసం గతంలోనే సిబ్బంది ఫీల్డ్ విజిట్ చేసి పేర్లు నమోదు చేసుకున్నారు. అర్హత ఉండి రుణం అందుకోని వారికి నేరు గా కార్యాల యంలో దరఖాస్తు చేసుకునే వెసు లుబాటును కూడా మెప్మా కల్పించింది.

గతంలో జరిగిన సర్వేపై పలు అనుమానాలు

కరోనా కారణంగా దెబ్బతిన్న చిరు వ్యాపారులను ఆదుకునేందుకు కేంద్రం ఆసమయంలో వారిని ఆదుకునేందుకు పదివేల రూపాయల రుణ సాయాన్ని వడ్డీలేకుండా అందించాలనే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదే రుణాన్ని 50,000 వరకు పెంచే విధంగా తాజా బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించింది. కరోనా సమయంలో వీధి వ్యాపారుల లెక్క తేల్చే బాధ్యతను మెప్మాకు ప్రభుత్వాలు అప్పజెప్పాయి. వైసీపీ ప్రభు త్వంలో మితిమీరిన రాజకీయ జోక్యంతో ఈ జాబితా అంతా కూడా నేతల అనుచరగణం తోనే నిండిపోయిందని, అర్హత కలిగిన వీధి వ్యాపారులు 60 శాతానికి మించి ఉండరనే ఆరోపణలు గతంలోనే వచ్చాయి. కానీ గత ప్రభుత్వంలో ఆ జాబితా ఆధారంగానే రుణాలు అందించారు. ప్రస్తుతం కూడా అదే ప్రామాణి కంగా పరిమితి పెంచి మరీ క్రెడిట్ కార్డులు అందించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. మొత్తం జాబితాను జల్లెడ పడితే వీధి వ్యాపా రులు కాని ఎంతోమంది రుణాలు అందుకుం టున్న వైనం వెలుగులోకి వస్తుందనేది అర్హులైన వారి వాదనగా ఉంది. పారదర్శకంగా సర్వే చేయడం వలన అనర్హులు తొలగించబడతారని, తద్వారా అర్హులైన మరి కొంత మందికి ఈ పీఎం స్వానిధి ఫలాలు అందుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సత్తెనపల్లి పోలీసులను అభినందించిన హోం మినిస్టర్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పోలీసులను హోం మినిస్టర్ వంగలపూడి అనిత గురువారం ఫోన్‌లో అభినందించారు. ఎన్‌టీఆర్ జిల్లా గన్నవరంలో ఒక ప్రముఖ కళాశాలలో చదివే ఐదుగురు మైనర్ విద్యార్థినులు మిస్సింగ్ అయ్యారని బుధవారం సాయంత్రం గన్నవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదు మేరకు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సంధ్యారాణి, ఏఎస్ఐ రమణ తమ సిబ్బందితో బుధవారం అర్ధరాత్రి వరకు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ట్రైయిన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు విద్యార్థినులను గుర్తించి చాకచక్యంగా పట్టుకొని వారిని సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో దించి వేశారు. అనంతరం గన్నవరం పోలీసులకు సమాచారం అందించి ఐదుగురు విద్యార్థినులను వారి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయంలో రాష్ట్ర హోం మినిస్టర్ సత్తెనపల్లి పోలీసులకు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు

బాపట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్‌లను, ఎస్పీలను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, పీ4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, వాట్సప్ గవర్నెన్స్ తదితర కార్యక్రమాలపై కలెక్టర్‌కు, ఎస్పీలతో కాన్ఫరెన్స్ నిర్వహించగా బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మార్చి ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రాష్ట్రంలో మార్చి 18వ తేదీ ఉగాది నాటికి పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఐవీఆర్ఎస్ ద్వారా, క్యూఆర్ కోడ్‌ల ద్వారా ప్రజలు నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవటానికి చర్యలు తీసుకోవాలని తెలిపారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాట్సప్ గవర్నమెంట్ ద్వారా అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలు పొందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల సర్వేను మార్చి25 నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఇంటర్మీడియట్ బోర్డు అధికారి పి.యర్రయ్య,జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ దూడీ,జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

- ఉమ్మడి జిల్లాకు రూ.85 కోట్లు
- 4.26 లక్షల మంది రైతులకు లబ్ధి

కిసాన్ యోజన... డబ్బులొస్తున్నాయ్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ యోజన పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.85 కోట్లు రానున్నాయి. రైతులకు పెట్టుబడి భరోసా కల్పించటంతో పాటు, ఇతర అవసరాల కోసం కేంద్రం పీఎం కిసాన్ పథకం కింద ప్రతి ఏటా రూ. ఆరు వేలు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. మూడు వాయిదాలలో ఈ నగదు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయటం జరుగుతుంది. 2024-2025 సంవత్సరానికి మూడో వాయిదా సొమ్మును 24వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదగా విడుదల చేయనున్నారు. ఈ పథకం కింద గుంటూరు జిల్లాలో 86 వేల మంది, పల్నాడు జిల్లాలో 1.98 లక్షల మంది, బాపట్ల జిల్లాలో 1.42 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లాకు 17.27 కోట్లు, పల్నాడు జిల్లాకు 39.63 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.28.45 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి.

లబ్ధిదారుల వడపోత..

వాస్తవానికి పీఎం కిసాన్ యోజన కింద లబ్ధి పొందే వారి సంఖ్య చాలా ఎక్కువగా వుండేది. 2019లో ప్రారంభం అయిన ఈ పథకంలో కొంత మంది అనర్హులు కూడా లబ్ధి పొందుతున్నట్లు కేంద్రా నికి ఫిర్యాదులు వెళ్లాయి. పొలం అమ్ముకున్న వ్యక్తులు, మరణించిన వారు, విదేశాల్లో ఉంటున్న వారు, ఆదాయపు పన్ను చెల్లించే వారు ఇలా అనేక రకాలుగా అనర్హులకు పీఎం కిసాన్ అందుతున్నట్లు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ విచారణలో ప్రభుత్వం భావించినట్లే చాలా మంది అనర్హులను గుర్తించారు. ఉదాహరణకు గుంటూరు జిల్లాలో గతంలో 1,21,898 మంది పీఎం కిసాన్ యోజన కింద లబ్ధి పొందే వాళ్ళు విచారణ జరిపిన తర్వాత ఆ సంఖ్య 86 వేలకు పరిమితం అయ్యింది. అధికారులు చేపట్టిన విచారణలో 33,889 మంది అనర్హులు ఉన్నట్లు తేలింది. వారిలో 465 మంది ఎన్నారైలు, 3799 మంది ఒకరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందేవాళ్ళు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన 477 మంది, 2019 నాటికే పొలం అమ్ముకొన్నవాళ్ళు 5866 మంది, స్థిరమైన భూ యాజమాన్య హక్కులు లేకుండా పథకంలో లబ్ధి పొందిన వాళ్ళు 12747 మంది, గుర్తు తెలియని, చిరునామా లేని వ్యక్తులు 7247 మంది, ఆదాయపు పన్ను చెల్లిస్తూ ఈ పథకం కింద లబ్ధి పొందిన వారు 2325 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించి వారిని తొలగించారు.



ఏడాదిలో హైవే నిర్మాణ పనులు పూర్తి

● ఎన్‌హెచ్‌ఏఐ రీజనల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 1300 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వాటిని సంవత్సరంలోగా పూర్తి చేస్తామని నేషనల్ హైవే అథారిటీ విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన రెండు అంబులెన్సులు, బేబీ ఫీడింగ్ సెంటరు, చిన్నపిల్లల పార్కు, టాయిలెట్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన అంబులెన్సులో ప్రథమ చికిత్సతోపాటు అత్యవసర సమయంలో చికిత్స అందించే వెసులుబాటు ఉందన్నారు. రాష్ట్రంలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టబోతున్నట్టు తెలిపారు. జాతీయ రహదారి పనుల్లో కొన్నిచోట్ల అండర్‌పాస్‌లను ప్రభుత్వం సూచించిందని, రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో ముఖ్యమంత్రే పలు సూచనలు చేశారని చెప్పారు. విజయవాడ పడమర బైపాస్ ఏప్రిల్ చివరినాటికి కొంతమేర పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. అమరావతి రాజధానిలో ఓఆర్ఆర్ పనులకు సంబంధించి ఏడు నెలల్లో టెండర్లు పూర్తిచేసి, మరో ఏడాదిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం, ఎంకే నాయక్, కృష్ణ చైతన్య, ప్రసాద్, శ్రీ వేంకటేశ్వర ఫుడ్ బీవరేజస్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పాల్గొన్నారు.



బేబీ ఫీడింగ్ సెంటరును ప్రారంభిస్తున్న ఆర్‌కే సింగ్ తదితరులు

నిద్రమత్తులో డ్రైవింగ్.. ట్రాక్టర్ బోల్తా

● యువ రైతు మృతి



వెంకటరావు(ఫైల్)

జరుగుమల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి పంచాయతీలోని అగ్రహారం గ్రామానికి చెందిన యువరైతు తాని కొండ వెంకటరావు(35) బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ట్రాక్టర్ బోల్తాపడి దుర్మరణం పాలయ్యాడు. కామేపల్లిలో వేరే వారికి రోటావేటర్‌తో పనిచేసేందుకు వచ్చి, పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళుతున్నాడు. నిద్రమత్తులో రావులకొల్లు అడ్డరోడ్డు వద్ద ట్రాక్టరు అదుపుతప్పి తిరగబడింది. వెంకటరావు ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మరణించాడు. పొగాకు సాగు చేసిన వెంకటరావు, తన సొంత పనులతోపాటు, ఇతరుల పొలాల్లోనూ ట్రాక్టరుతో పని చేస్తుంటాడు. పని ఒత్తిడి, నిద్రలేమి కారణంగానే ట్రాక్టర్ నడుపుతూ నిద్రలోకి జారుకుని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

తిరునాళ్లకు వెళ్లి వస్తుండగా ఘటన

10 తులాల బంగారం అపహరణ

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరునాళ్లకు వెళ్లి బస్సులో తిరిగి వస్తుండగా, పక్కన కూర్చున్న మహిళలే బ్యాగ్‌ను చోరీ చేసిన ఘటన గిద్దలూరులో చోటుచేసుకొంది. దీంతో బ్యాగులోని 10 తులాల బంగారం అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గిద్దలూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన చాబోలు లక్ష్మీదేవి తన కుమారుడు, కోడలితో కలిసి ఈ నెల 18న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని అహోబిలం పుణ్యక్షేత్రంలో జరుగుతున్న తిరునాళ్లకు వెళ్లారు. తిరునాళ్ల ముగిసిన తర్వాత అహోబిలం నుంచి గాజులపల్లె వరకు బస్సులో వచ్చారు. గాజులపల్లె వద్ద గురువారం ఉదయం టిఫిన్ చేసి తరువాత నంద్యాల-విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఎక్కారు. బస్సులో బంగారు కలిగి ఉన్న బ్యాగ్ తన వద్దనే ఉంచుకొని లక్ష్మీదేవి కూర్చొన్నారు. అక్కడే మరో ముగ్గురు మహిళలు కూడా బస్సులో ఎక్కారు. లక్ష్మీదేవి పక్కన ఉన్న ఇరువురు మహిళలు, మరో మహిళ కూడా గిద్దలూరు సమీపంలో దిగువమెట్ట వద్ద బస్సు దిగి వెళ్లారు. బస్సు గిద్దలూరు వచ్చిన తరువాత లక్ష్మీదేవి బ్యాగ్‌ను చూడగా బ్యాగ్ కనిపించలేదు. వెంటనే కొడుకు, కోడలికి విషయం తెలియజేశారు. వారు హుటాహుటిన గిద్దలూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బ్యాగ్ చోరీకి గురైందని, అందులో 10 తులాల నక్లెస్, ల్యాంగ్ చైన్, కడియం ఉన్నాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూపు-2, ఇంటర్మీడియెట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆయా పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ పరీక్షల నిర్వహణపై సమావేశమై మాట్లాడారు.

23న గ్రూపు-2 పరీక్షలు

జిల్లాలో ఈనెల 23న జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందిగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. ఈ పరీక్షలకు 4,544 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో 8801188046 సెల్ నెంబర్‌తో కంట్రోల్ రూమును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై...

మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 42,439 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా అందు కోసం 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు మూడు సిట్టింగ్ స్క్వాడ్స్, మరో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 24 గంటలు పనిచేసేలా జిల్లా స్థాయిలో 08592-281275 నెంబర్‌తో కంట్రోలు రూమును ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

బాధ్యత రెండు జిల్లాలది.. బాధలు జనాలవి...

సగం ఊరు బాపట్ల.. మిగిలిన సగం ఊరు గుంటూరు జిల్లాలో...

తిక్కరాజుపాలెం గ్రామస్థులను వదలని కష్టాలు

మంచినీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే

భూమి పత్రాల విషయంలోనూ ఇబ్బందులే

పలు ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు

తిక్కరాజుపాలెం(పర్చూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆ ఊరికి రెండు పంచాయతీలు.. ఇద్దరు సర్పంచ్‌లు.. ఇద్దరు ఎంపీపీలు.. ఇద్దరు ఎమ్మెల్యేలు.. ఇంకా చెప్పాలంటే రెండు జిల్లాల పరిధిలో ఉంది. రెండు జిల్లాల పాలకులు కనుసన్నల్లో పాలన నడుస్తున్న గ్రామాన్ని పుట్టెడు కష్టాలు వెంటాడుతున్నాయి. ఏ జిల్లా అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా స్పందిస్తే ఆ ఊరి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఎవరూ ఆ గ్రామంపై దృష్టి పెట్టలేదు. ఈ కారణంగా ఆ గ్రామస్థుల తాగునీటి కష్టాలు నేటికీ తీరడం లేదు. కనీస సమస్యలు కూడా పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామం పేరు తిక్కరాజుపాలెం. వివరాల్లోకెళ్తే...



తిక్కరాజుపాలెం గ్రామం

తిక్కరాజుపాలెంలో సుమారు 500 మంది జనాభా ఉంటారు. ఆ ఊరు సగభాగం బాపట్ల జిల్లా పర్చూరు మండలం, మిగిలిన సగభాగం గుంటూరు జిల్లా కాకుమాను మండలంలో ఉంది. పర్చూరు మండలంలోని గొల్లపూడి పంచాయతీలో కొంత భాగం, కాకుమాను మండలంలోని గార్లపాడు పంచాయతీ పరిధిలో కొంత భాగంలో విస్తరించి ఉంది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే ఈ గ్రామస్థులు కొందరు పర్చూరు, మరికొందరు ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థులకు ఓట్లు వేస్తుంటారు. పన్నుల రూపంలో పెద్దగా ఆదాయం వచ్చేది లేదు. దీని వల్ల అక్కడ చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు పంచాయతీలు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



రెండు గ్రామాలను వేరుచేసే రోడ్డు ఇదే

రైతుల సమస్యలు చెప్పనలవి

తిక్కరాజుపాలెం వాసులకు గ్రామంలో ఇరువైపులా భూములు ఉన్నాయి. ఇవి రెండు జిల్లాల పరిధిలో ఉండడంతో ప్రభుత్వ పథకాల కోసం ధ్రువీకరణ పత్రాల కోసం ఇతరత్రా భూ సమస్యల పరిష్కారం కోసం రెండు జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామాన్ని ఒకే నియోజకవర్గం, ఒకే గ్రామ పంచాయతీలోకి కలిపి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదిలావుండగా ప్రజా ప్రతినిధులు సైతం ఇరు జిల్లాలకు చెందిన అధికారులను కలుసుకోవాల్సిందే. ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలోనైనా తిక్కరాజుపాలెం గ్రామ కష్టాలను పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా రక్షిత నీటి పథకం

మంచినీటి కోసం బహుదూరం వెళ్లాలి

గ్రామస్థులు తాగునీటి కష్టాలు వర్ణనాతీతం. నీటి కోసం పొరుగు గ్రామాలైన చెరుకూరు, పర్చూరు, చిననందిపాడు గ్రామాలకు సుమారు ఆరేడుకిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధులు, దివ్యాంగులు గత్యంతరం లేక గ్రామంలోని చెరువు నీటితోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. కనీసం ఉన్న ఒక్క చెరువు కూడా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

సామాజిక తనిఖీలో రూ.8లక్షల రికవరీ

సోషల్ ఆడిట్‌పై ప్రజల్లో సన్నగిల్లుతున్న నమ్మకం

వైసీపీ పాలనలో రూ.13 కోట్లతో పనులు

పెద్ద ఎత్తున అవినీతి

తూతూమంత్రంగా ఆడిట్



బల్లికురవలో సామాజిక తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు (ఫైల్)

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకానికి సంబంధించి రెండేళ్ల కాలానికి గాను సామాజిక తనిఖీ పూర్తి కాగా అధికారులు కేవలం రూ.8 లక్షలతో చేపట్టిన పనులలో మాత్రమే అవకతవకలు జరిగాయని గుర్తించారు. మొత్తం రూ.13కోట్ల పనులు గత వైసీపీ హయాంలో జరగ్గా పెద్ద ఎత్తున గ్రామాలలో ఉపాధి పనులలో అవకతవకలు చోటుచేసుకున్నాయి.

అక్రమాలు ఇలా...

కొన్ని గ్రామాలలో రోడ్లు వేయకుండానే, అలానే మొక్కలు లేకుండానే, కొందరు పనులకు వెళ్లకుండా బోగస్ మస్టర్లు వేసి నిధులు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. అంతేగాక కొన్నిచోట్ల ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కూలి సొమ్ము చెల్లించడం, మరి కొన్ని చోట్ల ఉపాధి సిబ్బంది క్షేత్ర సహాయకుల నుంచి బోగస్ మస్టర్లు వేసినందుకు నగదు వసూళ్లు చేయడం, ఎంబుక్‌లు లేకుండానే పనులకు నిధులు మంజూరు చేయడం వంటి అభియెగాలను సామాజిక తనిఖీలో బృందాలు గుర్తించాయి.

ప్రజా వేదిక కార్యక్రమాన్ని గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు తెలియకుండా రెండు రోజుల కిందట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు. అధికారులు రాకముందే ఉపాధి సిబ్బంది తాము అంతా సెటిల్ చేసుకున్నాం తమకు ఏమీ కాదని బహిరంగంగా ప్రచారం చేశారు. ఆ ప్రచారం వలే సామాజిక తనిఖీలో అధికారులు గత వైసీపీ పాలనలో పనిచేసి ఉద్యోగాలు మాని వేసిన వారికి పెనాల్టీలు విధించి చేతులు దులుపుకున్నారు. మొత్తం రూ.8లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు గుర్తించగా.. అందులో గతంలో పనిచేసిన 18 మంది క్షేత్ర సహాయకులకు రూ.7లక్షల వరకు రికవరీలు వసూళ్లు చేయాలని పెనాల్టీలు వేశారు. ఆడిట్‌కు మాత్రం గతంలో పనిచేసిన క్షేత్ర సహాయకులు గైర్హాజరు కావడం గమనార్హం. వారిని అటు వైపు రాకుండా అధికారులే ప్లాన్‌గీసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి సిబ్బందికి రూ.లక్ష వరకు రికవరీలు రాశారు. అధికారులకు తెలియకుండా క్షేత్ర సహాయకులు అవకతవకలకు ఎలా పాల్పడతారని తరచూ తనిఖీలు చేసే అధికారులు పనుల వద్ద ఏం పరిశీలన చేశారని, గతంలో జరిగిన తప్పులకు అధికారుల పాత్ర కూడా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. సామిజిక తనిఖీలపై నమ్మకం పోతుందని వారు అంటున్నారు. ఉపాధి పనులలో లోపాలు గుర్తించేందుకు లక్షలు ఖర్చు చేస్తూ చేస్తున్న ఆడిట్‌లు ఇకముందైనా సక్రమంగా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికతో కూడిన విద్యతోనే నైపుణ్యాభివృద్ధి

● ప్రొఫెసర్ రాజశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యో తి): ప్రతి విద్యార్థికి ప్రణాళికతో కూడిన విద్యతో నే నైపుణ్య అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ కెరియర్ కౌన్సిలర్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నా రు. భీమ్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన ఓరియంటేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ అంశంపై సదస్సు ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరి గింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశలోనే తన భవిష్యత్ కు సంబంధించిన ప్రణాళిక చేసుకోకపోవడం వల్లే డిగ్రీ విద్యార్థులు సరైన నైపుణ్యాలు లేక జీ వితంలో ఉద్యోగ అవకాశాలు పొందలేక పోతున్నారని చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన త ర్వాత ఉన్నత విద్య కోసం జాతీయస్థాయి వి శ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం వల్ల లాంగ్వేజ్ కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ రంగ ఉద్యోగాల కన్నా ప్రైవేటు రంగం లోనే ఎక్కువ అవకాశాలు ఉన్నా యని, ప్రతి విద్యార్థి వినూత్నంగా ఆలోచన చేయాలన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలం టే విద్యా ఒక్కటే ప్రధాన మార్గమన్నారు. విద్యా ర్థులు చదువు మీదకంటే డ్రగ్స్‌వంటి చెడు అలవాట్లకు లోనవుతున్నారని, దానివల్ల జీవితంలో సరైన లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని తెలిపా రు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ యర్రమాల కోటేశ్వరరావు, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మల్లికార్జున్, భీమ్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, అంగలకుర్తి వెంకటేశ్వర్లు, మనోజ్‌కుమార్, బీరకాయల మహేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజశేఖర్

కొణికి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర

టీడీపీ గెలవడంతో మొక్కుతీర్చుకుంటున్న టీడీపీ నాయకులు



పాదయాత్రను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఇంకొల్లు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణికి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గుది సీతారామయ్య ఆధ్వర్యంలో కొణికి నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రను గురువారం మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. 20024లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో కడిగిన ముత్యంలా బాబు విడుదల కావాలని, పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని, ఏలూరి సాంబశివరావు మూడోసారి గెలవాలని మండలంలోని కొణికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గుది సీతారామయ్య శ్రీశైలానికి పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు శివస్వామి దీక్షధారణ చేసి గురువారం కొణికి నుంచి శ్రీశైలంకు పాదయాత్రతో బయలుదేరారు. ఇందుకు మద్దతు తెలుపుతూ మండలంలోని నాయకులు పాలేరు రామకృష్ణ, కరి శ్రీను, గుంజి వెంకట్రావు, కరి వీరాంజనేయులు, మార్క్, తాతయ్య, నాయకులు పాదయాత్రను ప్రారంభించారు.

ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ తమ జీవితాన్ని ఆధ్యాత్మికత, సేవా దృక్పథం, ప్రేమతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు పంటల మల్లారెడ్డి రచించిన సనాతన ధర్మం అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మంలో నిజాయితీ, జీవులకు హానికలిగించకుండా ఉండడం, స్వచ్ఛత, సద్భావన, దయ, ఓర్పు, సహనం, స్వీయనిగ్రహం, దాతృత్వం, సన్యాసం వంటి సద్గుణాలు ఉంటాయన్నారు. నేటి సమాజానికి హిందూధర్మం ప్రాముఖ్యతను పుస్తకం ద్వారా తెలియచేసిన మల్లారెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.

అవీఇవీ

ధాన్యం అమ్మకాలలో మోసం

బస్తాకు నాలుగు కేజీల చొప్పున అదనపు కాటా

వ్యాపారి మోసాన్ని గుర్తించి నిలదీసిన ముక్తేశ్వరం రైతులు

గుట్టుచప్పుడు కాకుండా రైతులకు డబ్బు చెల్లించిన వ్యాపారి

గతంలో తమ వద్ద కూడా అలానే చేసి ఉంటారని ఆందోళన



ముక్తేశ్వరంలో ధాన్యం కాటాలు వేస్తున్న కూలీలు

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రైతుల వద్ద ధాన్యం అమ్మకాలు చేసే సమయంలో బస్తాకు నాలుగు కేజీల వంతున కాటాలో ఓ వ్యాపారి మోసం చేస్తూ రైతులకు పట్టుబడ్డాడు. అందిన సమాచారం మేరకు... మండలంలోని వైదన గ్రామానికి చెందిన ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారి బుధవారం రాత్రి ముక్తేశ్వరం గ్రామంలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి 76 కేజీల వంతున కాటాలు వేసి లారీలో లోడ్ చేయించాడు. ఒక రైతుకు అనుమానం వచ్చి ధాన్యం బస్తా బరువు ఎక్కువగా ఉందని వేరే కాటా వద్దకు ధాన్యం బస్తాను తీసుకు పోగా అది 80 కేజీల బరువు తూగింది. దీంతో రైతు వెంటనే మరి కొన్ని బస్తాలను కాటా వేయగా అవి కూడా అలానే తూగాయి. తమను వ్యాపారి మోసం చేశారని గ్రహించి లారీని నిలిపివేశారు. దీనిపై గొడవ వద్దని ఆ వ్యాపారి చేసేది లేక నాలుగు కేజీల ధాన్యానికి డబ్బులు చెల్లించారు. గతంలో ఇదే గ్రామంలో 7 లారీల ధాన్యాన్ని అ వ్యాపారి కొనుగోలు చేశారు. అప్పట్లో ఆ రైతులను కూడా మోసగించి ఉంటారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్దతు ధరకు కందులు కొనుగోలు



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణ శ్రీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కందులను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుకోలు చేస్తున్నట్లు మార్క్ ఫెడ్ జిల్లా మెనేజర్ కరుణశ్రీ తెలిపారు. గురువారం నాగులపాడు సొసైటీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కరుణశ్రీ మాట్లాడుతూ కందులు క్వింటాల్ ఒక్కటికి రూ.7550 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. 12 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి వెంకట కృష్ణ మాట్లాడుతు ఈ పంట నమోదైన రైతులకు రైతు సేవా కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు రిజిస్ట్రేషన్ చేసి, షెడ్యూల్ తెలియచేస్తారని తెలిపారు. బస్తాలు ప్రభుత్వమే పరఫర చేస్తుందని, రైతులు అందరు మద్దతు ధరకు పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేర్ హౌస్ మేనేజర్ రాంబాబు, ఎన్‌సీసీఎఫ్ అసిస్టెంట్ మేనేజర్ మనోజ్, ఎన్‌సీఎల్ క్యాలిటీ ఇన్‌స్పెక్టర్ గోవింద్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోషకాహారాన్ని తీసుకోవాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సాయిశ్రీచరణ్


చినగంజాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.సాయిశ్రీ చరణ్ అన్నారు. చీరాల లోక్‌అదాలత్ చైర్మన్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రములను గురువారం సందర్శించి, విద్యార్థులకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలల్లో 28 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించి, వారు వైద్యం ఎక్కడ పొందాలో వైద్యాధికారి సూచించారు. దివ్యాంగ విద్యార్థులు తప్పనిసరిగా సదరమ్ సరిఫ్టికెట్‌ను తీసుకోవాలని అన్నారు. వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. విద్యార్థినీవిద్యార్థిలకు పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో చీరాల లోక్ అదాలత్ కమిటీ మెంబరు ఆసోది రామకృష్ణారెడ్డి, మండల పారా లీగల్ ఆథారిటీ మెంబరు ఎంవీ.రామారావు, చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్ఎం డి.రత్నకుమారి, హెల్త్ విజిటర్ ఐ.ఉల్దారాణి, సీహెచ్‌వో విజయలక్ష్మి, ఆశాలు శారమ్మ, రోహిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

● డీఆర్వో చినఓబులేసు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 17నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్వో చిన ఓబులేషు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం సాయంత్రం పరీక్షలపై సమీక్షించచారు. జిల్లాలో 29,602 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా అందుకోసం 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్ స్కాడ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓపెన్ స్కూలు సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 17నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు 1,564, మార్చి 3నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఈ సందర్భంగా డీఆర్వో దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై డీఆర్వో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సదుపాయాలతో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బోల్తాపడిన కారును పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుచ్చుపొద వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఈప్రమాదం చోటుచేసుకుంది. పామూరునుంచి కందుకూరుకు వెళుతున్న కారు పెట్రోల్ బంకు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై పామూరుకు వస్తున్న లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన వేముల నివాస్ (44) అక్కడికక్కడే మృతిచెందారు. కారు సమీప పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. సీఐ ఎం.భీమానాయక్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతిని భార్య సుజాత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ దాసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాగితాలకే పరిమితమైన కొప్పెరపాడు పీహెచ్‌సీ

- భవనం లేక రెండేళ్లుగా గుంటుపల్లి పీహెచ్‌సీలోనే ఆ ఇద్దరు వైద్యుల విధులు
- వైద్య సేవల కోసం తొమ్మిది గ్రామాల ప్రజల ఎదురుచూపులు
- ఉన్నతాధికారులు వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని ప్రజల విజ్ఞప్తి

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల జనాభా పెరగడంతో రెండేళ్ల కిందట ప్రభుత్వం నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మండలానికి మరో పీహెచ్‌సీని మంజూరు చేసింది. గుంటుపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా, కొప్పెరపాడు గ్రామానికి మరో పీహెచ్‌సీని మంజూరు చేసి ఇద్దరు వైద్యులను నియమించారు. రెండేళ్ల నుంచి అక్కడ భవనం లేక పోవడం, నూతన భవనాల కోసం స్థలం ఎంపిక చేయక పోవడంతో గుంటుపల్లి పీహెచ్‌సీలోనే నూతనంగా మంజూరైన పీహెచ్‌సీ పనిచేస్తుంది. దీంతో తమకు కేటాయించిన వైద్యశాల కాగితాలకే పరిమితం అయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ మండలంలో సుమారు 60వేల జనాభా ఉంది. వీరికి వైద్య సేవలు అందించాలంటే గుంటుపల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరిపోవడం లేదని ప్రభుత్వం 2023 మేలో కొప్పెరపాడు గ్రామానికి రెండో పీహెచ్‌సీని మంజూరు చేసింది. ఈ పీహెచ్‌సీ ద్వారా కొప్పెరపాడు, గుడిపాడు, కూకట్లపల్లి, గొర్రెపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, కొమ్మినేనివారిపాలెం, వైదన వల్లాపల్లి గ్రామాలకు వైద్య సేవలు అందాల్సి ఉంది. కానీ ఇంత వరకు నూతన పీహెచ్‌సీని కొప్పెరపాడులో ప్రారంభించలేదు. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు, సిబ్బంది కేటాయించిన అక్కడ భవనం లేక వారు గుంటుపల్లి పీహెచ్‌సీ వరకు మాత్రమే వచ్చి వెళుతున్నారు. అక్కడే విధుల నిర్వహిస్తున్నారు. జీతాల కూడా కొప్పెరపాడు పీహెచ్‌సీ పేరుపైనే తీసుకుంటున్నారు. కానీ ఇంతవరకు అక్కడ నూతన భవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. నూతన భవనాలకు నిధులు మంజూరై ఉన్న స్థలం లేక రెండేళ్ల నుంచి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని తాత్కాలికంగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలలో పీహెచ్‌సీని ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని తొమ్మిది గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంటుపల్లి పీహెచ్‌సీలోనే కొనసాగుతున్న కొప్పెరపాడు పీహెచ్‌సీ సేవలు

సీజనల్ వ్యాధులొస్తే పరుగులు

కొప్పెరపాడులో పీహెచ్‌సీ ఉంటే సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగం. జ్వరం వచ్చినా గ్రామాల ప్రజలు పదిహేను కిలోమీటర్ల దూరం ఉన్న గుంటుపల్లి పీహెచ్‌సీకి వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు వస్తే ప్రజలు పట్టణ ప్రాంతాలకు పరుగు పెడుతున్నారు. వైద్యులుండి, సిబ్బంది ఉండి కొప్పెరపాడులో నూతన పీహెచ్‌సీ ఏర్పాటు గురించి అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన పలు భవనాలు ఖాళీగా ఉన్నాయని వాటిలో పీహెచ్‌సీని ఎందుకు నడపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగితాలకే పరిమతమైన నూతన పీహెచ్‌సీని వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కార్మికులు

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మునిసిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత, భరోసా కల్పించి టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరై కార్మికుల సమస్యలను ఉద్దేశించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆప్కాస్ విధానం అమల్లోకి వచ్చిఉంటే జీవితాలు దయనీయంగా మారేవన్నారు. ఈక్రమంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 20, 21 తేదీలలో ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేయడంతో పాటు 24న ముఖ్యమంత్రికి ఉత్తరాలు పంపడం, 25, 26 తేదీలలో మునిసిపల్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్.బాబూరావు, వీరాస్వామి, ఇమ్మానియేల్, క్రాంతిసాగర్, రాంబాబు, నాగేశ్వరరావు, చాంద్ బాషా, సురేష్, రంజిత్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, కుమారి, సంధ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యతో పిల్లల సర్వతోముఖాభివృద్ధి


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చినగంజాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి అంగన్‌వాడీ విద్య ఎంతో ఉపయోగమని మండల విద్యాశాఖాధికారి-1 బి.అజయ్‌బాబు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు మంచి పునాది వేయాలని అన్నారు. చిన్నతనం నుండే మంచి అలవాట్లు నేర్పించాలని సూచించారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధిపై రోల్‌ప్లే చేసి డెమో ప్రదర్శించారు. డీఆర్‌పీలు శ్రీనివాస రెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కే.వాణిశ్రీ, ఎన్.సుమలత, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు : అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని ఎంఈవో కె.నాగభూషణం అన్నారు. పంగులూరు విద్యావనరుల కేంద్రంలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా బోధనాంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా పిల్లలకు మంచి అలవాట్లతో పాటు అక్షర జ్ఞానంతో పాటు సంఖ్యా పరిజ్ఞానం అందించాలన్నారు. ఆటలు, పాటలతో ఆసక్తికరంగా బోధన చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఓ.ప్రతాప్, సుబ్బారావు, శ్రీధర్‌తో పాటు సూపర్‌వైజర్ పద్మజ వ్యవహరించారు. మండలంలోని 54 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించాలి


సమావేశంలో పాల్గొన్న డీపీవో కుమారస్వామి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ

యద్దనపూడి, (వరార్బారు) ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్ను వసూలుపై దృష్టిసారించాలని డీపీవో కుమారస్వామి పంచాయతీ కార్యదర్శులను కోరారు. ఆయన గురువారం యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ క్యాదర్శులతో సమావేశమయ్యారు. సమావేశానికి ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ యద్దనపూడి మండలంలో వివిధ గ్రామాలలో ఇంటి పన్ను బకాయిలపై కార్యదర్శులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా చెత్త సంపద కేంద్రాలు నిర్వహణ తీరును కూడా అడిగి తెలుసుకున్నారు. మార్చి ఆఖరులోపు వీలైనంత ఎక్కువగా ఇంటి పన్నులు, ఇతరత్రా పన్నులను వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఈవోఆర్‌డీ కృష్ణ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలతో పేదరిక నిర్మూలన

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పొదుపు సంఘాలు బాగుంటే పేదరిక నిర్మూలన సాధ్యమని వెలుగు ఏపీఎం రాజారావు పేర్కొన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై గ్రామ సంఘాల అధ్యక్షులకు శిక్షణ జరిగింది. ఈసందర్భంగా వీవోల నుంచి వచ్చిన మహిళలను గ్రుపులుగా చేసి పేదరిక నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యల గురించి వారి నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీఎం తెలిపారు. ఈ శిక్షణలో సీసీ పేరయ్య పాల్గొన్నారు.


శ్మశానవాటికకు నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

ఎస్సీ శ్మశాన వాటికకు తీరిన దారి కష్టాలు

- ఉపాధి ద్వారా సీసీ రోడ్డు
- మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి శ్మశాన వాటికకు వెళ్లే దారి లేక బల్లికురవ ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఎస్సీ కాలనీ వాసులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి శ్మశాన వాటిక వద్ద గల ఇబ్బందులను తీసుకు వెళ్లారు. మంత్రి రవికుమార్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పపథకం నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో బల్లికురవ ఎస్సీ శ్మశాన వాటికకు సర్పంచ్ పందిరి అంజిబాబు సహకారంతో మట్టి రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేశారు. గతంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించాలంటే నరకయాతన అనుభవించే వారిమని ఇప్పుడు శ్మశానవాటిక స్థలంలో మెరక మట్టిని తోలించడంతో పాటు దారి సమస్య లేకుండా సీసీ రోడ్డు వేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి రవికుమార్‌కు ఎస్సీ కాలనికి చెందిన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాలి

పంగులూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ ద్వారా పనులు వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. కార్యాలయంలో ఉపాధి పథకం పనుల నిర్వహణపై గురువారం విలేకరులతో మాట్లాడుతూ పనుల్లో పారదర్శకత పాటించాలన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలో 25 నీటి కుంటలు, 150 ఇంకుడు గుంటల నిర్మాణం టార్గెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. పనులను త్వరితగతిన చేపట్టి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. పనికి వచ్చే కూలీలకు కొలతల ప్రకారం పని చూపించి తగిన కూలి అందేలా చర్యలు చేపట్టాలని, కూలీలు కొలతల ప్రకారం పని చేసే విధంగా టి.ఎ.లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని కోరారు. పనికి హాజరయిన వారికే మస్టర్ వేయాలని, ఎలాంటి అవినీతికి చోటు లేకుండా పనులు జరిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సంతోషం పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఏపీఎం మోహనరావు, పాల్గొన్న ఎంపీడీవో నేతాజీ, తహసీల్దార్ నాగరాజు, పార్టీ నేతలు

కొడవలివారిపాలెం (పర్చూరు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సబ్‌ప్లాన్ నిధులు, రుణాలను సద్వినియోగం చేసుకొని ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కారంచేడు ఏపీఎం మోహనరావు కోరారు. కారంచేడు మండలంలోని కొడవలివారిపాలెం గ్రామంలో మంజూరైన రూ.25లక్షల చెక్కులను గురువారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, తహసీల్దార్ నాగరాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీహరి, మండల జనరల్ సెక్రటరీ షేక్ ఖాశిం, సీసీలు సుబ్బారావు, ఇస్సాక్ పాల్గొన్నారు.

నేడు వైదనలో మంత్రి గొట్టిపాటి పర్యటన

రూ.50లక్షలతో షాదీఖానాకు భూమి పూజ

బల్లికురవ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన మంజూరైన రూ.50లక్షల నిధులతో నిర్మించనున్న షాధిఖానాకు మంత్రి భూమి పూజ చేయనున్నారు. అలానే గ్రామంలో ఉపాధి పథకంలో రూ.20లక్షలతో ఇటీవల నిర్మాణం చేపట్టిన సిమెంట్ రోడ్లను అయన ప్రారంభించనున్నారు. ఈసందర్భంగా గ్రామ టీడీపీ నేతలు పోగుల శేఖర్ షాదీఖానా వద్ద ఏర్పాటు చేస్తున్న శిలాఫలకం పనులను గురువారం పరిశీలించారు.


షాదీఖానా వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేయిస్తున్న టీడీపీ నాయకులు

పదవ తరగతి పరీక్షల్లో జాగ్రత్తలు పాటించండి

రీజనల్ ఎడ్యుకేషనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మార్చి 17 నుంచి 31 వరకు జరుగనున్న పదవ తరగతి పరీక్షల్లో జాగ్రత్తలు పాటించాలని ఎడ్యుకేషనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో పరీక్ష కేంద్రాల చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు, రూట్ అధికారులు, కస్టోడియన్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణ, తగిన ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. జిల్లాలో 103 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 16361 మంది రెగ్యులర్, 438 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, గంగాధరరావు, సురేష్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, శ్రీనివాస్, ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించిన లెఫ్టినెంట్ కల్నల్ పరమార్, సబ్ మేనేజర్ ముకేశ్ కుమార్

మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

మార్టూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో నూతన ఎన్‌సీసీ యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. చీరాల 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పరమార్ జడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ జెండాను ఎగురవేసి నూతన యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఏడాదికి 50 మంది బాలబాలికలకు ప్రవేశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సబ్ మేనేజరు ముకేశ్ కుమార్, వలపర్ల ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మార్టూరు హైస్కూల్‌లో ఎన్‌సీసీ కేర్ టేకర్ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్‌మిల్టన్, శివ రామకృష్ణ, గిరి, చట్టి శ్రీను పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఉచిత కంటి శిబిరాన్ని వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ చీరాల ప్రతినిధులు తెలిపారు. వచ్చే ఆదివారం క్లబ్ సమావేశం హాలులో రోటరీక్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు శంకర్ కంటి హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు క్యాంపు ఉంటుందని పరీక్షలు అనంతరం శుక్లాలు ఉన్న వారికి గుంటూరుకు తరలించి చికిత్స అనంతరం వారి వాహనంలోనే అదేరోజు తిరిగి చీరాలకు చేర్చనున్నట్లు వివరించారు. వైద్య సాయం అవసరమున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. వివరాలకు 92913 02001, 89191 88089 నెంబర్‌లను సంప్రదించాలని చెప్పారు.

23న రాజుబంగారుపాలెంలో ఉచిత వైద్య శిబిరం

చినగంజాం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రా - ధా - స్వ - ఆ - మీ సత్సంగం (దయాల్బాగ్) ఒంగోలు బ్రాంచి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు దయాల్బాగ్ రాజుబంగారుపాలెం సెంటర్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

జిల్లా రీసెర్చి స్టేషన్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ మధు


మాట్లాడుతున్న జిల్లా రీసెర్చ్ సైంటిస్ట్ మధు, ఏడీఏలు మోహనరావు, రత్నకుమారి, ఏవో రామ్మోహన్‌రెడ్డి

పర్చూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలతోపాటు, పంట మార్పిడి విధానాన్ని తప్పక పాటించాలని బాపట్ల జిల్లా రీసెర్చి స్టేషన్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ మధు అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రైతులు, పురుగు మందు డీలర్లతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న సైంటిస్ట్ మాట్లాడుతూ నేల స్వభావాన్ని ముందుగానే తెలుసుకున్నపుడు ఎలాంటి పంటలను సాగుచేసుకోవాలో తెలుస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వీరయ్య చౌదరి మాట్లాడుతూ రైతులు వేసవి దుక్కి దున్నుకోవాలని, విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మోహనరావు, ఏవో రామ్మోహన్‌రెడ్డి, బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ టి.రత్నకుమారి, టీవీ రామారావు, రైతులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న యువత

పోలీసులకు పలువురి ఫిర్యాదు

అద్దంకి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో పలువరు యువకులు మోటార్ సైకిళ్లను ఇష్టానుసారంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం అద్దంకి పట్టణంలోని పోతురాజు గండి వద్ద కోటేశ్వరరావు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా యువకుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఈ విషయాన్ని కోటేశ్వరరావుతో పాటు అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మరి కొందరితో కలిసి వెళ్లి సీఐ సుబ్బరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. యువత మోటార్‌సైకిళ్లను ఇష్టానుసారంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాజు తెలిపారు. యువత ఇష్టానుసారంగా వాహనాలు నడిపితే తల్లిదండ్రులతో పాటు మోటార్‌సైకిల్ యజమాని కూడా శిక్షార్హులవుతారని తెలిపారు.


అద్దంకి పట్టణంలో పోతురాజు గండి వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతంలో నిలిచిన వాహనాలు


యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

రె'వెన్యూ' లెక్క తేలుస్తారా!?

- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూముల పంపిణీ
- నేతలకే పందేరం!
- అక్రమాలపై విచారణ ఏదీ!?
- భూ సమస్యల పరిష్కారంలోనూ నిర్లక్ష్యం
- నేడు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా సమీక్ష

నెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు అన్నీ ఇన్నీ కాదు. పేదల ఇళ్లకు భూమి కొనుగోలు మొదలు అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేసే వరకూ ప్రతిచోటా లెక్కలేనన్ని తప్పులు జరిగాయి. ఇళ్లకు భూమి కొనుగోలు, ఫ్రీహోల్డ్ పేరుతో అసైన్‌మెంట్ భూములు కొట్టేయడం వంటి అక్రమాలపై ఇప్పటికే విచారణలు జరుగుతున్నాయి. అయితే అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ వ్యవహారంపై మాత్రం ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పేదలు కాకపోయినా వైసీపీ నాయకులు అనే అర్హతతో గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను ధారాదత్తం చేశారు. అసలు జిల్లాలో ఏ గ్రామంలో ఎవరికి భూములిచ్చారు? ఎంత భూమిని పంపిణీ చేశారు? అన్నది ఇప్పటికీ తెలియదు. చివరకు గ్రామసభలు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అసైన్‌మెంట్ వ్యవహారాన్ని కానిచ్చేశారు. ఇందులో ఉన్నతాధికారులు కూడా పాత్ర వహించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చాక పొదలకూరు మండలంలో జరిగిన అక్రమ వ్యవహారాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో అక్కడ విచారణ జరిగింది. వందల ఎకరాల ప్రభుత్వ భూమిని భూస్వాములకు ధారాదత్తం చేసినట్లు తేలింది. ఈ వ్యవహారంలో అప్పటి తహసీల్దార్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు తప్ప తదుపరి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోలేదు. ఒక్క పొదలకూరు మండలంలోనే ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడితే ఇక జిల్లా మొత్తం ఎన్ని వందల, వేల ఎకరాల కొట్టేశారో అర్థం చేసుకోవచ్చు.

● పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం

ఎన్ని గ్రామసభలు నిర్వహించినా.. మరెన్ని సమావేశాల ద్వారా అర్జీలు స్వీకరించినా.. రెవెన్యూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. జిల్లా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నా క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఒకసారి వచ్చిన అర్జీదారుడే మళ్లీ అదే సమస్యతో ఉన్నతాధికారుల వద్దకు వస్తున్నారు. మరోవైపు ఈ అర్జీల పరిష్కారంపై ఆడిట్ నిర్వహిస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలపై దృష్టి పెట్టింది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సదస్సులు నిర్వహించింది. 300కు పైగా గ్రామాల్లో గతేడాది అక్టోబరు 19 నుంచి నవంబరు 14వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరిగాయి. అప్పుడు 8406 అర్జీలు అందాయి. ఆ తర్వాత మరోసారి గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వరకూ 731 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా, 8,132 అర్జీలు అందాయి. వీటిలో సగం వరకూ అర్జీలు పరిష్కారమైనట్లు లెక్కలు చూపిస్తున్నారు. ఇలా రెండు విడతల్లో జరిగిన గ్రామసభల్లో 16 వేలకు పైగా అర్జీలు నమోదైనప్పటికీ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం (గ్రీవెన్స్)లో భూ సమస్యలకు సంబంధించిన అర్జీల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. దీనిని బట్టి క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సమస్య పరిష్కారం కాలేదంటూ రీఓపెన్ అవుతున్న అర్జీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. ఆఖరుకు సీఎం కార్యాలయం నుంచి వస్తున్న అర్జీలు కూడా పరిష్కారం కాక రీఓపెన్ అవుతుండటం గమనార్హం.

● నగరంలో సిసోడియా

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీరాం ప్రసాద్ సిసోడియా గురువారం రాత్రి నెల్లూరుకు విచ్చేశారు. ఈ హోటల్ వద్ద కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు స్వాగతం పలికారు. శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులతో ఆయన సమావేశమవుతారు. రెవెన్యూ శాఖ పనితీరు, సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షించనున్నారు.



సిసోడియాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఆనంద్

వందకు వంద!

- ప్రభుత్వ వైద్య కళాశాలలో నూరుశాతం రిజల్ట్
- ఒకరికి డిస్టింక్షన్, 56 మందికి ప్రథమశ్రేణి
- సంపూర్ణ ఫలితాలు ఇదే మొదటిసారి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ ఫలితాలలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 2020 బ్యాచ్‌కి చెందిన 177 మంది మెడికోలు పరీక్షలు రాయగా ఫలితాలలో ఒకరికి డిస్టింక్షన్ రాగా 56 మందికి ప్రథమ శ్రేణి, 120 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా ఒక్క నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలోనే మెడికోలంతా ఉత్తీర్ణత సాధించారు. 2014లో 100 మంది వైద్య విద్యార్థులతో ఈ కళాశాల ప్రారంభమవగా 2019లో మొదటి బ్యాచ్ వైద్యవిద్యను మెడికోలు పూర్తి చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు ఏడు బ్యాచ్‌లు వైద్య విద్యను పూర్తి చేశాయి. పూర్తి చేసుకున్న 5 బ్యాచ్‌లు ఫైనల్ ఇయర్ ఫలితాలలో కేవలం 75 నుంచి 80 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదయింది. 6వ బ్యాచ్ మెడికోలు (2016-20) 93.9 శాతం మంది పాస్ అయ్యారు. అప్పట్లో 164 మంది రాయగా అందులో 154 మంది మెడికోలు ఉత్తీర్ణత సాధించారు. తాజాగా 177 మంది పరీక్ష రాస్తే అందరూ ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

సమష్టి కృషితోనే..



ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో 100 శాతం ఫలితాలు రావటం ఇదే మొదటి సారి. ఇదంతా అధ్యాపకులు, ఇతర వైద్యాధికారుల కృషే. నేను ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ఉత్తమ ఫలితాలు రావటం ఎంతో ఆనందగా ఉంది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వారు కోరుకున్న చోట హౌస్‌సర్జన్ చేసే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ నాగ రాజమన్నార్, వైద్య విద్య కళాశాల ప్రిన్సిపాల్



బుచ్చిరెడ్డిపాళెం : చెల్లాయపాళెం వద్ద రోడ్డుపై ధాన్యపు రాశులు

ఆదిలోనే వర్రీ!

- దిగుబడి లేదు.. ధర ఊసే లేదు!
- గిట్టుబాటు కాని ప్రభుత్వ రేటు
- ఇదే అవకాశంగా వ్యాపారులు, దళారులు
- లబోదిబోమంటున్న అన్నదాతలు



కొండాపురం: ధాన్యాన్ని తూకం వేస్తున్న కూలీలు

కొండాపురం/బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వరి సాగుచేసిన రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మరింది. ఎన్నడూలేని విధంగా ధాన్యం దిగుబడి సగానికి పడిపోవడంతో దిక్కుతోచని స్థితితో రైతాంగం ఉంది. సాధారణంగా ఎకరా పొలంలో 50 బస్తాలకుపైగా (ఒక్కో బస్తా 75 కిలోలు) దిగుబడి వచ్చేది. అయితే ఈసారి 30 బస్తాలు కూడా రాలేదని వాపోతున్నారు. దీనికితోడు ఆశించిన ధర కూడా లభించడం లేదు. ఈసారి జిల్లాలో సుమారు 3.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పుడు కోతలు మొదలయ్యాయి. ఒక ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేయాలంటే దుక్కి, నాట్లు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, హార్వెస్టింగ్ తదితరాలతో కలిపి రూ.45 వేల వరకు ఖర్చవుతుంది. ఇక కౌలు భూమి అయితే అదనంగా రూ.10 వేల నుంచి 15వేల వరకు అవుతుంది. ఈఏడాది సాగునీటి ఇబ్బందులు లేకపోవడంతో రైతన్నలకు ఇబ్బందులు ఎదురవ్వలేదు. కొండాపురం మండలంలో తక్కువ కాలపరిమితితో కూడిన షుగర్‌లెస్ (ఆర్ఎన్ఆర్), కేఎన్ఎం వరి విత్తనాలను ఎక్కువగా సాగు చేశారు. అక్టోబరులో వరి నారుమడులు సిద్ధం చేసుకొని నవంబరులో నాట్లు పూర్తిచేశారు. గతేడాది ఈ వరి ఎకరానికి 50 బస్తాలపైనే దిగుబడి రాగా, మార్కెట్లో 75 కేజీల బస్తాను రూ.2వేలకు అమ్ముకున్నారు. అయితే, ఈ ఏడాది అందుకు భిన్నంగా ఒక ఎకరాలో 25 నుంచి 35 బస్తాలలోపు ధాన్యం దిగుబడి రావడం, మార్కెట్లో బస్తా రూ.1700 పలుకుతోంది.

● ప్రభుత్వ ధర రూ.1740

కూటమి ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 75 కేజీల బస్తాకు రూ.1740, బీ గ్రేడుకు రూ.1,725ల మద్దతు ధరగా ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలంటే అధికారులు సూచించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. ఇది రైతులకు అదనపు భారంగా మారింది. ప్రభుత్వ మద్దతు ధరకు, వ్యాపారుల ధరకు పెద్దగా వ్యత్యాసం లేదు. దీంతో ఎక్కువ మంది రైతులు వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఇక బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 9వేల ఎకరాలకుపైగా వరి సాగు చేయగా, పది రోజుల క్రితమే వరి కోతలు మొదలయ్యాయి. పుట్టి (850 కిలోలు) ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.19,720. మిల్లర్లు, దళారుల వద్ద రూ.17 వేల నుంచి 17,500 పలుకుతోంది. దీంతో రైతులు కోసిన ధాన్యం రోడ్ల మీద పోసుకుని కాపుకాయలేక దళారులకే అమ్ముకుంటున్నారు. దీంతో పుట్టి ధాన్యానికి రూ.2,720 నుంచి 2,220 మేర నష్టపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు గోదాములు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

పెట్టుబడులు కూడా రావేమో!



నా భూమితోపాటు మరి కొంత భూమిని కౌలుకు తీసుకొని 8 ఎకరాలలో వరి సాగుచేశాను. పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎకరాకు 25 నుంచి 30 బస్తాల ధాన్యం దిగబడి వస్తుంది. పెట్టిన పెట్టుబడులు రావేమో. గతంలో ఎప్పుడూ ఇంత తక్కువ దిగుబడి రాలేదు.

- జీ.మాల్యాద్రి, భీమవరప్పాడు, కొండాపురం

అప్పు చేయాల్సి వస్తోంది



9 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఎకరానికి కౌలుతో కలిపి రూ.45-50 వేల వరకు ఖర్చు అయ్యింది. ఎకరానికి 30 బస్తాల లోపు ధాన్యం దిగుబడి వచ్చింది. ఇది పెట్టుబడులు, కౌలుకు కూడా సరిపోదు. చేసిన శ్రమ అంతా వృథా. పైగా అప్పుచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఇండ్ల నారాయణ, నేకునాంపేట, కొండాపురం

గిట్టుబాటుకాకున్నా ఆరబోసుకోలేక అమ్ముకుంటున్నాం



ఈసారి పంట దిగుబడే అనుకుంటే ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర కూడా లభించలేదు. రోడ్డుమీద ఆరబోసుకుని కాపలా కాయలేక, ఒకవేళ ఆరబోసినా గోడౌన్ల వసతి లేదు. దీంతో వచ్చినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది.

- కదురు బాబు, చెల్లాయపాళెం, బుచ్చి మండలం

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించండి

- సివిల్ సప్లయిస్ అధికారులతో జేసీ కార్తీక్



జాయింట్ కలెక్టర్‌కు క్యాలెండర్‌ను అందజేస్తున్న జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి హరికృష్ణ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో ధాన్యం సేకరణపై సివిల్ సప్లయిస్ అధికారులతో సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవు తాయని చెప్పారు. వాటిలో రైతుల నుంచి ధాన్యం సేకరణ వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ధాన్యానికి సంబంధించి రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చూడాలన్నారు. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలను త్వరగా సమర్పించాలన్నారు. కొరత లేకుండా గోతాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో అంకయ్య, సివిల్ సప్లయిస్ కార్పొరేష న్ మేనేజర్ లక్ష్మీనారాయణ, తూనికల కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన జిల్లా సైనిక సంక్షేమాధికారి

జిల్లా సైనిక సంక్షేమ అధికారి జీ హరికృష్ణ గురువారం జాయింట్ కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సైనిక సంక్షేమ శాఖ క్యాలెండర్‌ను అందజేశారు.



టిడ్కో సముదాయం

టిడ్కోలో వాక్ టు వర్క్!

- పేదల కోసం కూటమి ప్రభుత్వం బృహత్తర ప్రాజెక్టు
- వస్తు తయారీ, అమ్మకాలకు దుకాణాల నిర్మాణం
- రెండు దశల్లో రూ.11.52 కోట్లతో ఏర్పాటు
- వెంకటేశ్వరపురం వద్ద అందుబాటులోకి...

పట్టణ పేదలకు శాశ్వత జీవనోపాధి చూపే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులో వేస్తోంది. వెంకటేశ్వరపురంలోని టిడ్కో సముదాయం వద్ద వస్తు తయారీ, అమ్మకాల కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. రూ.11.52 కోట్లతో నిర్మించే ఈ షాపులను నవంబరులోపు అందుబాటులోకి తీసుకువచ్చే భారీ ప్రణాళికకు పురపాలక శాఖ బుధవారం అధికారికంగా జీవో విడుదల చేసింది రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో నెల్లూరును కూడా చేర్చారు.

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పేద కుటుంబాలలో వివిధ వస్తు తయారీ, అమ్మకాలలో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి వారిలో జీవనోపాధిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వాక్ టు వర్క్' పేరిట టిడ్కో సముదాయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నది. వెంకటేశ్వరపురం వద్ద తొలి విడతలో పూర్తయిన 4,800 ఇళ్ల సముదాయం వద్ద పేదలను గుర్తించి ఈ ప్రాజెక్టులో ప్రత్యక్ష భాగస్వామ్యం చేయనున్నారు. పీఎంఏవై పథకం కింద ఆర్థిక చేయూతనిస్తూ 96 షాపులలో తొలివిడతగా 56 షాపులను జూన్‌లోపు పూర్తి చేసేందుకు రూ.6.72 కోట్లు విడుదల చేయను న్నారు. అటు కార్పొరేషన్, ఇటు నుడాల ద్వారా నిధులను ప్రాథమికంగా అందచేసి 33,600 చ.అ విస్తీర్ణంలో ఈ షాపులను నిర్మించనున్నారు. మలివిడతలో రూ.4.8 కోట్లు కేటాయించి నవంబరులోపు 40 షాపులను నిర్మించను న్నారు. ఆర్థిక వృద్ధిని పెంపొందించడంతోపాటు పేద కుటుంబాలకు జీవనోపాధి, శాశ్వత నిర్మాణాలతో వ్యాపార రంగాలను పటిష్టం చేయాలన్న ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును అమల్లోకి తీసుకు వస్తున్నట్లు పురపాలక శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ముక్కంటి మహోత్సవం

విద్యుద్దీపాలంకరణలో గాలిగోపురం



నేటి నుంచి మూలస్థానేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరాలయంలో శుక్రవారం నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మార్చి 5వతేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు పాలకవర్గం, అధికారులు భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

● ఆలయ చరిత్ర

భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మూలస్థానేశ్వరాలయం 11వ శతాబ్దానికి చెందినది. స్వామివారు ఇక్కడి ఉసిరి చెట్టుకింద పుట్టలో స్వయంభుగా వెలిశారని స్థల పురాణం చెబుతోంది. నాటి ముక్కంటి రాజులకు చెందిన గోవులలో ఒకటి రోజూ ఆ పుట్ట వద్దకు వచ్చి పరమేశ్వ రుడికి పాలధార విడిచేది. ఇంటి దగ్గర ఆ ఆవు పాలు ఇవ్వకపోవడంతో గోవులకాపరి దానిపై నిఘా ఉంచాడు. గోమాత ఉసిరి చెట్టు కింద ఉన్న పుట్టలో పాలధారను విడవడం చూసి ఆగ్రహంతో ఆ పుట్టను కత్తితో నరికాడు. దీంతో శివలింగానికి గాయమై రక్తం కారింది. ఈ విషయాన్ని గోపాలకుడు ముక్కంటి రాజుకు తెలిపాడు. ఆ రోజు రాత్రి పరమశివుడు ముక్కంటిరాజు కలలో కనిపించి తనకు ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించమని ఆదేశిస్తాడు. అంతట రాజు ఆలయాన్ని నిర్మించారు.

● బ్రహ్మోత్సవాలు ఇలా...

శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం సాయంత్రం అంకురార్పణ, శనివారం ఉదయం ధ్వజారోహణ, రాత్రి సింహ వాహన సేవ, 23వతేదీ ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి పురుషామృగ వాహనసేవ, 24 రాత్రి శేషవాహన సేవ, 25 వెండి రావణసేవ జరుగుతాయి. 26వతేదీ శివరాత్రి పర్వదినాన ఉదయం గిన్నెభిక్ష అలంకరణ, రాత్రి లింగోద్భవకాల అభిషేకం, అనంతరం వెండి నంది వాహనసేవ, 27వతేదీ రాత్రి కల్యాణం, 28వతేదీ ఉదయం రథోత్సవం, మార్చి 1న యాళి వాహన సేవ, 2న అలకల తోపు, 3న ధ్వజావరోహణ, 4న దవనోత్సవం, 5వతేదీ ఏకాంతసేవ జరుగుతాయి.



ఆసుపత్రితో ఆటలు !

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై విమర్శల వెల్లువ
- రెండు నెలలు సెలవు పెట్టి ఆలస్యంగా అనుమతులు
- ఎఫ్ఏసీ ఇవ్వక పోవటంతో నిర్వహణ ఇబ్బందులు


సిద్ధా నాయక్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్వహణ అగమ్యగోచరంగా మారుతోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ సెలవుల విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆయన ఈ నెల 15వ తేదీ నుంచి రెండు నెలల పాటు సెలవుపై వెళ్లారు. ఇందుకు డీఎంఈ అనుమతి తీసుకోవాల్సి ఉండగా లీవు లెటరు డీఎంఈకి పంపకుండా ఆసుపత్రిలోనే ఉంచారు. ఈ విషయాన్ని జీజీహెచ్ అభివృద్ధి కమిటీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమైంది. ఆ సమాచారం అందుకున్న సూపరింటెండెంట్ వెంటనే డీఎంఈకి లీవ్ లెటర్ పంపించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ నెల 18న లీవ్ లెటర్‌ను డీఎంఈకి పంపించారు.

మొదటి నుంచీ అంతే..

సిద్ధా నాయక్ 2022 ఆగస్టు 4న సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆది నుంచి వివాదాస్పదుడిగా విమర్శలున్నాయి. ఎప్పుడు సెలవు పెట్టినా డీఎంఈ అనుమతి తీసుకోరని, సెలవులోనూ విధుల్లో ఉన్నట్లు చూపించారన్న అభియోగాలున్నాయి. మాసానికి రూ.3.50 లక్షలు వేతనం తీసుకుంటున్న సూపరింటెండెంట్ ఆసుపత్రి నిర్వాహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి తగ్గట్లే గతంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాల్లో సూపరింటెండెంట్ వ్యవహార శైలిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. పదేపదే హెచ్చరిస్తున్నా తీరు మారదా అని ప్రశ్నించి సెలవుపై వెళ్లాలని కూడా సూచించారు.

ఎఫ్ఏసీ లేక ఇబ్బందులు

సూపరింటెండెంట్ 14 రోజులకుపైగా సెలవు పెట్టినప్పుడు వేరే వైద్యునికి ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జి) ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు డీఎంఈకి సిఫార్సు చేయాలి. అయితే సిద్ధా నాయక్ రెండు నెలలు సెలవు పెట్టినా ఎఫ్ఏసీ మాత్రం ఎవరికీ ఇవ్వకుండా వెళ్లారని తెలిసింది. దీంతో ఆసుపత్రి నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద రోగులకు బస్ చార్జీలు ఇవ్వడానికి కూడా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రికి వచ్చే వారిలో నిరుపేదలే జాస్తి కావడంతో ఉద్యోగులు వారి సొంత డబ్బులు చెల్లిస్తున్నారని తెలిసింది. కాగా, ఎఫ్ఏసీ అమలుకు సీనియర్ వైద్యుల వివరాలు పంపించాలని డీఎంఈ డాక్టర్ నరసింహం నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రిన్సిపాల్ కొందరు వైద్యుల పేర్లు పంపించినట్లు సమాచారం.

ఎఫ్ఏసీ ఇవ్వకపోవటం వల్లే ఆర్థిక ఇబ్బందులు



జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ రెండు నెలలకుపైగా సెలవు పెట్టి వెళ్లారు. అయితే ఎఫ్ఏసీ ఇవ్వకపోవటం వల్ల ఆసుపత్రి నిర్వహణ కష్టంగా మారుతోంది. వేసవి కాలం సమీపిస్తున్నందున తాగునీటి వ్యవస్థను మెరుగుపరచేందుకు నిధులు అవసరం. కనీసం రూ. 10 వేలు ఖర్చు పెట్టుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది.

- డాక్టర్ నరేంద్ర, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

బీఎస్ఎన్ఎల్ ఆదాయం రూ.50కోట్లకు పెంచాలి



టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి, బీఎస్ఎన్ఎల్ అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బీఎస్ఎన్ఎల్ రూ.33 కోట్ల ఆదాయంలో ఉంది. దీనిని రూ.50 కోట్ల ఆదాయం పెంచేందుకు టెలికం అడ్వయిజరీ కమిటీ, అధికారులు సంయుక్తంగా కృషి చేయనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం బీఎస్ఎన్ఎల్ జీఎం కార్యాలయంలో టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను ఎంపీ వేమిరెడ్డి విలేకరులకు వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇకపై ప్రతి ఆరు నెలలకోసారి కమిటీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ ప్రతి గ్రామానికి భూగర్భ ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ అందించాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. 4జీతోపాటు 5జీ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ జీఎం సి.అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు రమణయ్య, మాల్యాద్రి, బొప్పరు ప్రసాద్, కె.బ్రహ్మానందం, గోపాల్, అనూష, వి.సురేంద్రరెడ్డి, డీజీఎం ఎం.శ్రీనివాసరావు, ఐఎఫ్ఏ ఎం.శ్రీనివాసరావు, ఏజీఎం పి.శ్రీనివాసరావు, పి.అపర్ణ, సేల్స్ అండ్ మార్కెటింగ్ ఏజీఎం వి.రామ్మోహన్ పాల్గొన్నారు.

23న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్

- ఏడు కేంద్రాల్లో పరీక్ష : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఈనెల 23న జరుగుతుందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఆ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని వీఆర్ పీజీ స్టడీస్, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వెంకటాచలం సమీపంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాల, కలివెలపాలెం, ధనలక్ష్మీపురంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్, నెల్లూరు రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆ ఏడు కేంద్రాలకు ఏడుగురు లైజనింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. మొత్తం 4,102 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్షలకు సంబంధించి సాంకేతికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరీక్షల కో ఆర్డినేటింగ్ అధికారి, కందుకూరు సబ్ కలెక్టర్ టీ శ్రీపూజ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణవేణి కూడా పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

- జడ్పీ సీఈవో విద్యారమ ● ఎమ్పీడీవో కార్యాలయం ఆకస్మిక తనిఖీ


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో

కావలి రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పరిషత్ సీఈవో ఎం.విద్యారమ ఆదేశించారు. గురువారం ఆమె స్థానిక ఎమ్పీడీవో కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ, మండల పరిషత్ నిధులతో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న ఎంపీడీవోను చర్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిని దృష్టి లో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ క్రిష్ణతేజ ఆదేశాల మేరకు అన్నిమండలాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. అలాగే కావలి, నెల్లూరు, ఆత్మకూరు, కందుకూరు డివిజన్లలో డీఎల్‌పీవో కార్యాలయాల నిర్మాణానికి స్థల సేకరణ జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి ఆధార్‌లు లేని చిన్నారుల సర్వే, సిటిజన్ హౌస్ జియో ట్యాగింగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ సర్వేపై సూచనలిచ్చారు. కార్యక్రమం లో ఎమ్పీడీవో శ్రీదేవి, ఏవో సంధ్యారాణి, ఎంఈవో గోవిందయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఏఈ లు సతీష్, సుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ సమద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలుగు.. వెలుగు కోసం!

- వెంకటాచలంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటు
- భాషపై విస్తృత పరిశోధనలు, ప్రాజెక్టులు
- కవులు, రచయితలకు సత్కారాలు
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రతి మనిషి తన జీవితంలో తొలిసారిగా నేర్చుకునేది మాతృభాష. ఇది మనిషికి ఎంతో విలువైనది. అమ్మ పలుకులోని ఆప్యాయత, అనురాగం మరెక్కడా దొరకదు. తల్లి ఒడే బిడ్డకు తొలిబడి. అమ్మ మాటే మాతృభాష. ప్రతి మనిషి అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషనూ కాపాడుకోవాలి. అయితే, ఆధునిక పోకడతో మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ పరభాషా వ్యామోహంతో పరుగులు తీస్తున్నారు. జీవితంలో ఎదగాలంటే ఇతర భాషలను నేర్చుకోవడం అవసరమే. కానీ వాటి ప్రభావం అమ్మభాషపై పడకుండా చూసుకోవాలి. మన మాతృభాషను మనమే రక్షించుకోవాలి. తెలుగు భాష విస్తృతి, పరిశోధనల కోసం కేంద్ర ప్రభుత్వం వెంకటాచలంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దాదాపు ఆరేళ్లుగా ఈ కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలపై ప్రత్యేక కథనం...

- వెంకటాచలం (ఆంధ్రజ్యోతి)


ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

తెలుగు భాషాభిమానులు చేపట్టిన ఉద్యమ ఫలితంగా 2008లో తెలుగు భాషను ప్రాచీన విశిష్ట భాషగా గుర్తిస్తున్నట్లు అప్పటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. ఆ తర్వాత 2009లో తెలుగు భాషకు ప్రాచీన హోదా ఇస్తూ ఆమోదం తెలిపింది. 2011లో తెలుగు భాష విశిష్ట అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాలని విద్యాత్మక, ఆర్థిక అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో కర్ణాటకలోని మైసూరులో ఉన్న భారతీయ భాషా సంస్థలో తెలుగు భాష కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చొరవ కారణంగా 2019, నవంబరులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని నెల్లూరుకు తీసుకొచ్చారు.

● తెలుగు భాషా అభివృద్ధికి కృషి

వెంకటాచలం మండలం సరస్వతీ నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ కేంద్రంలో సంచాలకులతోపాటు 12 మంది విద్యాత్మక సిబ్బంది ఉండగా, తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యాలపై వీరంతా అధ్యయనాలు చేస్తున్నారు. ఈ కేంద్రం ప్రారంభమైన నాటినుంచి ప్రాచీన తెలుగు భాషకు సంబంధించి అనేక ఆధారాలు సేకరించి, పరిశోధనలు చేశారు. పూర్తయిన ప్రాజెక్టులను ముద్రణ రూపంలోకి తేవడానికి సంస్థ సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ కృషి చేస్తున్నారు. వివిధ ప్రాంతాలతోపాటు కళాశాలల్లోనూ సదస్సులు నిర్వహించి తెలుగు సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

● పండితులకు పురస్కారాలు

ప్రాచీన తెలుగు భాషకు తమ రచనల ద్వారా విశేష కృషి చేసిన భాషా పండితులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రూ.లక్ష నగదు ఇచ్చి సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. అలాగే వారిని సన్మానించి, గౌరవ పురస్కారాలు అందజేస్తున్నారు. అలాగే, రచయితలు, కవులకు కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రపతి పురస్కారాలను అందజేయ నుంది.

● గ్రంథాల డిజిటలీకరణ

తెలుగు భాషను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేస్తూ భాషను డిజిటలీకరణ చేశారు. తెలుగు కావ్యాలను ఆంగ్లం, ఇతర భారతీయ భాషల్లోకి అనువాదం చేస్తున్నారు. ఇటీవలే క్రీడాభిరామం తమిళంలోకి, కవిజనాశ్రయం, సంకీర్తన లక్షణం కన్నడంలోకి అనువాదం చేశారు.

● 23 పరిశోధనలు పూర్తి

ఈ కేంద్రంలో ఇప్పటివరకు 23 అంతర్గత, బాహ్య పరిశోధనలు పూర్తయ్యాయి. బాహ్య ప్రాజెక్టులలో ఒకటి తెలుగువారి శాసనాలు ప్రచురించ బడ్డాయి. మిగిలిన బాహ్య ప్రాజెక్టులు త్వరలో ప్రచురించ బడతాయి. 12 అంతర్గత, 5 బాహ్య ప్రాజెక్టులు ప్రస్తుతం జరుగు తున్నాయి.

● గ్రంథాలయ స్థాపన

తెలుగు అధ్యయన కేంద్రంలోనే 2020-21లో గ్రంథాలయాన్ని స్థాపించారు. దాదాపు రూ.4.75 లక్షలు విలువ చేసే 2500 పుస్తకాలను కొనుగోలు చేశారు. అలాగే దాతల నుంచి సుమారు ఐదువేల పుస్తకాలను సేకరించారు. విలువైన ప్రాచీన పుస్తకాలను తెలుగు పండితులు విరాళంగా ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. త్వరలో ఈ గ్రంథాలయం తెలుగులో సివిల్ పరీక్షలు, వివిధ పోటీ పరీక్షలు రాసేవారికి ప్రధాన సమాచార కేంద్రంగా మారబోతోంది.

అభివృద్ధికి నోచుకోక..

దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం పరిస్థితి. ఈ కేంద్రం నెల్లూరులో ఏర్పాటు చేసి ఆరేళ్లవుతున్నా ఇప్పటికీ తాత్కాలిక భవనంలోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. 2023లో రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించగా 2024లో కేంద్ర ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం, ఆర్చి, గార్డ్ రూమ్ నిర్మాణాలు జరుగుతున్నాయి. కానీ సొంత భవనానికి నోచుకోలేదు. అలాగే ఈ కేంద్రం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థపైన ఆధారపడాల్సి వస్తోంది. దీనికి కారణం స్వయం ప్రతిపత్తి లేకపోవడమే. పక్క రాష్ట్రమైన తమిళ నాడులో తమిళ భాష కేంద్రానికి స్వ యం ప్రతిపత్తి ఉండటం గమ నార్హం. ఈ కేంద్రానికి కూడా స్వ యం ప్రతిపత్తి హోదా కల్పించాలని భాషాభిమానులు, పండితులు కోరుతున్నారు.

● పరిశోధన పత్రిక ప్రారంభం

తెలుగుసిరి పేరుతో పరిశోధన పత్రికను ప్రారంభించారు. గత ఏడాది జులై 13న తెలుగుసిరి మొదటి సంపుటిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ పత్రికలో పరిశోధకులు, పండితులు రాసిన వ్యాసాలు, సదస్సుల్లో సమర్పించిన వ్యాసాలను ప్రచురిస్తున్నారు.

త్వరలో డిప్లమా కోర్సు



తెలుగు భాషను నేర్చుకునేవాళ్లకు త్వరలో ప్రాచీన సాహిత్యంలో డిప్లొమా కోర్సు ప్రారంభించ బోతున్నాం. భవిష్యత్తులో తెలుగు చరిత్ర, భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయం ఇలా తెలుగువారికి సంబంధించిన అనేక విషయాలను ఈ కేంద్రం కేంద్రబింధువుగా మారబోతుంది. త్వరలో ఐదు ఎకరాల సువిశాల స్థలంలో శాశ్వత భవనాన్ని నిర్మించనున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేయడంతో ప్రహరీ గోడ నిర్మించాము. మిగిలిన ఆర్చి, గార్డ్ రూమ్ నిర్మాణాలు పూర్తికావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కేంద్రం మరింత అభివృద్ధి చెందనుంది.

- మాడభూషి సంపత్‌కుమార్, సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

మాతృభాషను మరవద్దు



మనం తెలుగు వార మైనందున మాతృభాష అయిన తెలుగును ఎన్నటికీ మరువరాదు. ప్రపంచ భాషల్లో తెలుగు భాషకు ప్రత్యేక స్థానముంది. ఆ స్థానాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగుజాతిపై ఉందని ప్రతిఒక్కరూ గుర్తించి తెలుగుభాష వ్యాప్తికి పాటుపడాలి.

- రామాయణం దుర్గాప్రసాద్, ఉదయగిరి

మృతభాష కాకుండా చూడాలి



మాతృభాషలో విద్యా బోధన జరగాలి. మాతృభాషలో విద్యను అభ్యసించిన వారికి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఎక్కడైతే అన్నీ రంగాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు మాతృభాషలో జరుగుతాయో ఆ ప్రాంతం అభివృద్ధి పథంలో ఉంటుంది. ప్రభుత్వం మాతృభాష అమలులో కఠినంగా వ్యవహరించాలి. అప్పుడే మాతృభాషలు మృత భాషలు కావు.

- డాక్టర్ పెరుగు రామకృష్ణ, అంతర్జాతీయ కవి, నెల్లూరు.

ప్రాధాన్యతతోనే మాతృభాషకు ప్రాచుర్యం



రాష్ట్రప్రభుత్వాలు మాతృభాషకు తగిన ప్రాధాన్యత కల్పించినప్పుడే భాషకు ప్రాచుర్యం లభిస్తుంది. గిడుగురామ్మూర్తి లాంటి ఎందరో మహానుభావులు తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసారు. ఆయన జయంతి రోజును మాతృభాషా దినోత్సవం జరుపుకోవడం సాంప్రదాయంగా మారిందే తప్ప భాషాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ప్రభుత్వాలు పూనుకుంటేనే మాతృ భాషాభివృద్ధి సాధ్యం. తమిళనాడులో అక్కడి ప్రభుత్వాల చొరవతోనే వారి భాష ప్రాచుర్యం పొందింది.

- ఎం జమున, కవయిత్రి, కావలి

భవిష్యత్‌తరాలకు అమృతం



'మాతృభాష, సంస్కృతి భవిష్యత్ తరాలకు అమృతం... నేడున్న మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుల్ సంస్కృతికి చరమ గీతం పాడి, అమ్మానాన్న, అక్కా చెల్లి, అత్తాపిన్ని పదాలను తల్లి ఒడి నుంచే నేర్పించాలి. తెలుగు రాయడం, చదవడం, మాట్లాడడం వల్ల అమ్మభాషకు ఆదరణ పెరుగుతుంది.

- గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయుడు, సాహితీవేత్త, బుచ్చిరెడ్డిపాళెం

మాతృభాషలోనే అన్నీ వ్యవహారాలు ఉండాలి



ప్రస్తుతం తెలుగు మాతృభాష అమలు, నిర్వహణ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆశాజనకంగా లేదు. విదేశాలు తమ మాతృభాషకు ప్రాధాన్యమిస్తూ ఇతర భాషలను ప్రోత్సహిస్తున్నాయి. ఆ విధానం మన రాష్ట్రంలోనూ అమలు కావాలి. పాఠశాల విద్య నుంచి పరిపాలన, న్యాయ తీర్పులకు మాతృభాషనే ఉపయోగించాలి. గత ప్రభుత్వం పాలనలో మాతృభాష అమలును పట్టించుకోలేదు. తెలుగు భాషను అన్నీ రంగాల్లో అమలు చేసేందుకు తెలుగు భాషోద్యమ సమితిని 2004లో ప్రారంభిం చాము. అప్పటి అధికారులు ఎంతో సహకారం అందించి తెలుగు భాషోద్యమ సమితి నాయకులకు గుర్తింపు కార్డులు కూడా ఇచ్చారు. కలెక్టర్ రవిచంద్ర టేబుల్‌పైకి ఆంగ్ల భాషలో వచ్చిన ఫైళ్లను సంబంధిత శాఖకు తిప్పి పంపించేశారు. మాతృభాష అమలుపై కలెక్టర్ అధ్యక్షతన ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహిం చేవారు. గత 15 ఏళ్లుగా ఇలాంటి సమావేశాలు జరగడంలేదు. మాతృ భాష పరిరక్షణకు అందరూ కృషి చేయాలి.

- చలంచర్ల భాస్కర్‌రెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం కీలకం

- ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఈడీసీ) చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా యూనిట్లు నెలకొల్పే యువ పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి సహకరించాలని ఆయన బ్యాంకర్లను కోరారు. గురువారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎంఎస్ఎంఈడీసీ కార్యాలయంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో శివశంకర్ మాట్లాడారు. చదువుకున్న యువతీ యువకులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలని పిలుపునిచ్చారు.

ఎస్జీటీలను 'టెన్త్' విధుల నుంచి మినహాయించాలి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ డ్యూటీల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లను మినహాయించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతి రావు, కాకి ప్రకాష్‌రావు పాఠశాల విద్యాశాఖ అధికారులను కోరారు. రాష్ట్రంలోని ఎక్కువ ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు మాత్రమే టీచర్లు పనిచేస్తున్నారని, వారికి పరీక్షల డ్యూటీలు వేస్తే బోధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.

అసైన్డ్‌ల్యాండా.. ఆక్రమిద్దాం

- ఆర్‌ఆర్.పాలెం సమీపంలో 150ఎకరాల ఆక్రమణ
- ఆక్రమణదారులంతా మొగిలిచెర్ల, నారసింహాపురం భూస్వాములే..
- ఒక్కొక్కరు 10 నుంచి 30ఎకరాల్లో పొగాకు, జామాయిల్ సాగు


ఆర్‌ఆర్.పాలెం కండేవారి బీడు పొలాల్లో సాగు చేసిన జామాయిల్

లింగసముద్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఆర్.పాలెం పంచాయతీ పరిధిలోని కండే వారి ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ భూములు అటవీ ప్రాంతానికి సమీపంగా ఉండటంతో అడవిలో భూమిని అడిగేదెవరన్నట్టుగా ఉంది వీరి బాగోతం. అందులో యథేచ్ఛగా పంటలు సాగు చేస్తున్నారు. ఆక్రమణదారుల చెర నుండి విడిపించాలని గ్రామస్థులు గత పదే ళ్లగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.

● 150ఎకరాల భూముల ఆక్రమణ

గ్రామ సర్వే నంబర్లు 1,3లోని ఈ భూములను అధికారులు విభజించి 275 సర్వే నంబరు కింద 450 ఎకరాలను చేర్చారు. అయితే 1976లో అప్పటి రెవెన్యూ అధికారులు సొసైటీ కింద సుమారు 300ఎకరాలను పలువురికి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చారని కొందరు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ పట్టాలకు సంబంధించిన రికార్డులు లింగసముద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో లేవని అధికారులు చెబుతున్నారు. అయితే మిగిలిన 150ఎకరాల్లో గడిచిన కొన్నేళ్ల నుంచి ఆక్రమణలు జోరందుకున్నాయి. ఈ భూములను మొగిలిచెర్ల, నారసింహాపురంకు చెందిన భూస్వాములు ఒక్కొక్కరు 10 నుండి 30ఎకరాల వరకు ఆక్రమించి పొగాకు, జామాయిల్ సాగు చేస్తున్నట్లు ఆర్‌ఆర్.పా లెం గ్రామస్థులు చెబుతున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భూములను ఆక్రమించిన వారికి అధికారులు డీకేటీ పట్టాలు ఇవ్వాలని జాబితాలు కూడా తయారు చేశారు. కానీ అసైన్‌మెంటు కమిటీ సమావేశం జరగలేదు. దీంతో వీరి ఆశలు నెరవేర లేదు. అయితే ఈ భూములను ఆక్రమించి నకిలీ పట్టాలు, పాస్ పుస్తకాలు సంపాదించిన కొందరికి ఫ్రీహోల్డ్ జరిగినట్టుగా ఆరోపణలు విని పిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అద్దె ఇళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలు

● నెలల తరబడి బాడుగ కోసం నిరీక్షణ ● కష్టంగా కేంద్రాల నిర్వహణ
● పూర్తకాని మంజూరైన భవనాలు ● జూన్ నాటికి సర్దుబాటు: సీడీపీవో

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సొంతభవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండలంలో 77అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 72ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు. అలగాయపాలెం,చిల్లకుంట, చినిగేవారిపాలెం, కుమ్మరి పాలెం, జీవీఆర్ ఎస్టీ కాలనీల్లో ఐదు మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 36అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలుండగా, 28కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. మరో 13 కేంద్రాలకు అద్దె చెల్లింపులు లేకుండా స్థానిక పాఠశాలలు, దాతల సహకారంతో నడుపుతున్నారు. ప్రభుత్వం బడ్జెట్ ప్రకారం మూడు నెలలకు ఓసారి అద్దె చెల్లిస్తారు. అప్పటివరకు అంగన్‌వాడీ కార్యకర్తలే సొంతనిధులతో అద్దె చెల్లిస్తారు. వసతులను బట్టి ఒక్కో సెంటర్‌కు రూ.2వేల వరకు రెంట్ చెల్లించే వెసులుబాటు ఉంది. ఏ క్షణమైనా ఖాళీ చేయమని ఇంటి యజమాని ఆదేశిస్తే, మరో అద్దె ఇంటి కోసం కార్య కర్త, ఆయా గాలింపు చేపట్టాల్సిందే. ఎవరికి అద్దె భవనాన్ని చూసుకొని కేంద్రాన్ని నడపాలి. మండలం కేంద్రంలో అదేకు ఇళ్లు దొరకని పరిస్థితి. ఒకవేళ ఇల్లు రెంట్‌కు ఇచ్చి నా అద్దె రూ.2000 పైనే ఉండటంతో కార్యకర్తలకు చేతిచమురు వదులుతోంది.

● ముందుకు సాగని నిర్మాణాలు


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద మండలంలో రూ.15లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాలు మంజూరు అయ్యాయి. బద్ధిపూడి, ఉలవపాడు గ్రామాల్లోని ఈ అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు లెంటల్ వరకు చేపట్టారు. అప్పటినుంచి నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదని స్థానికులు వాపోతున్నారు.

● జూన్ నాటికి సర్దుబాబు

జూన్‌నాటికి సొంత భవనాల్లేని కేంద్రాలను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో కలుపుతారని ఉలవ పాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అరుణ తెలిపారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు 120రోజులపాటు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు జరగనున్నాయని, ప్రీ స్కూల్ నిర్వ హణపై అవగాహన కల్పిస్తున్నామని ఆమె వివరించారు.


ఉలవపాడు ఎస్సీ కాలనీలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

న్యూస్ బాక్స్

సర్వేకు సహకరించాలి

కావలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘం లోని వార్డు కార్యదర్శులు ఇంటింటి పీఎస్-4 సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేలో పాల్గొనక పోయినా, అధికారులకు సహకరించి అడిగిన సమాచారం ఇవ్వకపోయినా సంక్షేమపథకాలకు అనర్హులయ్యే ప్రమాదం ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలు కలిగిన పౌష్టికాహారంతోనే ఆరోగ్యం అని ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ట తెలిపారు. మండలకేంద్రంలోని హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. ప్రీ స్కూల్ పిల్లలకు ఆటపాటలతో విద్య నందించాలని తెలిపారు. ఎంఈఓలు రవికుమార్, మల్లికార్జునరావు, సూపర్‌వైజర్ సునీత, డిఆర్‌పిలు జనార్దన్, సుకన్య పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రజాసంఘాల నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమార్, చెన్నకేశవులు, మాధవ రావు, నాగార్జున వీరభద్రయ్య పాల్గొన్నారు.

వ్యాధుల సర్వే పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వీరారెడ్డిపల్లి ఎస్సీ కాలనీ, ఉదయగిరి పట్టణం కంసాలి వీధుల్లో జరుగుతున్న వ్యాధుల సర్వేను గురువారం గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మహిళల్లో వచ్చే వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు పథకాలపై ప్రచారం

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు అమలు చేస్తున్న పలు సేవింగ్ పథకాలపై స్థానిక బ్యాంకు మేనేజర్ శివ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చేపల గుంటల ఏర్పాటుపై ఫిర్యాదు

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తరుణవాయి పొలాల్లో కొందరు అనధికారికంగా చేపలు గుంటలు ఏర్పాటు చేయడంపై సమీప పొలాల రైతుల అభ్యంతరం వ్యక్తం చేస్తూ గురువారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. చేపల గుంటల వల్ల వరి సాగుచేసే పొలాల్లో ఊట నీరు బయటకు వెళ్లకుండా ముంపునకు గురవుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశీలించి అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న చేపల గుంటలను తొలగించాలని కోరారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 20: మండలంలోని గుడినరవ రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండల వ్యవసాయ అధికారి అంజనేయుల నాయక్, కొట్టాలపల్లి సొసైటీ సీఈవో పోలయ్య పరిశీలించారు. ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్-ఏ రకం క్వింటా రూ.2,320, సాధారణ రకం క్వింటా రూ.2,300 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

రూ.65 వేలకు పోలేరమ్మ చీరల వేలం

అల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వహించిన అమ్మవారి చీరల వేలంలో ఆలయానికి రూ.65,850ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో చిట్టిబాబు తెలిపారు. ఛైర్మన్ మేడా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల భక్తులు సమర్పించిన చీరలను ఈ విధంగా భక్తులకు చెందజేయాలనే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

కాలువపైకి వచ్చారని ఇనుపమెట్ల తొలగింపు


ఇనుప మెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కావలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఉదయగిరి ఆర్వోబీ వంతెనకు ఎదురుగా తుమ్మలపెంట రోడ్డు ప్రవేశమార్గంలోని ఇంటి మిద్దెకు వేసిన ఇనుప మెట్లను గురువారం మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. గతంలో నిర్మాణాలు జరుగుతున్నపుడు మెట్లను రోడ్డుపైకి రాకుండా చూసుకోవాలని చెప్పామని అధి కారులు తెలిపారు. అయితే ఆ నిర్మాణం జరిగి చాలా రోజులకు ఇప్పు డు తొలగించటం వెనుక ఆంతర్యమేమిటనేది చర్చ నీయాంశమైంది.

మరమ్మతులు చేపట్టిన గదుల ప్రారంభం

బిట్రగుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):విశ్వనాథరావుపేట జడ్పీ హెచ్ఎస్ బాలుర పాఠశాలలోని శిథిలావస్థకు చేరిన ఐదు తరగతి గదులను అమరాబచ్చు ట్రస్ట్ నిధులతో మరమ్మతులు చేయించారు. గురువారం ఈ గదులను ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ ఠాగూర్, గంగాధర్‌రావు, మేనేజింగ్ ట్రస్ట్ బచ్చుకృష్ణకుమార్, సంధ్యా దంపతులు పరిశీలించి ప్రారంభించారు. దివంగత బచ్చుఅమరక్క ఆశయ సాధనే ధ్యేయంగా ట్రస్ట్ ద్వారా సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు జి.మంజుల, ఎంఈవోలు నరసింహారావు, జయమ్మ, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, ప్రసన్నుడి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి, విశ్రాంత ఇంజినీరు గోపీకృష్ణ, సాయిసేవకులు ఉన్నారు.

జ్ఞానసంపద అందించేది గురువులే..

కావలి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులకు అపార జ్ఞాన సంపద అందించేది గురువులే అని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ తెలిపారు. గురువారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను అళహరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శానం కృష్ణ, అధ్యక్షుడు నాగసుధాకర్, తిరుమలశెట్టి లక్ష్మీ, రామారావు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అళహరి సుధాకర్, టీచర్లు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. గురువారం స్థానిక డీఆర్‌డీఏ (వెలుగు) కార్యాలయంలో ఎంపీపీ కె పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 2024-25 ఏడాది పంచాయతీరాజ్ శాఖకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 12పనులకు రూ.50.6లక్షలు, జడ్పీ నిధుల నుంచి 8పనులకు 29 లక్షలు మంజూరు చేశామన్నారు. వీటిలో కొన్ని పనులు పూర్తిచేయగా మరికొన్ని పనులు చేయలేదన్నారు. మార్చి నెలాఖరులోపు పూర్తిచేయకపోతే నిధులు మురిగిపోయే అవకాశం ఉందని, చేపట్టని పనులను రద్దు చేసి కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పీఆర్ ఏఈ రామయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మొదటివిడతగా రూ. 1.54 కోట్లతో సిమెంట్ రోడ్లు పూర్తిచేసినట్లు, రెండవ విడత మరో రెండు కోట్లు మంజూరవగా అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ కనెక్షన్లపై వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ రవితేజ తాగునీటి పథకాల గురించి వివరించారు. వెలుగు, ఉపాధి, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, రెవెన్యూ, ఐసీడీయస్, విద్యాశాఖ అధికారులు శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాలెట్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. గురువారం ఆమె స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విజయదీపిక పుస్తకాలు అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీపీ పద్మావతమ్మ, జడ్పీటీసీ లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దశదినకర్మలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కరేడు టీడీపీ సీనియర్ నాయకులు నల్లపురెడ్డి శ్యామ్‌గోపాల్ రెడ్డి మాతృమూర్తి ప్రభావతమ్మ దశదిన కర్మ గురువారం జరిగింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రభావతమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేమిరెడ్డి దంపతులను కలిసి మర్యాదపూర్వకంగా పలకరించారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు

జాతీయ వెటరన్ క్రీడాకారుడు భాస్కరరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ వెటరన్ క్రీడాకారుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు గూడల భాస్కరరావు చిత్రపటానికి గురువారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అపస్ జిల్లా నాయకులు గూడల ప్రతాప్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వెటరన్ క్రీడాకారులు, రాజకీయ ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

అధిక చార్జీలు వసూలుచేస్తే చర్యలు

● మోటారు వాహన తనిఖీ అధికారులు కరుణాకరన్, లక్ష్మీబాయి

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నుంచి ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కావలి అసిస్టెంట్ మోటార్ వాహన తనిఖీ అధికారులు కె.కరుణాకరన్, బీ.లక్ష్మీబాయి హెచ్చరించారు. ఆటో వాలాలు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో గురువారం వారు ఉదయగిరి పట్టణంలో 167-బీజీ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్న ఆటోలు, లైసెన్సు, సరైన పత్రాలు, టాక్సీ చెల్లించని ఇతర వాహనాలకు జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న మోటారు వాహన తనిఖీ అధికారులు

దివ్యాంగులకు అన్నదానం


దివ్యాంగ చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ మహిళాకార్యకర్తలు

కందుకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మహిళావిభాగం ఆధ్వర్యంలో కేకు కట్‌చేశారు. అనంతరం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డుమెంబరు గుర్రం మాల్యాద్రి, వడ్లమూడి సురేష్‌ల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. మహిళా కమిటీ సభ్యులు కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలో కేకు కట్ చేసి దివ్యాంగ చిన్నారులకు మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేశారు. అలాగే 24వ వార్డుకు చెందిన మదిర బ్రహ్మరూప్, మణికంఠ, బ్రహ్మతేజ, మనోహర్, కాలేషాలు పట్టణంలోని యాచకులు, అభాగ్యులకు ఆహారప్యాకెట్లు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, ముచ్చు శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, ద్రాక్షాయణి, అశ్విని, ఎస్తేరమ్మ, మయూరి, రత్తమ్మ, శిరీష, శ్రీలత, పార్వతి పాల్గొన్నారు.

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం

కందుకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సంపత్ కుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొని చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది పోకూరి కోటయ్య, లోక్ అదాలత్ సి బ్బంది కోటేశ్వరమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విప్రోకు 24మంది ఎంపిక

కందుకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో విప్రో కంపెనీ రెండురోజులగా నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఫైనలియర్ విద్యార్థులు 24మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కంచర్ల రామయ్య గురువారం ప్రకటనలో తెలిపారు.

గుర్తింపు సంఖ్య కార్డు ఉండాలి

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న పీఎం కిసాన్ పరిహారం రైతుల ఖాతాలకు జమ అవ్వాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డు తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి తిరుమల జ్యోతి తెలిపారు. గురవారం ఆమె రైతుసేవా కేంద్రాల్లో చేపడుతున్న గుర్తింపు నమోదు ప్రక్రియను పరిశీలించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య ఎంటీకే భవన్‌లో జరగనున్న సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రెండు పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు ఆర్.మోహన్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలి సంఘం జిల్లా కోశాధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తరుణవాయి రైతు సేవా కేంద్రంలో గురువారం సంగం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. పీఏసీఎస్ కార్యదర్శి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర క ల్పి ంచేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశామ ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్తబుట్టల పంపిణీ

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీలో గురువారం సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ కరీముల్లాలు ప్రతి ఇంటికీ చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీవో వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 42 యూనిట్లకు 260మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో హాజరైన 138మంది ధృవీకరణ పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి, గండిపాళెం, నర్రవాడ, చాకలికొండ గ్రామాల బ్యాంకు మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేష్, శోభన్‌బాబు, నాగలక్ష్మి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం: కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మౌఖిక పరీక్షలు ముగిశాయి. ఎంపీడీవో ఆదినారాయణ మాట్లాడారు. 45యూనిట్లకు 216 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో కొందరు ఇంటర్వ్యూలకు హాజరుకాలేదన్నారు. కార్యక్రమంలో ఏఓ శేషసాయి, జూనియర్ అసిస్టెంటు నారాయణ, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

● బిట్రగుంట: మండల కార్యాలయంలో ఎంపీడీవో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో


ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

రాయితీ రుణాల ఇంటర్వ్యూలకు 153 మంది హాజరైయ్యారు. ఐవోబీ బ్యాంక్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, యూబీఐఎస్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, సహాయక మేనేజర్ జోసెఫ్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ 41, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గోపి, కెనరా బ్యాంక్ సహాయక మేనేజర్ సుబ్రహ్మణ్యంలు దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

● వలేటివారిపాలెం: మండల కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 105 మంది హాజరైనట్లు ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. 30 యూనిట్లకు 130 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్‌ఆఫీసర్ చరణ్‌తేజ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

జలదంకి: ఎంపీడీవో బ్రహ్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ పత్రాలతో రావాలని తెలిపారు.

అల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఒరిజినల్ ప్రతాలతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎస్‌బీఐ, కెనరాబ్యాంకు, ఏపీజీబీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంకు, ఇస్కపల్లి కెనరాబ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఎంపిక జరుగుతుందన్నారు.

ముస్సిపల్ కార్యాలయంలో..

● కందుకూరు: సబ్సిడీ రుణాల కోసం ఓబీఎంఎంఎస్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రుణ మంజూరుకు బ్యాంకర్లు శుక్రవారం ముస్సిపల్ కార్యాలయంలో లోన్‌మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ అనూష ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రెండుసెట్లు నకలు తీసుకరావాలన్నారు.

టీడీపీ ఫ్లెక్సీల చించివేత

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్ట వైఎస్ఆర్ సర్కిల్, ముఖద్వారం వద్ద ఏర్పాటుచేసిన టీడీపీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చింపివేశారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్యలు నూతన సంవత్సర, సంక్రాంతి శుభా కాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. వాటిని చించి వేయడాన్ని గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

గిరిజన భాషాదినోత్సవం

అనంతసాగరం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో గురువారం గిరిజన భాషా దినోత్సవం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమ కనెక్షన్ల క్రమబద్ధీకరణ సర్వేకు ఆదేశం

కావలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అక్రమ కొళాయి కనెక్షన్‌లను క్రమబద్ధీకరించేందుకు సచివాలయాల వారీగా సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం పట్టణంలో 25వేలకు పైన నివాసాలుండగా కేవలం 6,100కొళాయి కనెక్షన్లు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అయితే పట్టణంలో సుమారు వెయ్యికి పైగా అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. వాటిని క్రమబద్ధీకరణకు రాజకీయాలు అడ్డువస్తున్నాయి. ప్రస్తుతం ఇంకా పెరిగే అవకాశం ఉంది. అయితే అమృత్‌పథకంలో భాగంగా ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలనే నిబంధనలో భాగంగా దీంతో సచివాలయాల వారీగా కొళాయి కనెక్షన్‌లు ఉన్న ఇళ్లు, లేని ఇళ్లు గుర్తించేందుకు సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేలో అక్రమ కొళాయి కనెక్షన్‌లు గుర్తించేందుకు అవకాశం ఉన్నందున ఇకనైనా వాటిని క్రమబద్ధీకరిస్తారా లేక రాజకీయనాయకుల ఒత్తిడిలకు తలొగ్గి సర్దుకుంటారా అనేది సర్వత్రా చర్చనీయాంశమైంది.

రూ.6లక్షల పరికరాలు, సైకిళ్ల పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం స్టేట్ బ్యాంక్ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజరు రాజేష్‌కుమార్ పటేల్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు రూ.6లక్షల విలువైన పరికరాలు, లింగసముద్రం మండలం పెంట్రాల యూపీ స్కూల్ విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీఐ రీజనల్ మేనేజరు సూర్య ప్రకాష్, శ్రీనివాసనాయక్, హెచ్ఎం ద్వారాకామయి పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి సర్టిఫికెట్లతో భవిష్యత్తు

అల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి సర్టిఫికెట్లతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి రవీంద్రనాథ్ తెలిపారు. విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్థానిక పేట జడ్పీ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, అజ్వర్వర్ నరసయ్య. వై.శ్రీనివాసులు, ఎన్.మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, డిఆర్పీలు కె.శ్రీకాంత్, పి.నరసయ్య పాల్గొన్నారు.

నిధులు కేటాయింపునకు ఒత్తిడి తేవాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో మెట్ట ప్రాంతాల్లో నిర్మితమవుతున్న జలాశయాలకు నిధులు కేటాయించేలా ఈప్రాంత ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య కోరారు. గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీతారాంసాగర్ సాధన సమితి, రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నిధుల లేమితో వెలుగొండ, పెద్దిరెడ్డిపల్లి, సీ తారాంసాగర్ జలాశయాల పనులు దశాబ్దాలు కొనసాగుతున్నా యన్నారు. ఎంపీటీసీ కాకు విజయమ్మ, జేవీవీ నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, కోడె రమణయ్య, బాలగురవయ్య పాల్గొన్నారు.